తీ తీ



Blank Page

1 + 1 = 1 మొదలైన

రేడియో నాటికలు

మహాకవి

శ్రీశ్రీ

విశాలాంధ్ర ప్రచురణాలయం

ఏలూరు రోడ్డు :: విజయవాడ-2

ప్రచురణ నెం. 591
ప్రథమ ముద్రణ : జనవరి 1964
ద్వితీయ ముద్రణ: జనవరి 1966

సాదా ప్రతి : 2.00

మేలు ప్రతి : 3.00

ముద్రణ :
స్వాతంత్ర్య ఆర్ట్ ప్రింటర్స్
విజయవాడ - 4

1+1 =1 మొదలైన

రేడియో నాటికలు

ఇందులో...

చతురస్రం

గవేషణ

అనంతరయాత్ర

సుప్తాస్తికలు

విదూషకుడి ఆత్మహత్య

గ్రామఫోసురికార్డుల తిరుగుబాటు

గుమాస్తా కల

ఒంటరిబావి

భూతాల కొలిమి

బలి (వామనమూర్త్యావిర్భావఘట్టం;-
పోతనామాత్యునికి కృతజ్ఞతతో)

మహాప్రపంచం

Blank Page

చతురస్రం

["చ]తురస్రం" నాటిక ఎప్పుడో నేను వ్రాయవలసింది. భగవంతుని గురించీ, మానవుని గురించీ నాకున్న అభిప్రాయాలను ఈ నాటిక ద్వారా కొంతలో కొంతయినా తెలియజేయగలిగానని నే ననుకుంటున్నాను. శ్రీశ్రీని నిరీశ్వరవాదిగా చిత్రించేవారు కొందరున్నారని నాకు తెలుసు. అలాంటివారినే నేను ముఖ్యంగా ఈ నాటికను శ్రద్ధగా చదవండని కోరుతున్నాను.

నేను మూడుసార్లు మృత్యువును జయించానని సవినయంగా మనవి చేస్తున్నాను. ఆ వివరాలను ఇంకోసారి–బహుశా కావ్యరూపంలో ప్రజల సమక్షంలో పెడతాను ప్రస్తుతం నేను చెప్పబోయే దేమిటంటే మరణమంటే నాకు భయం లేదనే. ఎప్పటికైనా మానవుడు మరణంమీద విజయం సాధిస్తాడనే నమ్మకం నాకుంది. ఆ నమ్మకమే ఈ నాటికా రచనకు ఆధారం.

"1962 ఫిబ్రవరి నెలలో ప్రళయం వచ్చి మద్రాసు మునిగిపోతుంది. కాబట్టి ఆశ్రయం యిస్తాను, ఆశ్రమానికి రమ్మ"ని ఒక మహర్షి నాకు ఆహ్వానం అందజేస్తే, నే నిచ్చిన జవాబు;"మద్రాసు నగరం మునిగిపోయి ఇక్కడున్న లక్షలాది ప్రజలు చచ్చిపోతే వారితోబాటు నేనూ చస్తానుగాని, ప్రమాదం నించి పారిపోయి బలుసాకు తినను"అన్నాను. అలాగే ఒకప్పుడు

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బాంబుల భయంవల్ల ప్రజలంతా మద్రాసునుంచి పారిపోతూ ఉన్నప్పుడు, నేను మాత్రం నా స్థలం వదల లేదు. విశాఖపట్టణం మీద జపాన్ వారు బాంబులు వేసిననాడు, మద్రాసులో సైరెన్ల కూత మోగినప్పుడు విశాలమైన డాబామీద నేను విశ్రాంతిగా నిద్ర పోతున్నాను. ఇదంతా ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటే మరణానికి భయపడే మానవులకు ధైర్యం చెప్పడానికి.

ఇక ఈ "చతురస్రం" గురించి ఒకటి రెండు మాటలు. చతురస్రం అంటే నలుచదరం. ఎ బి సి డి అనే చదరం. ఈ చదరంలో అన్ని బాహువులూ సమానమైనవనే అనుకోకూడదు. అలాగే ఇందులోనూ నలుగురు ముఖ్య పాత్రలూ, కథాకాలం నాటికి వేరు వేరు వయస్సులవారు. అందులో ఏ. జ్ఞానం అనే వైజ్ఞానికుడు. ఆయన వయస్సు 70 ఏళ్లు. బి. రాజ్యం అనే ఆవిడ. ఆమె వయస్సు 50 ఏళ్లు. సి. కళ అనే అమ్మాయి. ఆ పిల్ల వయస్సు 10 ఏళ్లు. డి. సిరి అనే కవి. అతని వయస్సు 30 ఏళ్లు.

కథాకాలం అని కదూ అన్నాను. ఆ కాలం ఏదో మరి చెప్పొద్దూ. ఇది సుమారు ఒక గంటసేపు సాగే నాటకం. కాని కథాక్రమం ప్రకారం ఒక ఉదయంనుంచి మరునాటి ఉదయంవరకు కథ సాగుతుంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, అర్ధరాత్రి. ఉదయం అని మధ్య మధ్య కవి వచ్చి మీకు కాలాన్ని జ్ఞాపకం చేస్తూఉంటాడు. 1999 వ సంవత్సరం డిసెంబరు 31 వ తేదీని ఈ కథ ప్రారంభమవుతుంది. అప్పుడు చంద్రలోకంనుంచి మానవుడు అమృతం తెచ్చాడని ఐక్యరాజ్యసమితికి తెలుస్తుంది. అమృతం పంచిపెడితే మానవులంతా ముప్పయ్యేళ్ళ వాళ్ళయిపోతారు. అప్పటికి మానవ కుటుంబమంతా రాజకీయ స్వాతంత్ర్యమూ, ఆర్థిక స్వాతంత్ర్యమూ అనుభవిస్తూ, మానసిక స్వాతంత్ర్యం సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. అమృతాన్ని అందరికీ పంచిపెడితే ఈ స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది. కాని సమితిలోనే కొందరు దీనికి అడ్డు చెబుతారు. అయితే ఆనాడు ప్రగతినికోరే దేశాలే ఐక్యరాజ్యసమితిలో అధికసంఖ్యాకంగా ఉండడంవల్ల ఆఫ్రో-ఆసియన్ రాజ్యాల తరపున కాంగో ప్రతినిధి లుముంబా జూనియర్ ప్రతిపాదించిన తీర్మానం నెగ్గుతుంది. ఆలస్యం అమృతం విషం.

తక్షణమే అమృతాన్ని మానవజాతికి పంచిపెట్టాలని ఆఫ్రో – ఆసియన్ తీర్మానం. అది నెగ్గిన అరగంటలో ప్రపంచమంతటా అమృతాన్ని అఖిల ప్రపంచ ఆరోగ్య శాఖాసంస్థ ప్రజలకు అందజేస్తుంది. మన చతురస్రంలోని నలుగురూ కూడా ముప్పయేళ్ళ వాళ్ళయిపోతారు. 70 ఏళ్ళ జ్ఞానం, 50 ఏళ్ళ రాజ్యం, పదేళ్ళ కళా, ఎటొచ్చీ కవిగారైన సిరిగారు మాత్రం నిన్న 30 ఏళ్ళవాడే, నేడూ 30 ఏళ్ళవాడే.

ఇరవయ్యో శతాబ్దం అంతమవుతుంది. ఇరవై ఒకటో శతాబ్దం ప్రవేశిస్తుంది. ఆ ఉదయాన్ని వర్ణిస్తాడు కవి – తర్వాత....

ఇలాగ కథంతా నేనే చెప్పేస్తే ఇక మీకు వినేందు కేమీ ఉండదు. కాబట్టి ఇక్కడితో నా ఘోష ఆపుతున్నాను.

ఇక ప్రారంభం దగ్గిర ప్రారంభిద్దాం.]

స్త్రీ : ఏదో జరగబోతోంది.

ఏదో జరగబోతోంది.

ఏదో జరుగుతుం దిప్పుడు.

పురు : ఏవరో వస్తున్నారు.

ఎవరో వస్తున్నారు.

ఎవరో వస్తున్నా రిట్టు....(ఈల)....ష్....

సిరి : నా పేరు సిరి.

స్త్రీ : ఈయ నొక కవి.

పురు : ఇంటిపేరో మరి ?

సిరి : సరి – ఆసిరీ. ఆ సంగతి అలా విసిరీ,

ఇది ఉదయం,

నా హృదయం వయస్సు ముప్పయ్యేళ్ళు.

నా మనస్సు వయస్సు ముప్పయ్యేళ్ళు.

ఏ వయస్సు ఈ ఉదయానికీ సరిగ్గా ముప్పయ్యేళ్లు.

ఇది ఉదయం.

నిద్రలో కరిగిపోయింది క్రితం రాత్రి.

పక్షులూ, బస్సులూ పంపించేశాయి నిశ్శబ్దాన్ని.
పరుపులకిందకి చెట్లపేళ్ళ సందుకి.
ఆకాశపు అంచుకి.

ప్రపంచం మేలుకొని ఆవలించింది. లేదా ఆవలించి మేలుకొంది. (మీ ఇష్టం ఎలా వీలైతే అలా, ఎలా సులువైతే అలా.... ఇటు మూట అటో అటు మూట ఇటో :)

నిద్రపోయిన (కాదు వచ్చిన) ప్రపంచం నిన్నట్లోంచి నేట్లోకి దూకింది.

సముద్రం లేచింది – అరణ్యం లేచింది.
గ్రామం లేచింది – పట్టణం లేచింది.
నగరం లేచింది – మహానగరం లేచింది.
నదులూ, నదుల్లో చేపలూ,
గనులూ, గనుల్లో నగలూ,
కనులూ, కనుల్లో వగలూ – మేలుకున్నాయి!
నేనింకా నిద్రపోతున్నాను.
నేనింకా నిన్నట్లోనే నాస్తున్నాను.
మసగ్గా ఉంది. విసుగ్గా ఉంది.
అలక : అనుకున్నవేమీ కాకుండా ఉన్నాయని,
నిద్రయినా సరిగ్గా రాకుండా ఉందని.
నాకు తెలుసు నాకు తెలియకుండా తెలవారిందని.
నాకు తెలుసు నాకు తెలిసినవన్నీ నాకు తెలుసునని,

పాలవాడు పాలు తెచ్చాడు.
పేపరువాడు పేపరిచ్చాడు.

* * *

న్యూస్ ఎనౌన్సర్ : అఖిల ప్రపంచ టెలిరేడియో వార్తాసంస్థ, తెలుగులో వార్తలు. చదువుతున్నది....విశ్వం.
సమయం – 1999 డిసెంబర్ 31 వ తేదీ....
స్థలం – ఆంధ్రప్రదేశంలో కొత్తగా నిర్మించిన అరవై అంతస్తుల ఐక్యరాజ్య సమితి భవనం.

పండిట్ మన్‌హర్‌లాల్ : ఇవ్వాళ్టి సుదినంహో. మనం ఈ సమావేశం ఇప్పుడు ఇక్కడ చెయ్యడం బహుత్ బహుత్ ముదావహం. ఐ ప్రొపోజ్ మిస్టర్ శ్రీ రావ్ యూజ్ ప్రెసిడెంట్. డిలా కంకూర్స్ డె నసియోం స్వీని.

శ్రీ రావ్ : షుక్రియా పండిట్‌జీ.
నేను తెలుగువాణ్ణి.
నన్ను ఈనాటి ఈ సభకి అధ్యక్షుణ్ణిగా ఎన్నుకోవడం నాకూ, నా భాషకీ....ప్రపంచం చేస్తున్న గౌరవం, మర్సి, మర్సి బకూ.

పండిట్ మన్‌హర్‌లాల్ : గుడ్‌మార్నింగ్ డెలిగేట్స్.
ఇప్పుడూ ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడూ ప్రపంచ్ పరిస్థితిని పర్యాలోకన్ కరేంగే.

శ్రీరావ్ : థ్యాంక్ యూ మిస్టర్ మనహర్.
ఇవ్వాళతో ఇరవయ్యో శతాబ్దం ముగుస్తుంది. ఒక కొత్త సంవత్సరంలో, ఒక కొత్త శతాబ్దంలో అడుగు పెడుతోంది మానవజాతి. 150 స్వతంత్ర దేశాలు సమావేశమైన మహాసభ ఇది. ఈ దేశాలన్నిటిలోను ఒక్కొక్క యునైటెడ్ నేషన్స్ భవనం ఉంది. తెలుగువాణ్ణి కాబట్టి తెలుగులో మాట్లాడుతున్నాను. నాకుతెలుసు. నా ప్రసంగం ఈ క్షణంలో ప్రపంచపు నలభైనాలుగు ప్రధాన భాషల్లోకి పరివర్తనం చెందుతోందని.
ఐ సెల్యూట్ మై ఆఫ్రికన్ కామ్రేడ్స్
ఐ సెల్యూట్ మై ల్యాటిన్ అమెరికన్ కామ్రేడ్స్
ఐ సెల్యూట్ ఆల్ మాన్‌కైండ్

ఈ దినం ప్రపంచంలో ఎక్కడా అస్వతంత్ర రాజ్యం లేదు. కాని ఒక పాతికేళ్లు వెనక్కి తిరిగి చూడండి. చరిత్ర మీకు తెలుసు. వలస రాజ్యాలవాళ్లు, కలవాళ్లు ఎన్ని వలలుపన్ని ఎన్ని విధాలుగా తమ విధానాన్ని కొనసాగించుకోవాలనుకున్నారో. కాని మేలుకున్న మానవజాతి ముందడుగు వేసింది. వలసవిధానం నశించింది. మనిషి రాజకీయంగా స్వతంత్రుడయ్యాడు. అది పాతికేళ్ళ క్రిందట. ఆ మీదట—

ఐక్యరాజ్యసమితి యుద్ధాన్ని బహిష్కరించింది.
థాంక్స్ టు యు. ఎస్. ఎస్. ఆర్.
ంక్స్ టు యు. యస్. ఎ.
థాంక్స్ టు ఎవ్వెరిబడీ ఎవ్వెరివ్హేర్,
యుద్ధరాక్షసికి అహింసాయుతంగా అంత్యక్రియలు జరిగాయి.
మానవ జాతి ఒకే కుటుంబం
అన్నమాటకి ప్రాణం వచ్చింది.
హియర్, హియర్, హియర్. (చప్పట్లు)

శ్రీరావ్ : ఫ్రెండ్స్....రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన మానవుడు ఆర్థిక స్వాతంత్ర్యంకోసం పోరాటం సాగించాడు. మళ్ళీ ఎన్నో ఆటంకాలు, మళ్ళీ ఎన్నో అవాంతరాలు. కలవాళ్ళనీ, లేనివాళ్ళనీ వ్యత్యాసాలు లేకపోతే, లేనివాళ్ళకి లేనివాళ్లు, కానివాళ్లు దయాధర్మ భిక్షయా, సహాయ సానుభూతి సహకారాలు చూపించడం పోతుంది. అందువల్ల మానవుల్లోని మానవత్వం నశిస్తుంది. అనే ఒక వింత వాదం వితండవాదం బయలుదేరింది. మళ్ళీయుద్ధరాక్షసికి ఈసమస్య ఆధారంగా ప్రాణప్రతిష్ట జరిగే ప్రమాదం లోకాన్ని ఎదుర్కొంది. ప్రశాంతంగా శాస్త్రీయ విజ్ఞాన పరిశోధనలు సాగిస్తున్నవారు,వివిధ కళలలో విశేషవిజయాలు సాధిస్తున్న కళాకారులు, విద్యావేత్తలు మొదలైన మేధావులంతా, ఈ మన ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యం క్రింద ప్రపంచం అంతటికీ....ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు. యుద్ధ ప్రయత్నాలక్రింద ఖర్చవుతున్న కోటానుకోట్ల ధనం

మానవుని ఆరోగ్యానికీ, విద్యకీ, ఆనందమయ జీవితానికి వినియోగ
మవుతున్న స్థితిలో ఇప్పుడు మనం ఉన్నాము.
కాని....
రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా....
ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినా....
మానవజాతి కింకా మానసిక స్వాతంత్ర్యం ఏర్పడలేదు.
మన ఆలోచన లింకా అరాజికదశలోనే ఉన్నవి.
అరణ్యాలు మన మనస్సులు.
అగాధాలు అజ్ఞేయాలు మన మనోలోకపు భావనా విధానాలు.
మానసిక స్వాతంత్ర్యం సాధించడమే ఈనాటి మానవ సమస్య.

* * *

కవి ; మధ్యాహ్నం అయింది. డెలిగేట్లు లంచికి పోయారు. కథలన్నీ
కంచికి పోయాయి. ఎంత వింతగా ఉంది ఈ మధ్యాహ్నం. ఎంత
హాయిగా ఉందినా హృదయం. ఎంత నిర్మలంగా ఉందినా మనస్సు.
ఈర్ష్యల్లేని, ద్వేషాలు లేని ఈ మానవజాతిని ఎంతగా ప్రేమిస్తు
న్నాను నేను.
ప్రేమ....ప్రేమ....ప్రేమ

కళ : మామా....మామా....మామా....

సిరి : కళా, కళా, కళా....
ఎందుకొచ్చా విలా – స్కూలు లేదా ?

కళ : పరీక్షలు కాదూ ? అంచేత మధ్యాహ్నం సెలవు.

సిరి : జాగ్రత్త. పడగలవు. ఏవి టా గంతులు.

కళ : నిన్న లెక్కల పరీక్షలో నాకు ఫస్టు మార్కొచ్చింది మామయ్యా.

సిరి : అందుకా ఆ చిందులు, మరివాళ ?

కళ : చరిత్ర. ప్రపంచ చరిత్ర.

సిరి : సరిగ్గా రాశావా ?

కళ : రాశాను. కానీ....

సిరి : కాని ?

కళ ; ఫస్టుమార్క్ రాదేమో ?

సిరి : కళకి ప్రపంచ చరిత్రలో ఫస్టుమార్క్ రాకపోవడం కవికే కళంకం.

కళ : ఇవాళ నా పుట్టిన రోజు మావయ్యా.

సిరి : శుభం.

కళ : పదేళ్ళుపెళ్ళీ పదకొండో యేడొచ్చింది నాకు.

సిరి : సంతోషం.

కళ : మావా....ఇవాళ మన వూళ్లో ఐక్యరాజ్యసమితి సమావేశం కదూ....

సిరి : అవును.

కళ : గొప్ప గొప్పవాళంతా వస్తారు కదూ ?

సిరి : వచ్చారు.

* * *

ఎనౌన్సర్ : ఐక్యరాజ్యసమితి భవనంలో పదో అంతస్తులో భద్రతామండలి రహస్య సమావేశం జరుగుతోంది. సింహళ ప్రతినిధి శ్రీమతి సిగీరియా యీ సభకు అధ్యక్షత వహించారు.

సిలన్ : మిత్రులారా ! చంద్రమండలానికి వెళ్ళిన మన వైజ్ఞానిక బృందం ఇప్పుడే ఒక రిపోర్టుపంపింది. దానిప్రతులు మీ ముందరవున్నాయి. చంద్రమండలం చేరగానే వారిలో వచ్చిన మార్పులన్నీ వివరిస్తూ ఒక రహస్య నివేదికను వెళ్లిన యాభై మంది వైజ్ఞానికుల తరఫునా వారి నాయకుడు మనకు పంపించాడు. బయలుదేరినప్పుడు వారి వయస్సులు వేరు వేరు. సుధానిధి అయిన చంద్రునిలోని అమృతం వల్ల వెళ్ళినవారంతా ముప్పయ్యేళ్ల వారయిపోయారు. అనగా త్రిదశులయా రన్నమాట. మానవులు దేవతలుగా మారగల అవకాశం ఇప్పుడు లభించింది. ఈ సాయంత్రమే వైజ్ఞానిక బృందం న్యూఢిల్లీలో దిగుతుంది. మానవజాతి అంతకీ సరిపోయే అమృతం వారు తీసుకొని వస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా వరల్డ్

హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ అమృతాన్ని అరగంటలో అన్ని ప్రాంతాలవారికీ అందజేయవచ్చును. భద్రతామండలి ఈ విషయమై నిర్ణయం చేయవలసియున్నది. ఇందులో రాజకీయా లేవీ లేవు. అమృతం పంచిపెట్టాలా వద్దా, లేక పెంటనే పంచిపెట్టాలా, కొన్నాళ్ళదాకా ఆగాలా అన్నదే ఇప్పుడు మనముందువున్న సమస్య. దీన్నిగురించి మొట్ట మొదట బ్రిటిష్ ప్రతినిధి సర్ హైమన్ ప్రసంగిస్తారు.

* * *

హైమన్ : థ్యాంక్స్ మాడమ్ ప్రసిడెంట్.

అమృతం పంచిపెట్టాలా వద్దా అనే విషయమై రెండు అభిప్రాయా లెప్పుడూ ఉండవు. ఇప్పుడూ లేవు. అయితే అకస్మాత్తుగా, తక్షణమే పంచవలసిన అవసరం ఏం వచ్చిందని నే నడుగుతున్నాను. మానవులంతా ముప్పయ్యేళ్ళవాళ్ళయిపోయినంత మాత్రంచేత, వాళ్ళ మనస్సులు, వాళ్ళ ఆలోచనలూ ముప్పయ్యేళ్ళవాళ్ళవే అవుతాయను కోవడం పొరపాటు. ఈనాడు చంటిపిల్లలు మొదలు చనిపోవటానికి సిద్ధంగా ఉన్న వృద్ధులవరకూ ఎన్నో వయో వ్యత్యాసాలను ప్రదర్శిస్తోంది మానవజాతి. ఒక్క మందుతో ఈ ఎగుడు దిగుడు లన్నీ సర్దుకొని చదునయిపోతాయా? ఈ విషయమై ఈ సభకు వచ్చేముందుగా మా బ్రిటిష్ వైజ్ఞానిక నిపుణులతో లంచి టేబులు వద్ద ఆషామాషిగా చర్చించాను. అందరూ ఇంచుమించు ఒకే అభి ప్రాయాన్ని ప్రకటించారు : మందు తీసికొన్న మనుష్యుల – మనస్సులు మారిపోవని. మానవజాతి, మానసిక స్వాతంత్ర్యం సాధించాలంటే కొంత కృషి, కొంత ప్రచారమూ, కొంత ప్రయత్నమూ అవసరం. ముందుగా మనం మానవులను మానసిక స్వాతంత్ర్యానికి సంసిద్ధుల్ని చెయ్యాలి. తర్వాత మందియ్యాలి. అందుచేత ఒక పది సంవత్సరాలదాకా, లేదా కనీసం ఐదు సంవత్సరాల దాకా ఈ అమృతం సమస్యకి వాయిదా వెయ్యా లని కోరుతున్నాను.

భా. ప్ర: అడ్డువచ్చినందుకు క్షమించాలి. మాడమ్ ప్రెసిడెంట్, మీ అనుజ్ఞతో....

సిలన్ : ఎవరు ? భారత ప్రతినిధిగారా : మాట్లాడవచ్చు.

భా. ప్ర : ఇరవయ్యో శతాబ్దం అంతం కావస్తున్నా, ఇరవయ్యో శతాబ్దపు ప్రారంభంలో ఆడినలాంటి మాటలే ఆడుతున్నాడు మన బ్రిటీషు మిత్రుడు. ఇప్పటికీ ఈ బ్రిటిషువారి మనస్తత్వం ప్రగతి నిరోధక భావాలనే ప్రసరిస్తున్నదని చెప్పడానికి చింతిస్తున్నాను. ఎప్పుడూ సమస్యలను వాయిదా వెయ్యడం, జాప్యంచెయ్యడం తప్ప,సూటిగా ఎదుర్కొని సులువుగా పరిష్కరించడం కనబడదు. ఆనాడు ఇండియా స్వాతంత్ర్యానికి కూడా ఇలాగే వాయిదాలు వేశారు. మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన వెంటనే భారతీయులకు స్వేచ్ఛ లభించి వుండవలసింది-కాని అలా జరగలేదు, తర్వాతపాతికేళ్లకు పైగా గాంధి మహాత్ముని నాయకత్వంక్రింద భారతీయులు అహింసాయుతంగా గొప్ప పోరాటాలు సాగించిన మీదట కదా మేం స్వతంత్రుల మయ్యాము. విప్లవాలతోను, రక్తపాతాలతోను ఇతర దేశాలకు స్వాతంత్ర్యం సిద్ధిస్తే, ఒక్క భారతదేశమే అహింసాయుతంగా, రక్తపాత రహితంగా....

హైమన్ : పోరపాటు, రక్తపాతం లేకుండా స్వరాజ్యం సంపాదించామని మన మిత్రుడు భారత ప్రతినిధి యీనాడు ప్రచారం చేసుకోవచ్చు. నా అభ్యంతరం లేదు. కాని చరిత్ర ఇస్తున్న సాక్ష్యం మాటేమిటి? ఇండియాకు స్వాతంత్ర్యం రాకముందూ, వచ్చిన తర్వాత ఎన్ని లక్షలమంది హిందువులూ, ముస్లిములూ మరణించలేదు? స్వరాజ్య ప్రదానాంతరం మీ గాంధిమహాత్ముని రక్తాన్నే ఒక మత దురహంకారి మీ రాజధానినగరంలో చిందించాడే.

భా. ప్ర : ఐ అబ్జెక్ట్ మాడమ్ ప్రెసిడెంట్. స్వరాజ్య ప్రదానం అన్నమాటకి నేను అసమ్మతి తెలుపుతున్నాను. స్వరాజ్యం మా కెవరూ దానంగా ఇవ్వలేదు.

హైమన్ : అయితే నా మిత్రుడు భారతప్రతినిధికి అసలు రహస్యం తెలియ

దన్నమాట. ఇండియాకి స్వాతంత్ర్యం అహింసా యుద్ధాలవల్ల రాలేదు. స్టాలిన్ గ్రాడ్‌లో రష్యా గెలువడంవల్ల రాలేదు. నేతాజీ సుభాస్‌చంద్రబోస్ సేనలు నిర్మించడంవల్ల రాలేదు.

భా. ప్ర : అయితే మరెలా వచ్చిందంటారో అన్నీ తెలిసిన మన బ్రిటీష్ మిత్రుడు ?

హైమన్స్ : అన్నీ తెలిసిన వాణ్ణిగా అభినయించడం లేదు నేను. ఇండియాకు స్వాంతంత్ర్యం ఎలా వచ్చిందో నాకు తెలుసు. బ్రిటిష్ రాజ కుటుంబమే ఇండియాకు స్వాతంత్ర్యం ఇచ్చింది. ఆనాడు ఆరవ జార్జి చక్రవర్తికి ఎలిజబెత్ యువరాణి ఇచ్చిన సలహా వల్లనే ఇండియా స్వతంత్ర రాజ్యమయింది. దీనికి సంబంధించిన రహస్య పత్రాలు బకింగ్‌హాం భవనపు పాత రికార్డుల గదిలో వున్నాయి.

భా. ప ; ఆ రహస్య పత్రాలేవో మేం చూడగల అవకాశం ఉందా ?

హైమన్ : అందరూ చూసే అవకాశం ఉంటే, అవి రహస్య పత్రాలెలా అవుతాయి ?

భా. ప్ర : నాకు తెలిసిన మట్టుకు బ్రిటన్‌లో పార్లమెంటు నిర్ణయాలు చేస్తుందనీ, లాంఛనప్రాయంగా దానికి రాజముద్ర లభిస్తుందనీ అనుకుంటున్నానే.

హైమన్ : బ్రిటీష్ పార్లమెంటు గురించి మాకన్న తనకే ఎక్కువ తెలుసు నసుకొంటూన్న మన భారతీయ మిత్రుణ్ణి, నేను అభినందించ కుండా ఉండలేకపోతున్నాను.

భా. ప్ర : మీ అభినందనలోని ఆంతర్యానికి నేను ఆనందిస్తున్నాను.

సిలన్ : ఆర్డర్, ఆర్డర్, ఫ్రెండ్స్....మనం అసలు విషయం మరచిపోయి అనేక దశాబ్దాలనాటి సంగతులు చర్చిస్తున్నాం. నేను మొదటే చెప్పాను. ఈనాడు యీ సభ రాజకీయాలకి చర్చావేదిక కాదని. మన ముందున్న సమస్య విషయమే మాట్లాడుకుందాం. సర్. జాన్, మీ రింకా ప్రసంగించదలచుకున్నారా ?

హైమన్ : నో మెడమ్. నేను చెప్పవలసిందేదో చెప్పేశాను.

సిలన్ : ఇప్పుడు అమెరికా ప్రతినిధి మిస్టర్ శాంశ్వన్ మాట్లాడుతారు.

శాంశ్వన్ ; నాది ప్రజాస్వామ్య దృక్పథం. మెజారిటీ అభిప్రాయాన్నే ఆమోదిస్తాను. కాని నా ఓటు మాత్రం బ్రిటీష్ ప్రతినిధి అభిప్రాయానికే.

సిలన్ : కాంగో ప్రతినిధి శ్రీ లుముంబా జూనియర్.

లు. జూ. : ఆలస్యం అమృతం విషం. ఆలస్యం చేయకుండా అమృతాన్ని పంచిపెట్టాలి, అంతే.

రష్యా : వెల్ సెడ్, వెల్ సెడ్.

సిలన్ : ఎవరది, సోవియట్ ప్రతినిధిగారా ? మైక్ దగ్గరకివచ్చి మాట్లాడవచ్చునే.

రష్యా : నా సమయం వచ్చినప్పుడు నేను మాట్లాడుతాను.

సిలన్ : సరే. ఇప్పుడు పిలిప్పీన్స్ ప్రతినిధి డూడూడూగారు మాట్లాడుతారు.

ఫిలిప్పీన్స్ : కాంగో ప్రతినిధి ముక్తసరిగా మూడు మాటల్లో సమస్యని పరిష్కరించి వేశాడు. కాని యిది అనుకున్నంత సులువుగా అయే పనికాదు. నాగరికతలో వెనుకబడిన దేశాలకు స్వతంత్ర రాజ్యాలతో సమాన ప్రపత్తి ఇస్తే ఇలాటి అనర్థాలే తటస్థిస్తాయి.

లు : కాంగో వెనుకబడిన దేశంకాదు. అన్ని రంగాలలోను పురోగమిస్తున్న శ్రేయోరాజ్యం అది.

ఫిలిప్పీన్స్ : అని మీరు అనుకుంటున్నారు. నిజంగా ఎంతవరకు పురోగమించారు ? ఇప్పటికి మీ కాంగోలో నరమాంసం భుజించే వాళ్లున్నారు.

లు ; ఐ అబ్జెక్ట్ మాడమ్ ప్రెసిడెంట్. ఇది మా దేశపు ఆంతరంగిక వ్యవహారాల్లో ప్రత్యక్ష జోక్యం. ఎవరో కొందరు పాత సంప్రదాయాలను వదలుకోలేని ఛాందసులు ఏడాది కొకమారు విందులో నరమాంసం-అదైనా కొద్దిగా తీసుకుంటారు. ఘోరమైన ఈ ఆచారాన్ని ఆఫ్రికా ఖండమంతా అసహ్యించుకుంటోంది. నియంతృత్వ ధోరణితో నరమాంస భక్షణని నిషేధించడం సులభమే. కాని త్వరలోనే యీ దురాచారం తనంత తానే సమసిపోతుంది.

ఫిలిప్పీన్స్ : కాని, ఈలోగా నరమాంస భక్షకుల నాగరికతను ఒకందుకు అభినందించవలసిందే. తింటున్నది నరమాంసమైనా నైపులూ, ఫోర్క్‌లూ ఉపయోగిస్తున్నారు.

సిలన్ : ఆర్డర్, ఆర్డర్, మళ్ళీ విషయానికి దూరమవుతున్నాం. ప్రస్తుత సమస్యమీద మాట్లాడాలని ఫిలిప్పీన్స్ ప్రతినిధిగారిని కోరుతున్నాను.

ఫిలిప్పీన్స్ : వాయిదా. వాయిదా. అమృతం పంచిపెట్టడానికి ఆరునెలలు వాయిదా.

సిలన్ : ఇప్పుడు సోవియట్ ప్రతినిధి ప్రొఫెసర్ న్యాయకోవస్కీగారు మాట్లాడుతారు.

రష్యా : పసీటా మాడమ్ ప్రెసిడెంట్ దోస్తులారా, నేస్తురాలా, ప్రపంచ చరిత్రలో ఒక ప్రధాన సంఘటన జరగబోతున్న సమయంలో మనం సమావేశం అవుతున్నాం. మానవజాతి మరణాన్ని జయించే కాలం సన్నిహిత భావిలోనే ఉంది. చంద్రమండలానికి వెళ్ళిన వైజ్ఞానికులలో చాలామంది రష్యావారే. అంతమాత్రంచేత మేము గర్వం ప్రకటించేది లేదు. ఈ విజయం మానవజాతి సమష్టి విజయం అని అందరూ భావించాలి. అందుచేత అమృతాన్ని అందరికీ సమానంగా పంచిపెట్టాలి. ఇది ఎంత శీఘ్రం జరిగితే అంత మంచిది. నేటితో యిరవయ్యో శతాబ్దం అంతమవుతోంది. మానవులు మరో శతాబ్దంలో ప్రవేశిస్తున్నారు. మన మిత్రుడు బ్రిటీష్ ప్రతినిధి చెప్పినట్లు మన మనోభావాలలో ఎన్నో ఎగుడు దిగుడులూ, వ్యత్యాసాలూ ఉన్నమాట నిజమే. కాని యిది యీనాటి నిజం. ఈ వ్యత్యాసాలన్నీ ఇలాగే ఉంటాయా రేపు కూడా ? ఈ సభనే చూడండి. ఒక్కొక్క మహాదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక్కొక్క ప్రముఖ వ్యక్తితో సహా ఎంతెంత జాతి విద్వేషం ఎన్నెన్ని పాతభావాలూ ప్రదర్శించబడ్డాయో: వీటిని ప్రయత్నించి పారదోలాలి. అందుకే అమృత సేవనం మొదటి మెట్టు. సృష్టి సమానాంతర రేఖలలో ప్రవహిస్తోందని నేటి వైజ్ఞానికులలో కొంద

రంటున్నారు. ఇది ఐన్‌స్టీన్ సిద్ధాంతానికి విరుద్ధమని కొందరంటున్నారు. ఇంకా ఖగోళాలకు సంబంధించిన భోగట్టా మరి కొంత తెలిసేదాకా దీని విషయం యిదమిత్థమని నిర్ణయింపలేము. కాని ఒకటి నిశ్చయమనే చెప్పవచ్చును. మానవ మనస్సులో అనేక చతురస్రాలున్నాయి. రెండేసిరెండేసి సమానాంతరరేఖలునిలువుగా ప్రవహిస్తున్నాయనుకోండి. అప్పుడువాటిమధ్య ఎన్నోచతురస్రాలు ఏర్పడతాయికదా. అయితే ఇవిస్క్వేరులా, రెక్టాంగిల్సా? సమబాహు చతురస్రాలా? విషమబాహు చతురస్రాలా? ఈ చతురస్రాల సమస్యలను పరిష్కరించడానికి కూడా ప్రజి లందరికి అమృతాన్ని పంచిపెట్ట వలసిందే. ప్రస్తుత ప్రపంచ స్థితిలో ఇవి రెక్టాంగిల్స్ అనే నే ననుకుంటున్నాను. ప్రవహిస్తున్న అడ్డు, నిలువు సమానాంతర రేఖలుగా కాలాన్ని నేను భావిస్తున్నాను. మానవుడు టైమ్‌ని స్క్వేర్ చెయ్యాలి. ఆఖరిమాట. భద్రతా మండలిలో కూడా యీనాడు ప్రగతిశీల రాజ్యాలదే మెజారిటీ. మా ప్రతిపాదనలను బ్రిటన్‌గాని, అమెరికాగాని వీటో చెయ్యడం ఎప్పుడో మానేశాయి. అది వారి ప్రజాస్వామ్య దృక్పథానికి నిదర్శనం. అందుకు వారిని అభినందిస్తున్నాను. కాని మానవజాతి భవిష్యత్తునే తీర్చిదిద్దగల ఈ మహత్తర విషయాన్ని జనరల్ అసెంబ్లీలోనే – బహిరంగ చర్చలోనే ఓటుకు పెట్టాలని నేను సూచిస్తున్నాను.

(కరతాళ ధ్వనులు)

సిలన్ : సాయంత్ర మయింది. ఈ సభను వాయిదా వేస్తున్నాను.

* * *

కవి : సాయంకాల మయింది.

కండలు తిరిగిన సాయంత్రం చండప్రచండంగా గర్జిస్తోంది.
కండలు తిరిగిన సాయంత్రం కష్టాన్నీ సుఖాన్నీ మోస్తోంది కావడి కుండల్లాగ.

కండలు తిరిగిన సాయంత్రం కవిత్వం మాట్లాడుతోంది.
గడ్డంమాసిన సాయంత్రం గాడిద కూత కూస్తోంది.

గడ్డంమూసిన సాయంత్రం కథలని దొంగిలిస్తోంది.
గడ్డంమూసిన సాయంత్రం గాగరా ధరించి తిరుగుతోంది.
కొమ్ములు తిరిగిన సాయంత్రం రొమ్మువిరిచి నిలబడింది.
కొమ్ములు తిరిగిన సాయంత్రం కోటలుదాటే మాటలాడుతోంది.
కొమ్ములు తిరిగిన సాయంత్రం కోటికి పడిగలెత్తుతోంది.

జ్ఞానం: నడిసముద్రంలో సాయంత్రం గుడిలో దీర్ఘాలు తీస్తోంది. ఇలాంటి కవిత్వం ఈజీ; ఎవరైనా చెప్పగలరు.

సిరి: పగలరూ. గురూ, ఇలా వేంచేశారేం ఎద్దనే వేళ.

జ్ఞా: వేళాకోళాలేల.

సిండి: కూర్చోండి తాతయ్యా.

జ్ఞా : కూర్చోడానికి వేళలేదు.

సి : అయితే నిలబడే మాట్లాడండి. కాని జ్ఞానంగారి యెదుట కవిగారు కూర్చొని మాట్లాడకూడదు. నేనూ నిలబడతాను.

జ్ఞా : నిలబడు. దృఢంగా నిలబడు. సిద్ధంగా నిలబడు.
ఒరే సిరా !

సిరి : సిరా కాదు సిరి.

జ్ఞా : సారీ సిరి. ఇవాళ నాకో అనుమానం.

సిరి : ఏమిటది.

జ్ఞా : మానవుడు జరామరణాలని జయిస్తాడు.

సిరి : కవులు తమ కవిత్వంలో అదే ఆనాటినుంచీ అన్నారు.

జ్ఞా : కాని ఈనాడు అది సాధ్యం.

సిరి : ఏం. మీకేదైనా రహస్య వర్తమానం తెలిసిందా ?

జ్ఞా : నేను వైజ్ఞానికుణ్ణి. ఆధారం లేనిదాన్ని నేను నమ్మను తెలుసా ?

కవి : నేను కవిని. ఆధారంలేందే ఆకాశంలో విహరించేవాణ్ణి.

జ్ఞా : ఏమిటి నీ అన్వేషణ ?

సిరి : అమృతం.

జ్ఞా : అంటే ?

కవి : మానవుడికి మరణం లేకుండాచేసే మందు. అది చంద్రుడులోకందు.

జ్ఞా : నిజామా ? కవిత్వమా ?

కవి : నిజమే. కవిత్వమే. ఇవాళ మానవుడు అమరుడు కాబోతున్నాడు.

జ్ఞా : కవీ. నువ్వన్నమాట నిజం. నిజంగానే ఇవాళ న్యూఢిల్లీలో చంద్ర లోకానికి వెళ్ళిన డెలిగేట్లంతా అమృతంతోసహా దిగారు. మాఆఫీసుకి అధికారవార్త అందింది.

సిరి : ఆ. అయితే నా గెస్సు రైటే.

జ్ఞా : అవునయ్యా కవీ. అందుకే అంటారు కరెక్టుగా గెస్ చెయ్యడమే కవిత్వం అని.

సిరి : కాని జ్ఞానం తాతయ్యా, నాకో అనుమానం. ఈరాజకీయవేత్తలంతా కలిసి వారిలోవారు కొట్లాడుకొని మానవజాతికి అమృతం అంద కుండా చేసారేమో.

జ్ఞా : ఇదే ఇవాళ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో చర్చిస్తున్నారు. రేడియో పెట్టి విందాం.

* * *

ఎనౌన్సర్: ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశంలో తక్షణమే అమృతాన్ని మానవులకు పంచాలన్న ఆఫ్రో-ఆసియన్ తీర్మానం నెగ్గింది. 150 మంది ప్రతినిధులలో నూరుగురు అనుకూలంగాను 30 మంది వ్యతిరేకంగాను ఓటుచేశారు. ఇరవై రాజ్యాలు తటస్థంగా వుండి పోయాయి. ప్రపంచం అంతటా రాత్రి పండ్రెండు గంటలకి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నారు ఇంజెక్షన్ల ద్వారాగాని, మాత్రల ద్వారాగాని మానవులకు అమృతాన్ని ఇస్తారు.

* * *

జ్ఞా : ఏం ? రేడియో ఆపేశారేం ? ఇంకా విందాం.

కవి : ఇక వినడాని కేముంది ? మానవుడు మరణాన్ని జియించాడు. నాకు మహదానందంగా ఉంది తాతయ్యా. ఆనాటినుంని మనిషి కన్న కలలు నేటికి ఫలించాయి.

జ్ఞా : అబ్బ, నీగోల నీది. అమృతం సేవిస్తే, అంతమందీ ముప్పయ్యేళ్ళ వాళ్ళవుతారని మా కార్యాలయంలో లెక్కవేశారు. ఆ వివరంకూడా రేడియోలో చెబుతారేమో అని చూశాను.

కవి : పోనీండి మీ సెక్రటరీకి ఫోను చెయ్యండి.

జ్ఞా : అవును బాగా చెప్పావు. (ఫోనుతీసి డయల్ చేస్తాడు). రాజ్యం ? అవును. అబ్బ, ఎప్పుడూ పెళ్ళిసంగతేనా ? అవును ప్రామిస్ చేశాను నిజమే. రేపేనా....అంత వ్యవధిలేకుండానా? సరే నీ యిష్టమే కానీ, అవును. నీయిష్టమే కానీ .... అవును ప్రామిస్ చేశాను. ఖరాయుగా, రేపు ఉదయం వెళ్దాం, కాని - రాజ్యం, అమృతం సంగతి తెలిసిందా ? అబ్బ. ఏమిటలా కసిరావ్? ఆ....ఆ.... సరే. రా.

సిరి : ఏవిటి తాతయ్యా ?

జ్ఞా : రాజ్యం యిక్కడికి వస్తానంటోంది.

సిరి : రానీండి, అమృతం విషయం ఏమంటుంది :

జ్ఞా : ఏవీ తెలియదట. రాజ్యానికి ఈ అమృతం విషయంలోకాదు-అమృతం విషయంలో ఏమీ నమ్మకం లేదు. ఐక్యరాజ్యసమితిలో దీన్ని చర్చిస్తున్నారన్నా ఆ పోనిద్దురూ అంటుంది.

సిరి : సరేగాని తాతయ్యా, రాజ్యంగారిని పెళ్ళి చేసుకుంటావా ?

జ్ఞా : అవునురా సిరీ, తప్పేటట్టులేదు. మాట కూడా ఇచ్చేశాను.

సిరి : ఇప్పుడు మీకు పెళ్ళేమిటి తాతయ్యా. ఆవిడికి యాభై ఏళ్ళా, నీకు డెబ్భయ్యేళ్ళా.

జ్ఞా : అర్ధరాత్రి అయ్యే సరికి మనం అందరం ముప్పయ్యేళ్ళవాళ్ళం అయి

పోతున్నాంకదూ. అవాలి మరి మా లెక్కల ప్రకారం. సిరీ ఇప్పుడు పైమెంతయింది.

(12 గంటలు కొట్టిన చప్పుడు)

సిరి : అర్ధరాత్రి అయింది.
ఇరవయ్యో శతాబ్దపుచివరిరాత్రి ఇది.ఇంకా మేలుకొనేఉన్నాన్నేను.

జ్ఞా : పాడు. కానీ నీ కవిత్వం! అర్ధంలేని అర్ధరాత్రిఅమృతం పంచిపెడుతోంది. గాత్రంలేని రాత్రం నేడు మౌనంగా గానం చేస్తోంది.

సిరి : ఏమిటి తాతయ్యోవ్. కవిత్వం చెప్పేస్తున్నావ్.

జ్ఞా : అవును రా. నీ మొగంచూస్తే దానంతట అదే కవిత్వం వచ్చేస్తోంది. చచ్చాను.

సి : ఏమిటది ?

జ్ఞా : రాజ్యం వచ్చేస్తోందిట.

సిరి : అయితే అంత హడలెందుకూ ?

జ్ఞా : పెళ్ళని ప్రాణాలు తీస్తుంది – ప్రమాణం కూడా చేయించుకుంది.

సిరి : అయితే పెళ్ళాడు. దానికింత ఆలోచ నెందుకు.
రండి రాజ్యంగారూ.

రాజ్యం: మా ముసలాయన్ని చూదామని వచ్చాను. కవిగారూ. మీకు తెలుసునా నేను తెల్లారగానే శ్రీమాన్ జ్ఞానంగారిని పెళ్ళిచేసుకుంటున్నాను.

కవి : వింటున్నాను.

జ్ఞానం: రాజ్యం, నామాట విను. తలచినప్పుడే తాతకి పెళ్ళేమిటి ? నెల్లాళ్ళాగకూడదూ ?

రాజ్యం: నెల్లాళ్ళా. నిమిషమైనా ఆగను. ఎందు కాగాలి. అర్ధ రాత్రయిపోయింది గాని లేకపోతే ఇప్పుడే రిజిష్టరాఫీసుకి ఈడ్చుకుపోయుందును మిమ్మల్ని.

జ్ఞానం: అమృతం సంగతి నిజమే. ఇవాళే ఎనౌన్స్ మెంట్ వచ్చింది.

రాజ్యం : ఆ. ఎవరు నమ్ముతారండి ఈ గాలికబుర్లు, మనకి అమృతం దొరికేదేమిటి, మళ్ళీ యౌవనం వచ్చేదేమిటి.

జ్ఞానం : చెప్పాను కాదూ సిరీ. రాజ్యాని కీ విషయంలో ఏమీ నమ్మకం లేదు. రాజ్యం, మనం తప్పకుండా అమృతం పుచ్చుకుంటాం. ఈసరికీ డబ్ల్యు. హెచ్. ఓ. డాక్టర్లక్కడికి వచ్చేస్తూనే ఉంటారు. నీకు ఇంజెక్షన్ కావాలా ? మాత్ర కావాలా ?

రాజ్యం : అవున్సు గ్లాసులో నీళ్ళు పోసుకుని మాత్ర కరిగించి మందులాగ తాగేస్తాను. తక్షణం చచ్చిపోతాను.

జ్ఞానం : కాదు బతుకుతావు రాజ్యం.

రా : లేదు. మీరు పెళ్ళాడనంటే నిజంగానే చచ్చిపోతాను.

జ్ఞా : పెళ్లాడనని నే నన్నానా ? కాకపోతే కాసిన్ని రోజు లాగమన్నాను.

రా : అవ్వాపేరే ముసలమ్మ.

జ్ఞా : అడుగడుక్కీ మన వయస్సులు జ్ఞాపకం చెయ్యకు రాజ్యం.

రా : మనస్సుకి వయస్సేమిటి. మనది మనసులు కలిసిన ప్రేమని మీరేగా అన్నారు.

జ్ఞా : అన్నాను.

రా : ఎన్ని మార్లన్నారు.

జ్ఞా : 29 లక్షల ముప్పైతొమ్మిదివేల నలభై తొమ్మిది వందల యాభై తొమ్మిది మార్లని అన్నట్టు నా జ్ఞాపకం.

రా : మనది చాలా పవిత్రమైన ప్రేమని అన్నారు కాదూ మీరు.

జ్ఞా : అన్నాను.

రా : ఇది దేహానికి సంబంధించినది కాదనీ, ఆధ్యాత్మిక ప్రేమ అనీ అన్నారు కాదూ మీరు.

జ్ఞా : అన్నాను.

సిరి : వృద్ధాప్యం మీదపడ్డాక ఆధ్యాత్మిక ప్రేమ కాకపోతే —

జ్ఞా : అదిగో, ఆ మాటే అనొద్దన్నాను. అమృతం సేవించబోతున్నాం మనం.

రా : ఆఁ. గొప్ప సంబరం. ఆయనగారి మాటలు నమ్మకు బాబూ ! అదంతా ఒక పిచ్చి.

సిరి : ఫ్రెయిల్ టీ దె నేమ్ ఈజ్ వుమన్ అన్నాడు షేక్స్‌పియర్ ఆనాడు ప్రేయసీ ! నీపేరు రాక్షసి అన్నాడు శ్రీ శ్రీ యీనాడు.

జ్ఞా : నేను బయాలజిసుని, ఫిజియాలజిసుని, సైకాలజిసుని.

రా : జిష్ణుని, విష్ణుని, కృష్ణుని.

కవి : వరిష్ఠుని, లోచిష్ఠుని.

జ్ఞా : చాల్లే! అదుగో డాక్టరుగారు మాటల్లోనే వచ్చేశారు. నేచెప్పలేనూ.

డాక్ట : నేను ఐక్యరాజ్యసమితి తరఫున వచ్చాను అమృతం ఇవ్వడానికి.

రా : నిజంగానే ? ఏవండీ ? మీరన్నమాట నిజమేనండీ ?

కవి : జ్ఞానంమాట నిజం కాకపోతే అబద్ధమవుతుందా.

డాక్ట : ఆ. ఆ. పీజ్ హర్రి అప్ : నే నింకా చాలాచోట్లకి వెళ్లాలి. ఈ ఇంట్లో యెంతమంది వున్నారు ?

కవి : మేం ముగ్గురం. అవతలి గదిలో మా మేనకోడలు కళ నిద్ర పోతూంది.

డాక్ట : ఆవిడ నొక్కమాటు లేపుతారా ?

కవి : ఆవిడ కాదండి. అమ్మాయి. పదేళ్ళ పసికందు.

డాక్ట : అయితే నేం ? ఈ మందు తీసుకుంటే ముప్పయ్యేళ్ళ దవుతుంది.

సరే : తాతగారూ, మీకు టాబ్లెటియ్యనా ?

జ్ఞా : అక్కర్లేదు. ఇంజక్షన్ తీసుకుంటాను.

డాక్ట : సరే.

జ్ఞా : అ — మ్మ.

డాక్ట : అమ్మా — మీరు ?

రా : మాత్ర ఇయ్యండి.

డాక్ట : ఇందండి.

కవి : ఇదుగోనండి కళ !

డాక్ట : అమ్మాయీ ఇంజక్షనిస్తే భయపడవు కద :

కళ : నా కేం భయం ? ఇయ్యి.

డాక్ట : ఏదీ చెయ్యి ?

కళ : మ్....

డాక్ట : మరి మీరు ?

కవి : ఇంజక్షనే ఇయ్యండి. కాని ఏం లాభం. అమృతం తీసుకున్నా తీసుకోకపోయినా నేను ముప్పయ్యేళ్ళవాడినే. అబ్బ : కసిక్కొద్దీ పొడిచేశారే డాక్టరుగారు.

డాక్ట : ఇంజక్షన్లు తీసుకున్న ముగ్గురూ, ఈ కాగితాలమీద సంతకం చెయ్యండి. అమ్మా, మీరు దీనిమీద, థ్యాంక్స్. నే వస్తా.

కవి : వెళ్ళి నిద్రపో కళా.

కళ : ఇదేవిటి మామయ్యా ఏవిటో ఒళ్ళంతా.

కవి : ఏం లేదులే. వెళ్లు. బజ్జో. తెల్లారాక మాటాడుకుందాం.

* * *

ఎనౌన్సర్ : ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంక్రింద ప్రపంచం అంతటా ప్రజలందరికీ ఏకకాలంలో అమృతం పంచిపెట్టినట్లు కేంద్రకార్యాలయానికి రిపోర్టులు వచ్చాయి. ఎన్ని కోట్లమందికి అమృతం అందిందో ఆ వివరా లింకా తెలియలేదు. నిన్నటి జనాభా లెక్కలనుబట్టి నేటి పరిస్థితిని అంచనా వెయ్యడానికి వీలులేదు. ఎందుచేతనంటే అర్ధరాత్రి దాటేసరికి, ప్రపంచంలో అనేక లక్షలమంది మరణించారు. అనేక లక్షలమంది జన్మించారు. మరణించినవారికి కూడా మందియ్యడమైతే జరిగింది. కాని వాళ్ళు బతికారో లేదో ఆ వివరాలుకూడా యింకా అందలేదు. ఉదయం కాగానే అదీ తెలుస్తుంది.

* * *

కవి : ఉదయం అయింది.
నవోదయం ఇది
మహోదయం ఇది
శుభోదయం.
స్వాగతం నూతన సంవత్సరానికి
స్వాగతం నూతన శతాబ్దానికి.

ఉదయం.
నిద్ర మేల్కొన్న రాత్రి నేటితో వికసించింది
విహంగాలూ, విమానాలూ పంపించేశాయి నిశ్శబ్దాన్ని
వేళలోకి వేళాకోళంలోకి
వేళాగోళంలోకి....

జ్ఞా : వేళాగోళంకాదు. సరళ రేఖ. ఇది స్థలం అనే యింకో సరళరేఖకు సమానాంతరంగా ప్రసరిస్తుంది.

రా : అబ్బ: ఎప్పుడూ మీ దొకటే గోల. పదండి పెళ్ళిరిజిస్ట్రారు దగ్గరికి.

జ్ఞా : ఉండు. ఏం తొందర.

రా : అవును. తొందరే: తెల్లారగానే బయల్దేరుతా నన్నారు.

జ్ఞా : నీ తెలివి తెల్లారినట్టే ఉంది. నిజం చెప్పమంటావా?

రా : చెప్పండి.

జ్ఞా : నిన్ను పెళ్ళి చేసుకోను.

రా : ఏవిటీ!

జ్ఞా : నిన్ను పెళ్లాడాలనే ఉద్దేశం మార్చుకున్నాను.

రా : నిన్నటి వాగ్దానం నేడు మారిపోయిందా?

జ్ఞా : ఔను: నిన్నటి పరిస్థితి వేరు. నేటి పరిస్థితి వేరు.
నిన్నటి శతాబ్దం వేరు. ఇవాళ శతాబ్దం వేరు.
నిన్నటి నేను వేరు, నేటి నేను వేరు.
నిన్న నా వయస్సు డెబ్భయ్యేళ్లు. ఇవాళ నా వయస్సు ముప్పయ్యేళ్లు

రా : ఆఁ అదీ సంగతి. ఆకళ అనే అమ్మాయిని చూశారూ. కామవికారం బయల్దేరింది. మనది పవిత్ర ప్రేమ అన్నారు. మనసులు కలిసిన మనోహర ప్రేమ అన్నారు. అయినా పదేళ్ళ పిల్లతో ప్రణయ కలాపా లేమిటండీ మీకు.

జ్ఞా : అక్కడే పొరపడుతున్నావు. ఇదిగో ఆ అమ్మాయికూడా వచ్చేసింది. ఇవాళ కళ పయస్సుకూడా ముప్పయ్యేళ్లు.

కళ : నమస్కారం జ్ఞానం తాతయ్యా.

జ్ఞా : నన్ను తాతయ్యా అనకు. నాకు కోపం వస్తుంది.

కళ : ఎందుకూ కోపం ఉన్నమాట లన్నందుకా.

జ్ఞా : నేను తాతనన్నమాట నిజంకాదు. నిన్ను పెళ్ళిచేసుకుంటాను కళా.

కళ : ఆ ?

కవి : ఏమండీ ఏమండీ ఏవి టా పేలాపన.
ఆపండీ ఆపండీ చాలు నీ ఆలాపన.
అమ్మాయీ, కళా అవతలికి పో.

జ్ఞా : కళా....కళా....వెళ్ళకు.

సిరి : వెళ్ళిపోయింది కళ. నేనూ దానివెంటనే వెళ్ళుతున్నాను.

జ్ఞా : రాజ్యం, నామాట విను. వెనుకటిలాగే మన మనసులు కలిసిన మైత్రి అచంచలంగా అకళంకంగా సాగనీ.

రా : ఇదంతా నా కనవసరం. నన్ను పెళ్ళి చేసుకుంటారా లేదా.

జ్ఞా : యాభయ్యేళ్లాయి పెళ్ళి లేకుండా ఉన్నదానివి ఇవాళ పెళ్ళి కింత తాపత్రయం ఎందుకు రాజ్యం ?

రా : చాల్లెండి. ఇప్పుడు నేను 50 ఏళ్ళదాన్ని కాను. నా వయస్సు కూడా 30 ఏళ్ళే.

జ్ఞా : ఔను సుమా. పరాకుపడ్డాను. కాని నువ్వు నా కళ్ళకి యాభై యేళ్ల దానివిలాగే కనబడుతున్నావు.

రా : కనబడనా మరి. కళని చూసిన కళ కి కామెర్లు కమ్మినట్టుంది.

కళ : మళ్ళీ వచ్చాను తాతయ్యా.

జ్ఞా : అదిగో ఆ మాటే అనొద్దన్నాను.

కవి : నేను కళని పెళ్ళిచేసుకోదలిచాను సార్. కళ కూడా అంగీకరించింది.

జ్ఞా : ఏమిటి నన్నడగకుండానా ?

కవి : ఎందుకూ మిమ్మల్నడగడం ?

జ్ఞా : కళని నేను కళత్రంగా చేసుకోవా లనుకున్నానే ?

రా : ఇదిగోనండోయ్, ఏమండోయ్, ఏవిటా మాటలు ? సిగ్గూ బిడియమూ లేవూ. ఏళ్లు రాగానే సరా ?

జ్ఞా : ఏవి టంటున్నావ్ ?

రా : మీ కొచ్చిన న్నేళ్లు ఎవరి కొచ్చాయంటున్నాను.

జ్ఞా : నాకేమి ఏళ్లు రాలేదు. పైగా పోయాయి. నలభై ఏళ్ళు పోయాయి. నా వయసిప్పుడు ముప్ఫయి, తెలుసా.

కళ : వయస్సు ముప్ఫయి అయినా ముసలి భావాలు నీలో పోలేదు తాతయ్యా.

జ్ఞా : అదుగో మళ్లీ నువ్వు పదేళ్ల పసిపిల్లలాగా మాటాడడం లేదూ. అయినా ఇప్పు డదంతా ఎందుకుగాని....కళా....కళా....

కవి : జ్ఞానంగారూ మమ్మల్ని మీరు ఆశీర్వదించాలి.

జ్ఞా : ఆశీర్వదించే స్థితిలో నేను లేను.

కవి : కళ మిమ్మల్ని పెళ్లాడే స్థితిలో లేదు.

జ్ఞా : ఎందుకు లేదు.

కవి : నన్ను పెళ్లాడబోతుంది కనక.

రా : లేదుసిరీ. ఈ ముసిలాయనతో విసుగెత్తిపోయింది నాకు. వేధించుకు తిన్నాడు ఇన్నాళ్లూ. కావలిస్తే ఆయన్నే పెళ్ళిచేసుకొమ్మను కళని. కో అంటే కోటిమంది ఉన్నారు. ఎవరో ఒకర్ని ఎన్నుకుంటాను.

కవి : రాజ్యంగారూ....

రా : అవును. నామనస్సు మారిపోయింది. పరాభవంతోపరితపిస్తున్నాను.

కళ : తాతయ్యా....

జ్ఞా : అదుగో ఆ మాటే అనొద్దన్నాను. నా మనస్సు మారిపోయింది. నిన్ను పెళ్ళి చేసుకోను నేను.

కళ : చేసుకుంటానంటే మాత్రం ఒప్పుకునే వాళ్ళెవరు ?

జ్ఞా : లక్షణంగా ఒప్పుకుంటావు. నాలాంటివారు నీకు దొరకడం ఎలాగ?

కవి : నేను దొరికేనుగా. నన్ను కాదని కళ ఇంకొకణ్ణి ఎలా పెళ్ళాడుతుందో నేనూ చూస్తాను.

జ్ఞా : ఒరే సిరీ, నువ్వూరికే మాట్లాడకు. కళని నేను పెళ్ళి చేసుకోవడం ఖాయమయిపోయింది. కావలిస్తే నువ్వు రాజ్యాన్నేరుకో.

కవి : హాస్యానికూడా ఒక హద్దుంది. రాజ్యానికి నేను అర్హుణ్ణి కాను.

జ్ఞా : కాని రాజ్యం నిన్ను వరించింది. ఆమె కళ్ళల్లోని కాంతుల్ని చూడు, నువ్వు సై అంటే ఆమె జై అంటుంది.

కవి : నేను కై అనికూడా అనను.

జ్ఞా : అబ్బాయీ సిరీ, మనం నలుగురం కూడబలుక్కొని ఒక అంగీకారానికి రావాలి. రాజ్యం, ఏమంటావు నువ్వు. అంగీకారానికి వస్తానంటావా.

రా : రానంటాను, పెళ్ళే చేసుకోనంటాను.

జ్ఞా : ఒకవేళ నేను చేసుకుంటానంటే ?

రా : దాటిపోయిం దా తరుణం.

జ్ఞా : అయితే నా ఒట్టు తీసి గట్టుమీద పెట్టెయ్యవచ్చునా ?

ఒక స్త్రీ కంఠం : వేసిన ఒట్టు తీస్తావురా రాస్కెల్.

జ్ఞా : ఎవరు నువ్వు ?

స్త్రీ : తరువాత చెబుతా. ఈవిషయ బాహుచతురస్రాన్ని ఎలా స్క్వేర్ చేస్తారు.

జ్ఞా : మాతరంకాదు.

కవి : నువ్వే చెప్పు. ఏవరివో నువ్వే చెప్పు.

జ్ఞా : మా సమస్యని నువ్వే పరిష్కరించు.

రా : ఎవరిని ప్రేమించాలి నేను.
కళ : ఎవరిని వరించాలి నేను.
రా : ఎవరిని పెళ్లాడాలి నేను.
రా : అస లీ పెళ్ళి అవసరమా.
కవి : నువ్వే చెప్పు. నువ్వే చెప్పు.
జ్ఞా : ఎవరివి నువ్వు ?

* * *

స్త్రీ : నేను దైవాన్ని, నేను సత్యాన్ని
దైవాన్ని నేను మాట్లాడుతున్నాను (వినండి వినండి)
మానవుణ్ణి నేను సృష్టించలేదు
మానవుడే నన్ను సృష్టించాడు.
అతని మనస్సు నన్ను సృష్టించింది
నాకు ఆకారంలేదు, వయసులేదు
నేను ఆడాకాదు, మగాకాదు
నేను దైవాన్ని, నేనే కాలాన్ని నేనే సత్యాన్ని
మరణాన్ని మానవుడు జయిస్తే
కాలాన్ని మానవుడు జయిస్తే తన
మనస్సునే మానవుడు గెలిస్తే
అప్పుడు నేను లేను
ఇప్పుడున్నాను నేను
గెలవగలడా మానవుడు కాలాన్ని
గెలవగలడా మానవుడు మరణాన్ని
జయిస్తాడా మానవుడు మనస్సుని
మనస్సులోనివి ఆలోచనలు
వాటి స్వరూపం భాషలో నిరూపణం
అనేక భాషలు మాట్లాడే మానవుడు
ఒక్క భావాని కెప్పుడూ రాలేదు.

మానవుడు మానసిక సమానత్వం సాధించాలంటే
మారాలి మానవుల భాష
మాట్లాడాలి మానవులంతా ఒకే భాష
అప్పుడే సాధ్యం మానవునికి మానసిక స్వాతంత్ర్యం
ఒక ఇంటిలోవున్న ఒక నలుగురికి
ఏకాభిప్రాయం లేకపోయిందే
ఇక సమస్త ప్రపంచానికీ ఏకాభిప్రాయం ఎప్పుడు ?

కోరస్ : ఇప్పుడు-ఇప్పుడు-ఇప్పుడే
మరణాన్ని జయించాలన్న మా సంకల్పం మారదు
కాలాన్ని జయించాలన్న మా నిర్ణయం మారదు
స్థలాన్ని జయిస్తే దైవాన్ని జయించినట్టే

స్త్రీ : ఎక్కడ-ఎక్కడ-ఎక్కడ

కోరస్ : ఇక్కడ-ఇక్కడ-ఇక్కడే.

ఎనౌన్సర్ : మానవుడు మరణాన్ని జయించాడు. చంద్రలోకంలోని సుధ జరామరణాలకి విరుగుడు.

దైవం: కాలాన్నికూడా జయిస్తావా మానవా ?

జ్ఞా : అది నీ దయ దైవమా.

దైవం: కాలాన్ని నేను. న్యాయాన్ని నేను
సత్యాన్ని నేనే. దైవాన్ని నేను
నేను దైవాన్ని మాట్లాడుతున్నాను.

ఇన్నాళ్ళూ మహర్షులద్వారా మాట్లాడాను. మహాపురుషులద్వారా మాట్లాడాను. మహాకవులద్వారా మాట్లాడాను. మహాభక్తులద్వారా మాట్లాడాను. ఈనాడు నేను స్వయంగా ఈ సభకి అధ్యక్షత వహించి మాట్లాడుతున్నాను. మరణాన్ని జయించిన మానవ జాతితో మాట్లాడుతున్నాను.

స్త్రీ : ఎవరివి నువ్వు ?

సిరి : నేను మానవుణ్ణి !

స్త్రీ : ఎవరిని నేను

సిరి : నీవు మానవుడివి, మారువేషం వేసుకొచ్చిన మానవుడివి.

స్త్రీ : అంటే నీవే.

సిరి : నేను

స్త్రీ : అయితే నేనే.

సిరి : నీవు.

స్త్రీ : అంతే అంటావా మానవా.

సిరి : అంతే అంటాను మాధవా.

స్త్రీ : అంతా ఒకటేనా ?

సిరి : అవును.

స్త్రీ : అంటే ?

సిరి : $1 + 1 = 1$

స్త్రీ : ఒకటీ ఒకటీ రెండంటారే లెక్కలు నేర్చినవాళ్లు.

సిరి : అదే వాళ్ళ గణితశాస్త్ర పాండిత్యం. నీవూ నేనూ ఒకటే. ఒకటీ ఒకటీ రెండే.

స్త్రీ : నిజం చెప్పావు.

సిరి : మాట తడబడింది మాధవా. గణితాని కతీతమైన భాషలో ఒకటీ ఒకటీ ఒకటే.

స్త్రీ : రెండు కాదంటావా ?

సిరి : రెండు కాదంటాను ?

స్త్రీ : ఒకటీ ఒకటీ ఒకటైతే, రెండూ రెండూ రెండు కాదూ ?

సిరి : రెండు రెండ్లు నాలుగే. రెండు మూళ్ళు బారెడే.

స్త్రీ : మూళ్ళంటే ?

సిరి : మూరలు, రెండు మూరలు బారెడు.

స్త్రీ : మూడూ మూడూ

సిరి : కీడు.

స్త్రీ : చూడూ చూడూ పాడు.

సిరి : నేను పాడలేనే.

స్త్రీ : కవినంటావ్ ?

సిరి : ఓహో : అయితే పాడుతా.

స్త్రీ : దేన్ని గురించి ?

సిరి : రెండు గురించి.

స్త్రీ : రెండు. ఇప్పుడెంత పైమయింది ?

సిరి : కాలం ఆగిపోయింది. చాలాకాల మయింది.

స్త్రీ : చతురస్రం సమబాహువయిందా ?

సిరి : అయింది.

స్త్రీ : అయితే చదువు, నీ పద్యమో ఏదో ?

సిరి : పద్యం కాదు, పాటే. దాన్ని పాడను. అంటాను.

స్త్రీ : అను.

సిరి : విను.

రెండు ఖడ్గాలు
రెండు ఖంజరీటాలు
రెండు అగ్నిపర్వతాలు
రెండు ఆంజనేయ దండకాలు జోజో జేజే

రెండు కంకాళాల కా రిక దీపాలు
రెండు రాబందుల రా (జా) జీ నామాలు
రెండు కళ్లు తెరిచిన నాగళ్లు
రెండు పిడికిళ్లు బిగించిన కొడవళ్లు హాహా హూహూ

రెండు కళ్ళు
రెండు కళ్ళజోళ్ళు

రెండు కళ్ళజోళ్ళ నోళ్ళు
రెండు కళ్ళజోళ్ళ నోళ్ళ వాగుళ్ళు హీహీ రీరీ

రెండు టెలిగ్రాము భాషలు
రెండు సమస్తాంధ్ర ఘోషలు
రెండు నిండు కొబ్బరికాయలు
రెండు ఎండు నారింజకాయలు బాబా బీబీ

రెండు చదువురాని విస్తరాకులు
రెండు దారితప్పిపోయిన కిరీటాలు
రెండు చీకట్లో రాకాసి కేకలు
రెండు నిలబడ్డ నిట్టూర్పు కొరడాలు దాదా దీదీ

రెండు వేషాలు విప్పివేసిన తలగడాల కింద నిద్రమేల్కొన్ననక్షత్రాలు
రెండు నిశ్శబ్దాలు విసిరిన సరిగమపదనిశలమీద నడలు పరికించిన
విలోల కల్లోలాలు

రెండు యుగాంతాల సందున దిగంతాల మాటున వసంతాలాడుతున్న
అనంతాలు నేనా నేనా

రెండు జగన్నాథ రథరథరథాధరథరాధర
రసాతల (జల) పాతాళాలు
రెండు స్వయం శ్యమంతకం ప్రకంపమాన
లోకాలోక విలోకనాలు
రెండు భ్రమాభ్రమర భ్రమణ భ్రమరణ భ్రమా
వరణ బ్రహ్మావైవస్వత మన్వంతరాలు

రెండు నవరత్న రంధ్ర రసప్రపంచ మహాప్రస్థానాలు

రెండు తృణావర్తాలు

రెండు విప్లవరాగాలు

రెండు చాలీచాలని కాలీకాలని లంగావంచాలు

రెండు ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ థియేటర్ స్టార్లు

రెండు ఆరుద్రాభిషేకాలు

రెండు రిక్షాపై మౌనశంఖాలు

రెండు విజయార్భాటాలు

రెండు హనుమంతాస్త్రాలు

రెండు సంపత్కుటుంబాలు

రెండు నమస్కరించదగిన విశ్వనారాయణాస్త్రాలు

రెండు నామరహిత ఫిడేలు రాగాలాపాలు

రెండు గోరావీ వినాయకారాణారాలు

రెండు పతా పితా కణాతోరకుతారాలు

రెండు తృవ్వట బాబా : సిగపై పువ్వులు :

రెండు సిరిసిరి మువ్వల నవ్వులు

రెండు చీరెండ వాసన ఒకట్లు

రెండు తురుఫాసు కవిత్వాల రకట్లు

రెండు సిన్ సిన్ సిన్ కిస్‌కిస్‌కిస్ కోణాలు

రెండు ఖడ్గాల కంఖాణాలు

రెండు కళ్ళ నోళ్ళు
రెండు కళ్ళు తెరిచినా పిడికిళ్ళు బిగించిన
మానవ సరోవరంలో వికసించిన
మందారాక్షరాల మరచిపోలేని
ముద్రాక్ష సముద్రాక్ష సరాలు.



గవేషణ

(మిలిటరీ మార్చి రికార్డు వినబడుతూ ఉంటుంది)

ప్రకటన : భూలోకంలో ఒక మానవుడు తన ముప్పయి అయిదో యేట చచ్చిపోయాడు. అతని ఆత్మని మృత్యుదూతలు మిలిటరీ పహారాతో మరో ప్రపంచానికి తీసుకుపోతున్నారు. ఆ లోకంలో అతని ఆత్మని ఒకానొక న్యాయస్థానంలో అప్పగించ వలసిందిగా మృత్యుదూతలకి ఉత్తరువు. దారిలో హఠాత్తుగా మానవుడు మేలుకొంటాడు. తా నింకా బతికిఉన్నానని మృత్యుదూతలతో వాదిస్తాడు.

(ఫేడౌట్. మిలిటరీ మార్చి)

(ఫేడిన్—మానవుని గొంతుక)

మానవుడు : ఇదేమిటి ? మీరంతా ఎవరు ? ఎక్కడికి తీసుకపోతున్నారు నన్ను ? మాట్లాడరేం ? మాటలురావూ మీకు ?

ఒక మృత్యుదూత : మాట్లాడకుండా నడవ్వయ్యా మానవుడా.

ఇంకొక మృత్యుదూత : ఈ మనిషి చచ్చిపోయాడుకదా ఎలా మాటలాడ గలుగుతున్నాడు ? ఎప్పుడూ ఎరగని విడ్డూరం.

మాన : నేను చచ్చిపోయానా ? మీకేం మతిపోయిందా ? మనిషంత మని షిని నేను కనబడుటలేదూ మీకు ?

2వ మృ : నిన్ను చూడనక్కరలేదు. నీకు శరీరంలేదు. నువ్వు చచ్చి పోయావు. నీ కళేబరం యిప్పుడు మీ పల్లెటూరి వల్లకాట్లో ఉంది.

మాన : నేను బతికే ఉన్నాను. నన్ను వదలిపెట్టండి. నా లోకానికి పోతాను. నా యింటికి నేను పోతాను. నన్ను వదలిపెట్టండి.

1వ మృ : నిన్ను వదలిపెట్టటానికి ఉత్తరువు లేదు. న్యాయమూర్తి ముందు నువ్వు నిలబడబోతున్నావు. నిన్నక్కడ విచారణ చేస్తారు.

మాన : నే నేం పాపం చేశాను ?

1వ మృ : ఏమో. మమ్మల్ని అడగవద్దు. మాట్లాడకుండా రా.

2వ మృ : ఈ మానవుడు చచ్చిపోయాడు కదా ఎలా మాటలాడుతున్నాడు?

మాన : మళ్ళీఅదేమాటా ? నేను బతికే ఉన్నాను.

1వ మృ : అది మాకు అనవసరం. మా ఉత్తరువు ప్రకారం మేము నడుచు కోవాలి.

మాన : ఆ ఉత్తరు విచ్చిన అధికారి ఎవరు ?

1వ మృ : అధికంగా మాటలాడకు. ఆజ్ఞలను ఉల్లంఘించకు.

మాన : నన్నాజ్ఞాపించుతున్న దెవరు ?

1వ మృ : అందర్నీ ఎవడు శాసిస్తున్నాడో వాడు.

మాన : అతనిదగ్గరకా నన్ను తీసుకొని వెళ్లుతున్నారు ?

1వ మృ : అబ్బో. అతని దర్శనం అంత సులభంకాదోయ్ మానవుడా. చచ్చిపోయిన వెంటనే విచారణ జరిగే మొదటి న్యాయశాలకి తీసుకు వెళ్ళుతున్నాం నిన్ను.

2వ మృ : ఈ చచ్చిపోయిన మనిషి ఎలా మాట్లాడుతున్నాడో ? ఏదో పొరపాటు జరిగినట్టుంది.

మాన : అవును నన్ను వదలి పెట్టండి. నేను బతికే వున్నాను. మీరు నమ్మరూ నన్ను ?

1వ మృ : మేము నమ్మినా, నమ్మకపోయినా నీకేం ప్రయోజనం లేదు. నిన్ను వదలి పెట్టగల స్థితిలో మేం లేము. బహుశా నువ్వు బతికే వున్నావేమో కాని –

మాన: బహుశా అంటా వేమిటి? నిశ్చయంగా నేను బతికే ఉన్నాను.

2వ మ్యు : ఎక్కడో పెద్ద పొరపాటు జరిగింది.

1వ మ్యు : ఈ లోకంలో ఎన్నడూ పొరపాట్లు జరగవు.

మాన : ఏం ఇదేం స్వర్గమా?

1వ మ్యు: స్వర్గమనీ, నరకమనీ వేరే వేరే లోకాలు లేవు. నీ పాపం నీ నరకం. నీపుణ్యం నీ స్వర్గం.

మాన : ఏది పుణ్యం? ఏది పాపం? స్వర్గనరకాలు వేరు వేరుగా లేకపోతే పుణ్యపాపాలు కూడా వేరు వేరుగా లేవు.

2వ మ్యు : చచ్చిపోయినవాడివి చచ్చినట్టుండక చట్ట విరుద్ధంగా మాట లాడడం పాపం.

1వ మ్యు : ఊరుకో. ఊరుకో. ఇతణ్ణి విచారణచేసే అధికారం మనకిలేదు.

2వ మ్యు : అయితే ఈ మానవుణ్ణి మాటలాడవద్దను. వీడు మాటలాడు తుంటే నా కెందుకో భయం వేస్తోంది.

1వ మ్యు : మనమేదో తప్పు పని చేస్తున్నట్టు నా అంతఃకరణకి స్ఫురి స్తోంది. చచ్చిపోకముందే మనం ఇతణ్ణి తీసుకుపోతున్నామేమో?

2వ మ్యు : ఇందులో మన తప్పేం వుంది. మనకిచ్చినఉత్తరువు ప్రకారం మనం నడుస్తున్నాం.

1వ మ్యు : ఈ మానవుడు బతికే ఉన్నాడు. ఇతణ్ణి న్యాయమూర్తి యెదుట నిలబెట్టడానికి వీలులేదు.

2వ మ్యు : ఉత్తర్వులను ఉల్లంఘించవలసిందేనా?

1వ మ్యు : ఎంత సంకటం వచ్చిపడింది మనకి. ఎక్కడో తప్పు జరిగింది. దాని ఫలితం మనం అనుభవిస్తున్నాం.

2వ మ్యు : ఊరుకో. ఊరుకో. తప్పుజరిగిందని నిశ్చయంగా నీకేంతెలుసు? తెలియందే ఎవళ్ళమీదనైనా ఎలా నేరం ఆరోపించగలవు?

1వ మ్యు : ఈమానవుడు బతికివుండడమే ఇందుకు నిదర్శనం.

2వ మ్యు : మానవుడు మాటలాడలేదు.

1వ మ్యు : మానవుడు మరణించాడు.

2వ మ్యు : మరింత సేపూ మాటలాడాడే? ఇది సంభవమా?

1వ మ్యు : ఇంత సేపూ ఏదో భ్రాంతిలోపడ్డాం మనం.

2వ మ్యు : మరి మనకంత భయంవేసిందేం? ఎన్నడూ భయమంటే ఏమిటో ఎరగమే మనం. ఒక మానవమాత్రుడు ఎంత హడలుకొట్టించాడు మనల్ని. ఏదో తప్పుచేసినట్లు ఎంత వణకిపోయాం ఇంత సేపూ?

1వ మ్యు : ఈ లోకంలో ఎప్పుడూ తప్పు జరగదు. ఇదివరకెప్పుడూ మనం బతికున్నవాళ్ళ జోలికి పోలేదు.

మానవుడు: ఇప్పుడు మీరు నాకు అన్యాయం చేస్తున్నారు; నాప్రాణాలు తీసేస్తున్నారు. నన్ను నరకబాధ పెడుతున్నారు. నేనేం తప్పు చేశానని? బతికుండగానే నన్నిలా కాల్చేస్తున్నా రేమిటి? తీసుకెళ్ళండి. నన్ను మీ అన్యాయమూర్తి దగ్గరకు తీసుకెళ్ళండి. అతణ్ణే ప్రశ్నిస్తాను – కానీయండి. మీ ధర్మం మీరు నిర్వహించండి, ఆ న్యాయమూర్తి ఏవరో నాకు చూపించండి. బహుశా అతను భగవంతుడు కాడనుకుంటాను. అతనికన్నా తక్కువ హోదాలోఉన్న క్షుద్రదేవత అనుకుంటాను. మా భూలోకంలో యిలాంటి అధికారులు చాలామంది ఉన్నారు. ఇక్కడకూడా ఉన్నారన్నమాట న్యాయాధికారులు.

1వ మ్యు : ఊరుకో. ఊరుకో. ఇదుగో న్యాయశాల సమీపించాం.

మానవుడా: మమ్మల్ని చీవాట్లుపెట్టకు. నీమరణానికి మేం కారణం కాం. నువ్వసలు చచ్చిపోయావో, బతికున్నావో కూడా మాకు తెలియదు. ఆజ్ఞమేరకు నిన్నిక్కడికి తీసుకొచ్చాం – అంతే.

2వ మ్యు : ఇక మేం వెళ్ళిపోతున్నాం ఇక్కడి రక్షక భటులకి నిన్నప్పగించి మేం సెలవు తీసుకుంటాం. మానవుడా: నీరౌద్రాకారాన్ని చూస్తే, మాకు భయం వేస్తోంది. విచారణలో నువ్వు గెలవాలని త్రికరణశుద్ధిగా కోరుతున్నాం. దేవతలుకూడా పొరపాటు చేస్తారని నీజీవితంలో రుజువు చేశావు. నువ్వు జీవించే ఉన్నావనడానికి మాకేమీ సందేహంలేదు; మానవుడా: జీవించు.

1వ మ్యు : మరి మాకు సెలవు. (పావునిమిషంసేపు జంత్ర సంగీతం).

2

ప్ర క ట న

మృత్యుదూతలు మానవుని ఆత్మని మరో ప్రపంచపు న్యాయస్థానానికి చెందిన రక్షకభటులకి అప్పగించి వెళ్ళిపోయారు. రక్షకభటులు ధర్మాసనంమీద కూర్చున్న న్యాయమూర్తి సమక్షంలో మానవుణ్ణి హాజరు పెట్టారు. ఈ న్యాయమూర్తి వయస్సులేని, నేత్రాలులేని ఒక స్త్రీమూర్తి.

న్యాయమూర్తి : మానవుడా ! ఎన్నడూ జరగని పౌరపాటొకటి ఈ లోకంలో జరిగింది. ఇప్పుడే నీ కాగితాలన్నీ తెప్పించి, పరిశీలించాను. నాకు కళ్ళులేవుగాని చూడగలను. భూలోకంలో నీకింకా అయిదు సంవత్సరాల ఆయుస్సుండగా, ఈ కార్యాలయంలోని ఒక ఉద్యోగి తప్పులెక్కవల్ల మృత్యుదూతలు నిన్నిక్కడికి తెచ్చేశారు. నువ్వు చనిపోయావని నిజంగానే వాళ్ళనుకున్నారు.

మాన : మీరు ధర్మస్వరూపులు. దేవతల పౌరపాటువల్ల ఈ మానవుడు బాధపడుతున్నాడు. నన్నుకూడా ఇప్పుడు సందేహం బాధిస్తోంది. నేను బతికున్నట్టా ? చచ్చిపోయినట్టా ?

న్యాయ : మృత్యు రాజ్యపు చట్టప్రకారం నువ్వు చనిపోయినట్టుగానే ఉత్తరువు పడిపోయింది. తక్షణమే మృత్యుదూతలు నీ శరీరంనుంచి నీ ఆత్మని తొలగించివేశారు. నీ కాగితాలు తెప్పించి పై అధికారులతో నీ విషయమై ఎంతో వాదించాను. ఇక్కడి వ్యవస్థలో ఎప్పుడూ పౌరపాటు జరగదనే అందరూ అనుకుంటున్నారు. కాని నీ పట్ల మాత్రం పౌరపాటు జరిగింది. నీ కన్యాయం జరిగింది. నక్షత్రాల సాక్ష్యం ప్రకారం నీ కింకా అయిదేళ్ళు ఆయువుందని నేను స్థిరంగా నిర్ధారణ చేశాను.

మాన : ధర్మదేవతా ! కృతజ్ఞుణ్ణి.

న్యాయ : నువ్వింక భూలోకానికి పోవచ్చు. నీ ఆత్మని దేవదూతలు మర్యాదగా మీపల్లెటూళ్లో వదలిపెడతారు. మా పౌరపాటువల్ల నీకు అన్యాయం జరిగినందుకు మేమందరమూ సిగ్గుతో తలవంచుకుంటు

న్నాము. భగవంతుడు కూడా – ఆయన్ని నేనెప్పుడూ చూడలేదు గాని ఈ జరిగినదాని కెంతో బాధపడుతూ వుంటాడు.

మాన : ధర్మదేవతా ! భగవంతుణ్ణి మీరు చూడలేదా ఎప్పుడూ ?

న్యాయ : భగవంతుడు ధర్మానికికూడా అతీతుడు. ఈ చర్చలిప్పుడు వద్దు. ఇక నేను సభ చాలిస్తున్నాను. నువ్వు భూలోకానికి వెళ్ళు. (అర నిమిషంసేపు జంత్ర సంగీతం).

3

ప్రకటన : దేవదూతలు మానవుని ఆత్మను అతని పల్లెటూళ్లో దిగవిడిచి పోయారు. కాని అప్పటికే అతని శరీరాన్ని బంధువులంతా దహనం చేసిపేశారు. ఇంకా అయిదేళ్ళ జీవితం వున్న మనుష్యుడి ఆత్మ నివసించడానికి శరీరంలేదు. తన శరీరాన్ని వెతుక్కుంటూ ఆత్మ ఆ రాత్రంతా ఎంతో అల్లాడింది. మళ్ళీ ధర్మదేవత దర్శనంచేసుకుంటే బాగుం డునునుకుంది. కాని ఈ లోకంలో ఉన్నతాధికారుల దర్శనం చేసుకోవాలం టేనే ఎందర్నో ఆశ్రయించి ఎన్నెన్నో తిప్పలుపడాలే, ఆ లోకంలోని అధికారిని దర్శించడం అంటే మాటలా? నిన్న తన ప్రయత్నం లేకుండానే ధర్మదేవత కనబడింది. ఈ రోజు ఎక్కడుందోకూడా తెలియదు. అయినా తన ప్రయత్నాన్ని ఆత్మ వదిలిపెట్టదలుచుకోలేదు. సమస్త దేశ కాలావధు లలో స్వతంత్రంగా నిరాఘాటంగా సంచరించగలుగుతోంది ఆత్మ. కాని, పంచభూతాలలో కలిసిపోయిన తన శరీరం మాత్రం ఎంత వెతికినా మళ్ళీ కనిపించదు. ఇదేమిటీ ఉపద్రవం? ఎక్కడో ఎవ్వరో చేసిన పొరపాటుకి తానెందుకింత బాధపడాలి? మళ్ళీ తాను మరోప్రపంచానికి వెళ్ళి ఎలాగైనా తన శరీరాన్ని తనకిప్పించ వలసిందని న్యాయమూర్తి ఎదుట ఫిర్యాదు చెయ్యడానికి మరణ జీవితాలమధ్య అల్లాడుతున్న మానవుని ఆత్మ నిశ్చ యించింది.

(మరోప్రపంచపు న్యాయస్థానం పెలుపల పెద్దపెద్ద పొరంగాలవంటి వరండాలు. కీచురాళ్ళ చప్పుడు. ప్రవేశం ఆత్మరూపంలో మానవుడు.)

మాన : ధర్మదేవతా ! ధర్మదేవతా !

(ఎవరూ పలకరు. కాలావధుల కొసనుంచి అతని జాలికేకకు అదే జవాబుగా ప్రతిధ్వని! చీకటి గుహల్లోంచి నదులు ప్రవహించిన చప్పుడు.)

మాన : న్యాయమూర్తీ ! న్యాయమూర్తీ !

(ఎవరూ పలుకరు, ప్రతిధ్వని తప్ప. తర్వాత గాజు పెంకులు పగిలిపోయినట్లు నవ్వు)

నవ్వినమనిషి : ఈ భగవంతుని న్యాయస్థానంలో ఎవరయ్యా నువ్వు ?

మాన : నేనో మానవుణ్ణి. నాకింకా అయిదేళ్ళు ఆయురాయం ఉంది.(నవ్వు) ఎందుకలా నవ్వుతావు ! ఎవరివి నువ్వు ?

నవ్విన : ఎవరినై తేనేం? ఆనందం అనుకో నన్ను మాటవరసకి. ఏకం నా సంఖ్య. ఎప్పుడూ ఇక్కడే నా ఉద్యోగం. నీకు ప్రస్తుతం సాయం చెయ్యడానికి వచ్చాను.

మాన : సంతోషం. నిజంగా ఇది స్వర్గలోకంలా ఉంది.

నవ్విన : ఇక్కడ ఉద్యోగుల్ని కొందర్ని చూస్తే ఇదే నరకం అనుకుంటావు నువ్వు. వాళ్ళ దాహం నువ్వు తీర్చలేవు. మాటవరసకి నాలోనే మరో దుర్మార్గపు వేపుంది. మాటవరసకి నీకు నేను న్యాయమూర్తి దర్శనం చేయిస్తాననుకో, నాకే మాత్రం లంచం చదివించుకోగలవు ?

మాన : ఇంకా సందేహమా ? ఇది నరకం.

నవ్విన : అన్నీ నీ మనస్సులో నువ్వే కల్పించు కొంటున్నావు. నిష్కల్మషంగా నీకు సహాయపడాలని వచ్చాను. మాటవరసకి నువ్వు కోరిన వరం ఇస్తాను. నేను కోరే హవిస్సులతో నన్ను సంతోషపెట్టు.

మాన : ఆనందానికి ఆనందం కలిగించాలా నేను ? నన్ను నేను హోమం చేసుకుంటున్నాను ఇది చాలదా నీ తృప్తికి. నిన్ను మూటనిమిది పేర్లతో పిలిచి స్తోత్రం చేస్తాను. నీకు జాలి గలగదూ, ధర్మదేవతసు చూపించవూ ?

నవ్వినa : ధర్మదేవతా దర్శనం ! అదంత సులభమను కున్నావా మానవుడా. మాటవరసకి అందుకెంత తపస్సు కావాలో ఆలోచించావా ?

మాన : నేను కోరకుండానే నిన్న ఆవిడ నాకు దర్శన మిచ్చింది.

నవ్వినవ్యక్తి : నువ్వు భూలోకపు కాల పరిమితులలో మాట్లాడడం మాని వేయాలి. మాటవరసకి నిన్న చూశావో, కొన్ని యుగాలక్రిందట చూశావో ఎవరికి తెలుసు? ఇంతకీ నువ్వెందుకు ఆవిడను చూడాలి?

మాన : నీకు తెలియదా మహానుభావా ! నా నోటంట చెప్పించాలా ?

న. వ్య : నువ్వేదో దావాలో గెలిచావటగాదూ ?

మాన : గెలిచానో, ఓడానో : ఈ ప్రాణాని కేమీ సుఖంలేదు. నా శరీరం నాకు దొరికితే బాగుండును.

న. వ్య : ఏమైంది నీ శరీరం ? ఎక్కడ పారేసుకున్నావు ?

మాన : నే నేమీ పారేసుకోలేదు. మీ న్యాయస్థానంలో ఒక ఉద్యోగి చేసిన పొరపాటువల నాకు మరణం సంభవించింది.

న. వ్య : అలాగనా పాపం.

మాన : ధర్మదేవత నా జీవితాన్ని నాకు మళ్ళీ ప్రసాదించింది. కాని మా వాళ్ళు నా శరీరాన్ని దహనంచేసి వేశారు. నిన్న రాత్రంతా నే నెంతో యాతనపడ్డాను. ఒక చచ్చిపోయిన గబ్బిలం శరీరంలో ప్రవేశించాను. గబ్బిలంగా బతకడం ఎంత కష్టం. చాలాసేపు ఒక చెట్టు కొమ్మని పట్టుకొని వేలాడేను. నూతిలో ఒక కప్ప చచ్చి పోయివుంది. పోనీ అని దాని ఒంట్లోదూరేను. కప్పబతుకు, అందులోకీ నూతిలోని కప్పబతుకు అదీ ఉక్కిరిబిక్కిరిగానే ఉంది. నాకు మిగిలిన అయిదేళ్ళు నా బతుకు నేను బతుకక ఇంకో జంతువుని ఎందుకు కావాలి నేను ?

న. వ్య : పోనీ మనిషిగానే బతకలేకపోయావూ ? మాట వరసకి భూలోకంలో మనుష్య కళేబరాల కేం తక్కువ ? అనుక్షణం ఎందరు మరణించడంలేదు ? కాశ్మీరంలో, మలయాలో, జావాలో-

మాన : ముప్ఫయి అయిదేళ్ళు నేను నేనుగా జీవించాను, నా శరీరంతో

సమాధానపడ్డాను. అదిమాని ఇంకొకరి బతుకు నేనెలా బతగ్గలను చెప్పూ ?

వాడి అలవాట్లు వాడి ఆలోచనలు అన్నీ వాడివే. పోనీ ఎలాగో కష్టపడి వాటినే అవలంబిస్తానుకో, అప్పటికీ నాది అబద్ధం బతుకే అవుతుంది.

న. వ్య : ఎక్కడో జరిగిన ఒక తప్పువల్ల ఎంత ఇబ్బందిలో పడ్డావు నువ్వు : నీకు సాయపడాలని వుంది నాకు. నువ్వు నాకే లంచాలూ ఇవ్వనక్కరలేదులే. నీకేం సహాయం కావాలో చెప్పు. నీ శరీరాన్ని మాత్రం చూపించమనకు.

మానవుడు : ధర్మదేవతని చూపించు.

న. వ్య : ఆవిడమాత్రం ఏం చెయ్యగలదు ? ఆవిడే కాదు ఎవ్వరూ ఇక నీ శరీరాన్ని నీ కివ్వలేరు.

మాన : దేవతలకి కూడా అసాధ్యమైన కార్యాలున్నాయా ?

న. వ్య : మానవుడివి కాబట్టి నీకు దేవతల శక్తిమీద విపరీతమైన విశ్వాసం వుండడం సహజమే. కాని దేవాదిదేవులు కూడా పురోగమన శీలమైన కాలాన్ని వెనక్కి మళ్ళించలేరు. కావాలంటే నీకు ధర్మదేవత దర్శనం యిప్పిస్తాను. లేదా ఇంకేదైనా సహాయం కావాలంటావా ? చెప్పు చేస్తాను.

మాన : అక్కర్లేదు. ఆవిడని చూపిస్తే చాలు. ఆవిడ నాకేదో దారి చూపిస్తుంది. ధర్మదేవత ఏం చెయ్యమంటే అది చేస్తాను.

న. వ్య : అయితే పద.

(పావు నిమిషం జంత్ర సంగీతం)

4

(ప్రకటన: నవ్వినవ్యక్తి, అనగా ఆనందం, తన వాగ్దానం ప్రకారం శరీరంలేని మనిషిని న్యాయమూర్తి సమక్షానికి తీసుకెళ్ళాడు)

మాన: ధర్మదేవతా! నిన్ను సందర్శించడానికి నేను ప్రచండమైన తపస్సు చేశాను. వర్ణనాతీతం నేను పడుతున్న క్షోభ.

న్యా: మళ్ళీ వచ్చావెందుకు మానవుడా! ఈమారు నువ్వు తెచ్చిన అభియోగం ఏమిటి?

మాన: నా శరీరం దగ్ధమైపోయింది. నేను నిలవడానికి నీడలేదు. మీరిచ్చిన అయిదేళ్ళూ తీసుకున్నా తీసుకోండిగాని, నిరాశ్రయంగా నన్నీ అనంత విశ్వంలో పరిభ్రమించ నివ్వకండి.

న్యాయ: మొదటిసంగతి ఆ అయిదేళ్ళూ నే నిచ్చినవి కావు. రెండోది వాటిని తీసుకొనే శక్తిగాని, అధికారంగాని నాకు లేవు.

మానవుడు: మరి నన్నిప్పుడేం చెయ్యమన్నారో మీరే చెప్పండి. జీవితం నుంచి నేనొక కాందిశీకుణ్ణయిపోయాను. ఇంకొకడి బతుకు నేను బతకలేను. ఎందుకు నాకీ అయిదేళ్ళు?

న్యా: పోనీ, యిదిచెప్పు. ఇంకో కొత్త బతుకు ప్రారంభిస్తావా?

మాన: అంటే? నాకు బోధపడలేదు. ఈ అయిదేళ్ళ కాలంలో యింకో కొత్తబతుకు ఎలా సాధ్యమవుతుంది నాకు?

న్యా: అయిదేళ్ళే అన్న పరిమితి తొలగిస్తాను. నీ యిష్టం వచ్చిన శరీరంలో నువ్వు ప్రవేశించు.

మా: వద్దుతల్లీ వద్దు. నన్నీ జన్మదుఃఖపు చెరనుండి విడిపించు.

న్యా: జన్మరాహిత్యమే! అదిమాత్రం నన్నడక్కు. ఆ వరం నేనివ్వలేను. నీకో జీవితాన్ని యివ్వగలను. నీకో శరీరాన్ని చూపించగలను. అంతేగాని జన్మరాహిత్యాన్ని ప్రసాదించేశక్తి నాకు లేదు.

మాన: దేవతలు తమ అశక్తిని నాదగ్గర చెప్పుకుంటున్నారంటే నవ్వాలో ఏడవాలో నాకు తెలియదు. కానియ్యండి, జరిగిన పొరపాటేదో

జరిగిపోయింది. నేను భూలోకానికి పోతున్నాను. ఏదోఒక శరీరంలో దూరుతాను. ఏదో ఒక బతుకు ఎలాగో ఒకలాగ బతుకుతాను. ఎప్పుడు మీరు పిలిపించుకుంటే అప్పుడు వస్తాను. ఇప్పుడు నాకు బోధపడింది. నేను మీ చేతిలో ఎలా ఆటవస్తువునో. ఇంకొకడి చేతిలో మీరు అలా ఆటవసువులు. ఆ ఇంకొకడు మరొకడిచేతిలో. ఆ మరొకడు వేరొకడి చేతిలో. ఇలాగ ఇది అనంతం.

న్యా : సృష్టి రహస్యం అంతా, ఇంతే. ఇక చెప్పు మానవుడా. ఏ శరీరంలో ప్రవేశిస్తావు ?

మాన : అన్ని శరీరాలూ ఇప్పుడు నా కొకటే. దేవతల్లోనూ మానవుల్లోనూ కూడా నాకు నమ్మకం పోతోంది.

న్యాయ : ఓయి మానవుడా నువ్వు దేవతలని నమ్మకపోతే పోయావుగాని మానవత్వంమీద విశ్వాసాన్ని మాత్రం విసర్జించకు. నిజమే. నీకు దేవతలవల్ల అన్యాయం జరిగింది. ధర్మదేవతని నేను క్షమించమని కోరుతున్నాను. మానవుడా ! దేవతలు నీ క్షమాపణ కోరుకుంటున్నారు. క్షమించవూ ?

మాన : ఎంత మాటన్నావు తల్లీ. ఇదిగో చేతులు జోడించి మొక్కుతున్నాను. ఈ అల్పమానవుడా దేవతలను క్షమించవలసినవాడు. అంతమాట అనకు తల్లీ. నాకు సెలవిప్పించు, నేను భూలోకానికి పోతాను.

ధర్మదేవతలు : ఇందుచేతనే దేవతలు మానవుని ప్రేమిస్తారు, ఈహృదయ వైశాల్యాన్ని చూచి : ఓ నరుడా నీకు వరమిస్తున్నాను. నీకు ఎవరిలాగ బతకాలని వుందో కోరుకో.

మాన : నాకు నాలాగతప్ప ఇంకోవిధంగా బతకాలని లేదు. అది అసాధ్యమని తేలిపోయింది. ఇక ఏ బతుకైతేనేం ? ఎలాగూ కొత్త జీవితం ప్రారంభించాలి. కాబట్టి సరికొత్త జీవితమే మొదలుపెడతాను. ననోన్ని అమ్మ కడుపులో పారెయ్యి తల్లీ. అదే నేను కోరే వరం.

ధర్మ : అదిగో మళ్ళీనాకులేని శక్తిసామర్థ్యాలనినా కాపాదిస్తున్నావు. నిన్ను తిరిగి నేను సృష్టించలేను. శిశువుగా జీవితాన్ని ప్రారంభిస్తానన్నావు

కనుక ఇదిగో విను. నీకు పూర్ణాయుర్దాయం ఇస్తున్నాను. ఈ క్షణంలో భూలోకంలో ఒక అమ్మాయి ప్రసవిస్తోంది. కాని ప్రాణంలేని శిశువు అది. అతికష్టంమీద వైద్యుడు ఆ శిశువుని పైకి తీశాడు. ఆ బిడ్డ శరీరంలో నువ్వు ప్రవేశించి బ్రతుకుని ప్రారంభించు.

మాన : మహాప్రసాదం దేవీ.

(అరనిమిషం జంత్రసంగీతం)

5

ప్రకటన : భూలోకంలో, ఆంధ్రదేశంలో, ఒక ప్రసూతి వైద్యశాలలో ఆపరేషన్ గది. ఒక అమ్మాయి మృతశిశువును ప్రసవించింది. క్లోరోఫారం నిద్రనుంచి మేలుకుంటోంది. చిన్న మూలుగు. పక్క పెద్ద డాక్టరు నిలుచున్నాడు. మిగిలినవాళ్ళు కొంచెం దూరంగా ఉన్నారు.

డాక్టరు : భయం లేదమ్మా. నీకేం ప్రమాదం లేదమ్మా. అంతా అయి పోయింది.

అమ్మాయి : (నీరసంగా) ఏ మయింది. డాక్టరుగారూ ! నా బిడ్డను చూపించరా ?

డాక్టరు : చూదువుగానిలే అమ్మా ! మొదట నీవు విశ్రాంతి తీసుకో.

అమ్మాయి : ఇది చెప్పండి డాక్టరుగారూ ? ఏం పిల్ల మొగాడా, ఆడదా ?

డాక్టరు : పిల్లాడేనమ్మా. కళ్లుమూసుకో, అటు చూడకు.

అమ్మాయి : అబ్బాయి కదలడేమండీ ! ఏడుపు వినబడదేం ?

డాక్టరు : ఏం చెప్పమంటావమ్మా ? నువ్వు ధైర్యంగా వుండాలి.


అమ్మాయి : చెప్పండీ. ఫరవాలేదు. చెప్పండీ, అబ్బాయి చచ్చిపోయాడు. అంతేనా ?

డాక్టరు : ఇంకా ఆశ లేకపోలేదు. మా ప్రయత్నాలు మేం చేస్తాం. కళ్ళు మూసుకుని పడుకో అమ్మా. మాట్లాడొద్దు. కదలవద్దు మెదలవద్దు.

అమ్మాయి : (దుఃఖంగా) నాకు తెలుసు. చచ్చిపోయాడు. లాభంలేదు. చచ్చిపోయాడు.

మానవుని గొంతుక : నేను చచ్చిపోలేదు. నమ్మండి నేను బతికేఉన్నాను.

(శివుడు రోదనధ్వని కెవ్వుమని వినిపించి క్రమంగా ఫేడౌట్.)



అనంతర యాత్ర

ప్రకటన : కాలం అంతా ఒకటేగాని అందరికీ ఒకటి కాదు. జీవిస్తున్నవారి కాలంవేరు. మరణించినవారి కాలంవేరు. గర్భంలోవున్న శిశువు దొకకాలం. ఇంకా గర్భస్థంకాని జీవి దింకోకాలం. స్టీమరులోనో, విమానంలోనో ప్రయాణం చేస్తున్నవాడికీ, నిద్రపోయి కలలు గంటున్నవాడికీ, మతిపోయినవాడికీ, వైరాగ్య నైరాశ్యాలవల్ల కాషాయం ధరించినవాడికీ, కాలం ఒకేవిధంగా గడవదు.

(రైలుబండి చప్పుడు ప్రారంభం)

తత్వశాస్త్రాధ్యాపకుడు శ్రీ రంగారావు రైలుబండిలో ప్రయాణం చేస్తున్నాడు. నిద్రపోతున్నాడు. అతడుకాక ఇంకా ఆ మొదటి తరగతి పెట్టెలో ఇద్దరుమాత్రం ఉన్నారు. కాంతం, సరళ.

కాంతం : హైమెంతయింది సరళా ?

సరళ : సారీ నా వాచి ఆగిపోయింది.

కాంతం : ముసిలాడు చేతిని వాచీతోనే నిద్రపోతున్నాడు. చూ డెంత హైమయిందో ?

సరళ : మర్యాదగా మాట్లాడు కాంతం. ఆయనెవరో తెలుసా ?

కాంతం : ఎవరైతే మనకేం? అయినా ఎవరు?

సరళ : ఆ సూట్‌కేస్‌మీద పేరుచూడు.

కాంతం : ఎ. యస్. రంగారావు. ఇంకో యస్. తక్కువ:

సరళ : షటప్ ఈయన చాలా గొప్పవాడు. మావా రెప్పుడూ ఈయన్ని గురించే చెబుతూంటారు.

కాంతం : సరే ఒప్పుకున్నాం. సైమెంతయిందో చూడమంటే—

సరళ : ఆరు

కాంతం : ఎప్పుడో ఆగిపోయిన నీ వాచీలో కాదు. అదుగో ఆవాచీలో. ఎంతయిందో చూడవే!

సరళ : నీవాచీ యేం చేశావ్? పెట్లో పెట్టేశావుకదూ? ఏం ఆ జాగ్రత్త.

సరళ : అక్కయ్యో య్ ।

కాంతం : ఏమిటే అది? నిర్ఘాంతపోయావ్?

సరళ : ఈయన వాచీకూడా ఆగిపోయింది !

కాంతం : మంచిపని చేసింది.

సరళ : కాదే. సరిగ్గా ఆరుదగ్గరే ఆగిపోయింది.

కాంతం : అయితే ఏమంటావ్?

సరళ : ఏమీలేదు, ఎందుకేనా మంచిది. నీవాచీకూడా చూడు. నా కేమిటో భయం వేస్తోంది.

కాంతం : సూపర్‌స్టిషన్ : భయమెందుకే ! అన్ని వాచీలూ సాయంత్రం ఆరుగంటల కాగిపోయాయనే ; ఈ రాత్రి ఏదో ప్రళయం వచ్చే స్తుందనే, ఫరవాలేదు నా వాచీ సరిగానే వుంటుందిలే !

సరళ : అయినా ఓ మారు పెట్టె తెరచి చూద్దూ !

కాంతం : చాదస్తం! చాలా రాత్రయింది. ఇక నిద్రపోదాం.

సరళ : అలాగంటే పనికిరాదు. నా గుండెల్లో పెద్ద బెంగపడింది. యేదీ నీ తాళం ఇలా ఇయ్యి.

కాంతం : ఇవ్వకపోతే ?

సరళ : పోసీ నువ్వే తియ్.

కాంతం : చిన్న పందెం వేద్దాం. నా వాచీ తిరుగుతూనే ఉంటుందని నేను, ఆగిపోయుంటుందని నువ్వు.

సరళ : అబ్బ తాళం యివ్వకపోతే నన్ను చంపుకు తిన్నట్టే.

కాంతం : ఏమిటా ఒట్లూ నువ్వూనూ? కావలిస్తే ఇంద.

రంగా : అమ్మాయిలూ యింకా నిద్రపోలేదు : అర్ధరాత్రయినట్టుందే, అరే నా వాచీ ఆగిపోయింది.

సరళ : నా వాచీకూడా సరిగ్గా ఆరుదగ్గరే ఆగిపోయిందండీ

కాంతం : ఊఁ నా వాచీ కూడా తీసిచూడు. ఇవాళ కాలమే ఆగిపోతుందని సరళ భయం.

రంగా : కాలం ఎప్పుడూ ఆగిపోదమ్మా, ఇక గడియరాల మాట? మూడు గడియారాలొక్కలాగి ఒకేచోట ఆగిపోతాయా అంటే అటువంటి సంఘటన అసంభవం అననుగాని – అవి అతి, అతి అత్యంత –

సరళ : (గట్టిగా) అక్కయ్యా : (రైలు ప్రమాదం. పెద్ద చప్పుడు. చాలా గల్లంతు. రకరకాల గోల.)

ఆకాశబాకా రేడియో వార్తలు. గతరాత్రి రైలు ప్రమాదంలో గాయపడినవారి సంఖ్య 24. మరణించినవారి సంఖ్య ఒకటి. మరణించిన వ్యక్తి ప్రొఫెసర్ ఏ. యస్.....

ఒక గొంతు : చాలు : ఈ వార్తలు. రైలు ప్రమాదం. గాయపడ్డవారు, మరణించినవారు : విమానప్రమాదం – గాయపడ్డవారు, మరణించినవారు: యుద్ధ ప్రమాదం – గాయపడినవారు మరణించినవారు : ఏదీ ఇవన్నీ మరపించే మంచి సంగీతం : (మ్యూజిక్)

రంగా : గణితశాస్త్రరీత్యా కాలం ఆగిపోవడం సంభవమా? అసంభవమా? ఆ అమ్మాయి వాచీ నడుస్తోందో ఆగిపోయిందో తెలియలేదే? అక్కయ్యా అని అరచి కిటికీలోంచి గెంతేసింది. నేను నిద్ర పోతున్నానా మేలుకున్నానా? ఇప్పుడు పై మెంతయిందో?

రైలు ఆగిపోయినట్టుందే ! స్టేషనుగానీ వచ్చిందా? అంతా చీకటిగా వుందే. అరే నా వాచీ ఏదీ? చెయ్యేదీ? శరీరం యేదీ?

ఒకగొంతు : ఆ ఒక్కడైనా చచ్చిపోయుండకపోనట. షాక్‌వల్ల గుండె ఆగిపోయిందట. ఇదిగో పేపర్లోవుంది.

రంగా : నాగురించే మాటాడుకుంటున్నారు.

ఒకగొంతు : ఆ పెట్టెలోనే ప్రయాణంచేస్తూన్న అమ్మాయొకర్తె పది గజాల దూరంలో బురదలో పడిపోయి చెక్కుచెదరలేదు.

రంగా : చేతులో రిస్టువాచీకూడా ఉందా ?

ఒకగొంతు : చేతిని రిస్టువాచీ మాత్రం ఆగిపోయింది. అయితే అది ప్రమాదానికి పూర్వం ఆరుగంటలకి !

ఇంకొకరు : ఈ పేపరువాళ్ళు ఏసంగతీ వదలిపెట్టరురా !

ఒకగొంతు : ఈ చిత్రం చూశావా ! ఆ పిల్లచేతిలో ఇంకో రిస్టువాచీ ఉందట. దానిముళ్ళు —

ఇంకొకరు : చాల్లెద్దూ !

రంగా : చంపేశాడు ! ఈసారి నేను నిజంగా చచ్చిపోయాను ! ముళ్లు తిరుగుతున్నట్టా? తిరగనట్టా? ఏయ్ పేపరు చదువుతున్న మనిషీ! నిన్ను-నిన్ను బతిమాలుకుంటాను. చెప్పవూ? దానిముళ్లు —

ఒకగొంతు : మూడుముళ్ళూ పడ్డాక ఏలుకోక ఏం చేస్తాడంట ?

రంగా : వీళ్లు మరేదో ధోరణిలో పడ్డారు. లాభం లేదనుకుంటాను, అయినా అరిస్తే - అరుస్తాడు - ఏయ్ అబ్బీ !

ఒకగొంతు : ఛీ ! దోమలు ఒకటే సంగీతం. మీ యింటినిండా ఇన్ని దోమ లేమిటి ?

రంగా : నేను దోమకన్నా హీనం ! దోమకు ప్రాణం ఉంది నాకు లేదు. లేదని బెంగకూడా లేదు, కాని పై మెంతయిందో తెలిస్తేనా ?

ఒకగొంతు : అబ్బో చాలా పై మయింది. ఇక నేనింటికి వెళ్ళాలి.

ఇంకొకగొంతు : ఏం ఇప్పు డేమంత మించిపోయింది. కాఫీ తాగి పోవచ్చు. ఒసే !

రంగా : కాఫీ తాగాలన్న తాపత్రయం ఒకటి వొదిలిపోయింది. చచ్చిపోవడంలో చాలా హాయుంది కాఫీ ఒకటే అన్నమాటేమిటి ? తిండీ తిప్పలూ అక్కర్లేదు. ఇల్లూ వాకిలీ అనవసరం ! బట్టలు వేసుకోవాలన్న బెడదేలేదు. నా టైం ఎప్పుడూ సమయానికి కనబడేది కాదుకదా ! సమయం ! సమయం! ఏమిటో జ్ఞాపకం వస్తోంది ! ఏమిటి చెప్మా ! ఆఁ అదే ! ఇదేమిటి నే నెక్కడికో తేలిపోతున్నాను ? ఏమిటి జ్ఞాపకం వచ్చిందీ ? ఏమో మరచిపోయాను.

(సానుభూతి సభలో)

ఉపన్యాసకుడు : సోదర–సోదరీ మణులారా ! మన మిప్పుడు ప్రొఫెసర్ రంగారావుగారి మరణానికి సానుభూతి ప్రకటించే నిమిత్తంఇక్కడ సమావేశమైనాం, రంగారావు నా ప్రాణస్నేహితుడు.

రంగా : పచ్చి అబద్ధం ! వీడే కాలేజీలో నా ఉద్యోగం పోవడానికి కారణం. అందుకనే నేను కడుపు చేత్తో పట్టుకొని ఉత్తరహిందూస్థానానికి పోయాను.

ఉపన్యా : రంగారావు మనవూరి వాడైనందుకు నేను గర్విస్తున్నాను. ఆయనఫిలాసఫీలో నిధి : ఖండ ఖండాఖంతరాల కాయనపేరు వ్యాపించింది. అతని పుస్తకాలు అర్థం కావడమే కష్టం ! నిజం చెప్పాలంటే నా కవి అసలే అర్థం కాలేదు ! అసలు నేను రాజకీయ వాదిని. జీవితమంతా దేశసేవలో వెళ్ళబుచ్చాను. నా ప్రియమైన పార్టీ నా సేవని గుర్తించి—

రంగా : నీ గొడవెవడిక్కావాలిరా నాకోసం జరుపుతున్న సభలో నాగురించి మాట్లాడవు ? నా పుస్తకాలు మహామహా వాళ్ళకే అర్థంకావు. నీకు బోధపడలేదని ఏడుపెందుకు ? ఛీ ! ఇహ నే నిక్కడ ఉండలేను. అంతా నటన ! అంతా మోసం. జీవించినంత కాలం నేను మానవుల్ని ద్వేషించాను. మరణించిన తర్వాత ఆ ద్వేషం మరింత దృఢపడింది. మరణం ఎంత మధురంగా ఉంది ! ఏ కోరికా లేకుండా చచ్చిపోవడం ఎంత హాయి! ఏ కోరికా లేదూ? లేకేం? ఒక్క కోరికమాత్రం మిగిలిపోయింది. ఆ అమ్మాయి పెట్టిలోంచి

తీసిన రిస్టువాచీ తిరుగుతోందా ? ఆగిపోయిందా ? ఆగిపోతే ఆరు దగ్గిరే ఆగిపోయిందా ? మూడు వాచీలు ఒక్కమాటు, ఒక్కచోట ఆగిపోతాయా ? ఎందు కాగిపోకూడదు ? ఎలా తీరుతుం దీ సందేహం ! ఆ అమ్మా యెక్కడుందో తెలిస్తే బాగుండును!

మగగొంతు : కంగ్రాట్యులేషన్సు మిసెస్ సరళా ! చాలా మిరేక్యులస్‌గా ఎస్‌కేప్ అయేరు !

సరళ : థాంక్‌యూ శర్మగారూ, మీ ఆవిడ నింపాదిగా ఉన్నారా ?

రంగా : ఈ ఆడవాళ్ళ కిదో జబ్బు ! ఎదటివాడి పెళ్లాం యోగక్షేమాలు భోగట్టా చేస్తారు. వాచీ సంగతి రానే రాదేమిటి చెప్మా ?

శర్మ : మీ అక్కచెల్లెళ్ళ రిస్టువాచీలు – పేపర్లో కెక్కాయే ?

రంగా : థాంక్ యూ శర్మగారూ !

కాంతం : సరిగ్గా వాచీ పెట్లోంచి పైకితీసిందోలేదో థాం ! పెద్దఏక్సిడెంట్. రెక్కలొచ్చినట్టు నా కళ్ళముందే ఎగిరిపోయింది. నేను కూర్చున్న దాన్ని కూలబడ్డాను. చిన్న గాయాలు తగిలాయి.

సరళ : పాపం ! రంగారావుగారిది వీక్ హార్ట్. లేకపోతే ఆయన బతికుండే వాడే.

శర్మ : కేజుఆలిటీస్ లేకపోతే ఏక్సిడెంట్ ఏమిటి ?

సరళ : వేళాకోళా లొద్దు శర్మగారూ ! రంగారావుగా రంటే నా కెంతో గౌరవం. ఆయన దురదృష్టానికి నేను చాలా విచారిస్తున్నాను.

రంగారావు : ఏమీ విచారం అక్కర్లేదు. నేను నిక్షేపంలాగున్నాను. నా సంగతికేం ? ఆ వాచీమాట చెప్పు.

కాంతం : వాచీ చూడ్డానికి ముందు మా మధ్య ఎంత రభస పెరిగిం దనుకున్నారు ! ప్రొఫెసరు వాచీ ఆరుదగ్గి రాగిపోయింది ! దీని వాచీ కూడా బ్రేక్ ఎస్టేర్డిన్ కోఇన్సిడెన్స్ ఆరు దగ్గిరే ఆగిపోయింది. పెట్లోవున్న నా వాచీ చూస్తానని—

సరళ : హల్లో ఫాదర్ ! శర్మగారూ, ఈయన మా నాన్న. నాన్నా ! ఈయన బి. ఏ.లో నా క్లాస్‌మేట్ శర్మ. నన్ను కంగ్రాట్యులేట్ చెయ్యడాని కొచ్చారు.

రంగా : ఈ నాన్న ఇప్పుడే రావాలి ? ఇక మళ్ళీ వీళ్ళు వాచీ సంగతి మాట్లాడరు. ఎలా తెలుస్తుంది ? ఏం సాధనం ?

శర్మ : క్షమించాలి ! భోంచేసే వొచ్చాను.

రంగా : అక్కడ్యా ! అని అరిచిందికదా అందులోకూడా ఆరే అయిందేమో ! లేక రైలుపెట్టె బోల్తాపడుతున్నందువల్ల అరిచుండకూడదూ ?

శర్మ : అవునండీ అమెరికా అంటే నా కేమిటో అసహ్యం. బ్రిటన్‌లోనే చదవాలనుంది.

సరళ : శర్మగారో చిన్న పింక్ సోషలిస్టు నాన్నా !

ప్రకటన : చచ్చిపోయిన ప్రొఫెసర్ రంగారావు, చాలా సేపు అక్కడే తచ్చాడాడు. కానీ మళ్ళీ వాచీమాట ఎవరూ యెత్తలేదు. కాలం ఇందాకా నేను చెప్పినట్టు అంతా ఒకటేకాని, అందరికీ ఒకటి కాదు ; మరణించిన రంగారావు జన్మించబోయే శిశువుల కాలంలో ప్రవేశించాడు.

(చల్లని నేపథ్య సంగీతం)

పిల్లలగొంతు : తాతయ్యా, తాతయ్యా !

రంగా : మీరంతా ఎవరర్రా !

ఒక పిల్లడు : మేం పుట్టబోయే పిల్లలం తాతయ్యా ! భూమ్మీద బతక బోతున్నాం. బతకడం ఎంతో బాగుంటుంది కదూ ?

రంగా : బతకడం బాగుంటుందని ఎవరు చెప్పారు. నన్నడగండి ; అరవై ఏళ్ళు బతికినవాణ్ణి. బతకడంలో వున్న బాధలన్నీ చెబుతాను.

ఇంకొక పిల్లడు : ఊపిరి తియ్యడమే ఎంతో సుఖమనీ, సులభమనీ అంటారు నిజమేనా తాతయ్యా ?

రంగా : క్షయరోగం అన్న పేరెప్పుడైనా విన్నారూ ? ఊపిరి తియ్యడం ఎంత సుఖమో, ఎంత సులభమో క్షయరోగుల్ని అడగండి. భయంకరమైన క్షయవ్యాధికి భూలోకంలో ఏటేటా కోటానుకోట్ల మంది బలి అవుతారు. సరేనా ? ఇంకో ప్రశ్న అడగండి !

ఒక పిల్లడు : బతికుంటే మంచి మంచి వస్తువులు తినొచ్చుకాదూ ?

రకరకాల పళ్ళూ, వేడి వేడి అన్నం, లడ్డూ, జిలేబీ, హల్వా, ఇడ్లీ, ఉప్మా, దోసె.

రంగా : ఆగవ్వాయ్ ఆగు. అజీర్ణం అన్నమాటెప్పుడైనా విన్నావ్? అబ్బ అన్ని రోగాలకి అదే మూలం. భూలోకంలో తిన్నది జీర్ణించుకో లేక బాధపడుతున్నవా ళ్ళున్నారు. తినడానికి తిండిలేక దేవురిస్తున్న వాళ్లున్నారు. తినడమూ బాధే, తినకపోవడమూ బాధే.

ఇంకొక పిల్లడు : జీవించడం అంటే ప్రేమించడం అన్నమాట. నిజమైన ప్రేమని అనుభవిస్తే, అంతకుమించిన స్వర్గంలేదంటారు నిజమేనా?

రంగా : అబ్బో! చాలా పెద్దమాట లాడుతున్నావ్. నేనోటి చెబుతాను విను. ప్రేమే కాదు, ఏ అనుభవమైనా, అనుభవించినంత సేపే ఆకర్షణ. కాని ఆ తర్వాత యాతనే అనుకోండి: అన్ని అనుభవాలూ చవిచూసిన నేను చెబుతున్నాను వినుకోండి.

ఒకపిల్లాడు : మీ రెంత తెలిసినవాళ్ళయినా. మేము స్వయంగా అనుభవించ కుండా, మీ వ్యాఖ్యానాలతో ఎలా తృప్తిపడగలం తాతగారూ!

ఇంకొకడు : ఇతను చచ్చిపోయాడురా; చచ్చిపోయినవాడు బతకడంమీద మాట్లాడితే ఇలాగే వుంటుంది.

రంగా : అయితే వెళ్ళండి. పుట్టండి ఆ భూలోకంలో పడండి. మీఅంతట మీరే తెలుసుకోండి: నేను చెబుతే నమ్ముతారా? అన్ని అనుభవాలూ అయిన తర్వాత అప్పుడే తెలుస్తుంది, వెళ్ళండి. శరీరాలు ధరించండి. ఎవరి శరీరాలలో వాళ్ళు, ఎవరి కాలం పొడుగున వాళ్ళు జీవించండి. కాలం కాలం! మరిచిపోయిం దేదో జ్ఞాపకం వస్తోంది. వాచీ వాచీ! ఎక్కడో వాచీ అందులో కాలం సాయం కాలం ఆగిపోయిందా, లేదా? ఎలా తీరుతుందీ సందేహం?

ప్రకటన : ఈ సందేహంతీరదు. రంగారావు అనంతర యాత్ర అనంతంగా సాగిపోవలసిందే,

సుప్తాస్థికలు

ప్రపరిత్రాణాయ సాధూనాం । వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ । సంభవామి యుగే యుగే.

శిష్టమానవ రక్షణ సేయుకొరకు । దుష్టమానవ నాశనోద్యోగమునకు
ధర్మ సంస్థాపనము నిమి త్తము ధరిత్రి । యుగయుగమ్ముల యందు నే
నుద్భవింతు.

ప్రకటన : సుప్తాస్థికలు, నిద్రపోతున్న ఎముకలు. ఎముకలు నిద్ర పోతాయా? ఏమో. పోనీ. నిద్రిస్తాయనే అనుకుందాం. నిద్రించడం తప్ప మరేమి చెయ్యలేవనే అనుకుందాం. నిద్రిస్తాయి కాబట్టి, కలలు కూడా కంటాయా ? ఏమో ఒక కవి యిలా అన్నాడు:

క వి :

అవి ధరా గర్భమున
మానవాస్థికా పరంపరలు !
సుప్త నిశ్శబ్ద సంపుటములు !
అట నొకే దీర్ఘ యామిని !
ఆ నిశా శ్మశాన శయ్యకు

ప్రాతఃప్రస క్తి లేదు :
ఆ యగమ్య తమో రహస్యాంగణాన
తాండవించును
మృత్యు శైతల్య మొకటె
అవి నితాంత హేమంత
హృదంతరంత రనుభవాళి
ఘనీభవించిన సమాధులు.
ఆ మనుష్యాస్థికలు
నిద్రలో మునింగి
సంచరించును భైరవస్వప్నవీధి
అవి చలించును తమ
చర్మ కవచ మెపుడో
బ్రతికిన దినాల
తలపోత బరువుచేత
నా కనుంగవ కన్నీళులై కరంగు
నవి యొనర్చెడు నీరవాహ్వాన మెరిగి
ఇంత శోషిల్లునేలా
నా హృదయ పుటము
వణకునేటికొ నా అస్థిపంజరమ్ము.

ప్రకటన : అస్థికలు, సుప్తాస్థికలు ! అయితే ? అదా ! సుప్తి. రాత్రి. చీకటి – నిశ్శబ్దం మరణం ! ఎముకలు మరణానికి చిహ్నాం కాబోలు. ఎవరి మరణం, ఏమి టిదంతా ? ఇదంతా దేన్ని గురించి ? ఏదో ఉపద్రవం సంభవించినట్లు ఏమిటా రోదన నాదం ? ఏం జరిగింది ? అలా కొట్టుకుంటున్నాయేం మీ గుండెలు ? ఏం ఘోరం ? ఏం విపత్తు ? ఎవరు పోయారు ? ఏమి టిదంతా ? ఎవరు ? ఎవరో మీ ఆత్మలకన్న ఆత్ముడూ ఆప్తుడూ ఎవరో మహాప్తుడో మహాత్ముడో మీకు దూరం అయి పోయాడా ? ఎవరికీ కనబడకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడా ? ఇదంతా యేమిటి ? ఎందు కీ యేడుపులు ?

విషాద కంఠాలు

వీమని చెప్పమంటావు
ఎందు కేడుస్తున్నామో ?
ఎందు కేడుస్తున్నామో
ఏమో మాకే తెలియదు !
ఏమి టిదంతా అంటావా ?
ఏమో మాకూ తెలియదు !
ఎవరు ? ఎందుకు ? ఏమిటి ?
ఇవన్నీ మాకేం తెలియదు.
ఎప్పుడు ? ఎక్కడ ? ఎలాగ ?
ఏం ప్రశ్నలయ్యా ! ఇవి ?
నోరులేని గాలి నడుగు.
ఆవులించిన ఆకాశాన్నడుగు !
ఔను ! ఘోరమే జరిగింది !
అనుకోనిదే నిజమయింది.
ఎందుకా ఏడుస్తున్నాం అని
ఇంకా అడుగుతున్నావా ?
ఒకళ్ళా ఇద్దరూ కాదు
ఒక కుటుంబం ఊరూ కాదు
ఒక నగరం ఒక రాష్ట్రం కాదు
ఒక దేశం ఒక ఖండం కాదు
సమస్త ప్రపంచం నేడు
సమగ్ర దుఃఖంలో మునిగిందయ్యా
అమేయ మీ ఉపద్రవానిది
అంతర్జాతీయ పరిమాణం !
అమెరికాలో సాహుకారు
ఆఫ్రికాలో నీగ్రో
భవనంలో మహారాజు
ఫ్యాక్టరీలో కూలీ

ఒకటొ ఇద్దరూ కాదు
వందమూ పేమూ కాదు
ధరిత్రి ఈ కొసనించి ఆ కొసకి
దద్దరిల్లిపోయిందయ్యో !
ఇంకా ఏమని చెప్పమంటావు
ఎందు కేడుస్తున్నామో !
హిమాలయం మా
హృదయభారం !
గంగానది మా కన్నీళ్ళు !

ప్రకటన : ఔను ఔను, నా కర్తవ్యమతోంది. మిమ్మల్ని ఓదార్చ డానికి ప్రయత్నించను. అయినా ఇటు చూడండి. ఈ శ్మశాన ప్రశాంతిని! హెచ్చు తగ్గులులేని ఈ మైదానాన్ని చూడండి. మృత్యువు భయంకరమైన దని మీ ఉద్రేకం చెబుతుందేమో కాని, ఈ ప్రాంతం ఎంత ప్రసన్నమో ఒక్కసారి ఆలోచించి చూడండి ! ఎవరో ఇటు వస్తున్నారు.

సంధ్య

నేను సంధ్యని
దివసమ్మునకు వయోధికత
ప్రాప్తించినది
తీక్షణదీప్తి లడంగి దినరాజు
కృశియించె !
వృద్ధాహ్న మిడిన దీవెనచేత
జనియించి
ఔద్ధత్యమునసే అహర్పతిన్
ప్రేమింగితిని ;
ఈ నా భవనమ్ము లోకానంద
మొసగునా !
ఏ నెప్పటికి కూడ ఇటు
వికాసింతునా ?

నా కే నిమిసమేని
లేకుండునా మృతి
ఇట మాయమైన నాకెట
సమున్మేషమో ?
అంధకారం

నేను చీకటిని
ఈ దివారోచి స్నుధా
ధామముం గూల్చి,
ప్రాదుర్భవించి నే
బయలుదేరినయంత —
జగతి యేమోకాని
నగవే మరచిపోయి,
వగపుచే తపియించు :
వనటచే నిట్టూర్చి :
నా మేలిమిసుగులో
వలపు లూరెడు నంట.
నామీద జగతి కింతయు
ప్రేమ లేదంట :

నక్షత్రం

నేను నక్షత్రాన్ని.
నీలోత్పల నికాశ
మీ నిశీథమునుండి
ఎలుగెత్తి యేడ్తు
వెందుల కంధకారమో ?
వాగులైనా ప్రేమ
వరియించునే నిన్ను,

స్వాగత మ్మొసగు
నాశాగంధ వాయువుల్ :
నిలువలేనే నీవు
నిలిచియుండిన వేళ :
వెలుగలేనే నీవు
విస్తరిల్లని వేళ :
నీ కాటుకలచేత్ నా కనుల్
వికసించు :
నీకు నేనే, నాకునీవె
ఈ లోకాన :

ప్రకటన : మృత్యువు జగద్విజేత కావచ్చును. కాని మరణాన్ని ప్రేమ జయిస్తుంది.

ఒకగొంతు : సకల ప్రాణులనూ సమానంగా ప్రేమించ గలిగిన వ్యక్తికి మరణమా ? ఇది నిజమని ఎలా నమ్మడం ?

రెండవ : పుష్పక విమానంలోవలె అతని హృదయంలో ఎంద రధివ సించినా ఇంకా స్థలం ఉండనే ఉంటుంది.

మూడవ : ఎన్ని గ్రంథాలు చదివినా మానవ మేధస్సులో ఇంకా కొత్త భావాలకి తావున్నట్లు.

బృంద గీతి

చీకట్లతోటలో కన్నీటిలోయ
కన్నీటి లోయలో, కారుణ్యరేఖ.
పాపాల కోనలో
పసిపాప నవ్వు
చీకట్ల కోటలో
చిన్నారి వెలుగు
మృత్యు నిశ్శబ్దాన
మృదు జీవరవళి

ఎముకల నిద్రలో
ఇంపైన కలలు,

ప్రకటన : అదుగో : అదుగో : అటు చూడండి. భయంకర చితాగ్ని జ్వాలలనుండి పెకిలేస్తున్న ప్రశాంత తేజాన్ని చూడండి : అతని భౌతిక శరీరం అగ్ని [illegible]తిఅయింది. అతని అనశ్వరాత్మ ఆకాశాల నాక్రమించింది.

బృందగీతం

అతడు సామాన్య వ్యక్తి
అత డసామాన్య వ్యక్తి
తృణం కన్నా తేలిక
మేరువుకంటే ధీరుడు :
ఆగర్భ శ్రీమంతుడు :
నిత్య దరిద్ర నారాయణుడు
వయస్సు మీరిన బడుగు,
వయస్సు లేని నిసువు :
అన్యాయం సమక్షంలో
అగ్రమహోదగ్రమూర్తి
చరాచర ప్రపంచానికి
క్షమా మార్గదర్శి
అత డిప్పుడు లేడు
అత డెప్పుడూ ఉన్నాడు
అమరత్వం అందుకున్న
అతనికి మా నతులు :

ప్రకటన : అరే ! ఎవరూ లేరే ? ఎంత శూన్యంగా వుందో ఈ స్థలమంతా? ఏదీ చితి ఏదీ జ్వాల ? ఏవీ అస్థికలు ఏవీ బూడిద ? ఏవీ లేవే? అన్నివస్తువులూ తమ ఆకారాన్ని పరిత్యజించినట్టుందే! అంతా శూన్యాకాశం ! నిర్జన నిర్జీవ నిరుపాధిక నిశ్శబ్దం! (క్షణం నిశ్శబ్దం) ఈ

నిరవధిక నిశ్శబ్దంలో.....ఏమి టా గుసగుసలు. వెలుగూ చీకటీ కాని, బుద్ధికీ కంటికీ అందని ఈ విచిత్రాకాశపథంలో ఒక సోదరతార సహస్ర కోటి యోజనాల దూరంలో ఉన్న ఇంకొక సోదరీ తారతో సంభాషిస్తోంది.

ఇవ తార : అక్కా ! ఒసే చుక్కా !

అవ తార : ఏం తమ్ముడూ !

ఇవ తార : అదేమే అలా తుళ్ళిపడి లేచావూ ?

అవ తార : ఏం లేదు. నిద్రపోదూ !

ఇవ తార : మరి ను వ్వెందుకు మేలుకున్నావూ ? ఎందుకే అలా వణుకు తున్నావు ?

అవ తార : ఏం లేదు పడుకుందూ. ఏమిటో నిద్రలో వినబడింది.

ఇవ తార : ఏమిటే అక్కా. ఏమిజరిగిందేమిటి ? ఏమి వినబడింది నీకు ?

అవ తార : అబ్బ ! ఏంలేదు పోనిద్దూ !

ఇవ తార : కాదే, చెప్పవే ?

అవ తార : ఏముందిలెద్దూ. ఎక్కడో భూగోళంలో, మినుకు మినుకు మనే భూగోళంలో సరిగ్గా కనబడీ కనబడని భూగోళంలో—

ఇవ తార : ఆఁ— ఆఁ ఏమయిందేం ?

అవ తార : భూగోళంమీద హ స్తినాపురం అనే ఊరుంది. దాని ప్రస్తుత పేరు నాకు తెలియదు.....వింటున్నావా ?

ఇవ తార : ఆఁ వింటున్నాను. హ స్తినాపురం అనే ఊళ్ళో—

అవ తార : నాలుగుసార్లు రివాల్వరు పేలుడు వినిపించింది.

ఇవ తార : రివాల్వరా ? రివాల్వరంటే ఏమిటే ?

అవ తార : రివాల్వరంటే తెలియదూ ? ఆటంబాంబుకి ముత్తాత.

ఇవ తార : ఆటంబాంబు అంటే ఏమిటి ?

అవ తార : అబ్బ వూరుకుందూ ! నీ ప్రశ్నలకు జవాబు చెప్పలేక పోతున్నాను.

ఇవ తార : పోనీలేవే. అక్కా ! పోనీ, ఇది చెప్పు ! నాలుగు మోతలు వినడం వల్లనా నీకు నిద్రాభంగమయింది ?

అవ తార : కాదు తమ్ముడూ ! వినుమరి ! ఆ రాక్షసధ్వనులు నాల్గింటినీ

మరో నాలుగు అక్షరాలూ, రెండురెళ్లు నాలుగు అక్షరాలూ ఎదురొక్కొన్నాయి ! ఎంత పెద్ద యుద్ధ మనుకున్నావు ? ఇప్పటికీ జిరుగుతూనే ఉంది ! హింసకీ అహింసకీ యుద్ధం ! అబ్బా. ఇంకా వినబడుతూనే ఉంది ! ఎలా కొటుకుంటున్నాయో నా గుండెలు !

ఁవ తార : ఏమిటే ఆ అక్షరాలు నాలుగూ ?

ఁవ తార : "హారాం ! హారాం !" అని.

ఁవ తార : అంతేనా అక్కా ? అంతేనా ? నాలుగుమార్లు రివాల్వరు చప్పుళ్లు "హారాం హారాం" అనే గద్గద స్వరాలు ! అంతేకాదూ, అంతేనా ?

ఁవ తార : అంతే అనా అడుగుతున్నావు తమ్ముడూ ! అలా ఆవ లిస్తున్నావేం ?

ఁవ తార : అబ్బా, నిద్ద రొస్తోందే ;

ఁవ తార : నీ కెలా నిద్దర పడుతోందిరా తమ్ముడూ ?

(పరిత్రాణాయ సాధూనాం....)



విదూషకుడి ఆత్మహత్య

ప్రయోక్త : మన విదూషకుడి పేరు మందహాసం. అతనికి చిన్నపిల్లలన్నా క్రాస్‌వర్డు పజిల్స్ అన్నా చాలా యిష్టం!

ఆటంకం : విదూషకుడి పే రేమన్నారు?

ప్రయోక్త : ఆటంకంగారూ! తమ రిలాగ మధ్య మధ్యని అడ్డు సవాళ్లు వేస్తూంటే, కథ సాగడం కష్టం.

ఆటంకం : నన్ను తమరించడం భావ్యంకాదు. పరాగ్గా విన్నాను, కాబట్టి మరోమాటు చెప్పండని విన్నపం చేసుకున్నాను. అది శ్రీవారి దృష్టిలో మహాపరాధంలా కనబడితే, మరి నేను మాట్లే ఆణ్ణు.

ప్రయోక్త : నే నెవరి వాక్స్వాతంత్ర్యమూ అరికట్టేవాణ్ణి, అపహరించే వాణ్ణికాను. తమరు పోనీ, నువ్వు పది ప్రశ్న లడగొచ్చు. నేను పది జవాబులు చెప్పొచ్చు. కాని చెప్పిందే చెప్పమంటే, నాకు చిర్రెత్తుకొస్తుంది. మళ్ళీ మొదలుపెడుతున్నాను. అదే ఆఖరుసారి మొదలుపెట్టడం. మన విదూషకుడి పేరు గడియారం. అతనికి చింతపిక్కలన్నా, సీసపద్యాలన్నా చాలా యిష్టం.

ఆటంకం : మహాశయా ప్లేటు మార్చేస్తున్నారు. ధర్మం కాదు. ఇందాక

అతని పేరు మందహాసమనీ, చిన్నపిల్లలూ క్రొవ్వర్ధి పజిల్స్ అతనికి చెడ్డయిష్టమనీ సెలవిచ్చారు.

ప్రయోక్త : అంతా వింటూనే వినన్టు నటించే నిన్నేమనాలి? మందహాసం అన్నా, గడియారం అన్నా ఒకటే అని ఎందుకర్థం చేసుకోకూడదు?

ఆటంకం : బహుశా గడియారం అనేది ఇంటిపేరై వుంటుంది.

ప్రయోక్త : ఉండదని నే నంటున్నా. కాదంటే నీ కథ నువ్వే చెప్పుకో. హన్నా పెంకితనం.

ఆటంకం : లేదు. లేదు. తమ రాగ్రహిస్తే ప్రపంచం భస్మమైపోదుగాని. నాటకం ఆగిపోతుంది. కానీండి స్వామీ వింటున్నాం. ఈ సారి అడ్డంరాను. రెండో ఆఖరిసారి మొదలెట్టండి. అదే కడసారి ఆఖరిసారి.

ప్రయోక్త : మన విదూషకుడి పేరు కుతూహలం. అతనికి మందహాసాలన్నా, గడియారాలన్నా మహాయిష్టం.

ఆటంకం : మహ (అ,) యిష్టం?

ప్రయోక్త : వ్యతిరేకార్థంలో అయితే మహా అనిష్టం అనేవాణ్ణి. ఆ మాత్రం వ్యాకరణం తెలియదూ?

ఆటంకం : మహాయిష్టం ఏ సమాసం సార్?

ప్రయోక్త : సంకర సమాసం. ఒప్పుకున్నాం. కాని చెవికి బాగుంది. అందరకీ అర్థమవుతుంది.

ఆటంకం : ఒప్పుకున్నాం అని తప్పుకున్నారు. అదే బాగులేదు. కాని ఈ దంతకాష్టం సంగతి చెప్పేరు కారు.

ప్రయోక్త : ఏ దంతకాష్టం? ఈ రాత్రిపూట దంతకాష్టం గొడవ వెందుకొచ్చింది?

ఆటంకం : మీ రిప్పుడు చెపుతున్న ఆసామీ సంగతి. మీ రతనికి మూడు పేర్లిస్తే, నేను నాలుగోపేరు పెట్టాను. మందహాసం వురఫు గడియారం వురఫు కుతూహలం మన విదూషకు డేమౌతాడు? ఆఖరికి ఆత్మ హత్య చేసుకుంటాడా? అది మొదట చెప్పండి.

ప్రయోక్త ; అతను ఆత్మహత్య చేసుకోడం అప్పుడే అయిపోయింది.

ఆటంకం : ఎప్పుడు ? ఎప్పుడు ? నేను వినలేదే ?

ప్రయోక్త : నువ్వు వినకుండా ఎన్నో గానసభలు జరిగిపోయాయి. హరి కథలూ, యక్షగానాలూ అయిపోయాయి. నువ్వు వినలేదని రైల్వే ప్లాట్‌ఫారాలమీద వీడు కొలుపులూ, శాసనసభలో చర్చలూ, పబ్లిక్ టెలిఫోనులో ప్రైవేట్ సంభాషణలూ ఆగిపోలేదు. "మృచ్ఛకటికం" అన్న పేరు విన్నావూ ?

ఆటంకం : విన్నానుగాని మీ ప్రసంగానికీ, ప్రస్తుత సందర్భానికీ బుద్ధి మాత్రం సిద్ధించలేదని ముకుళితకరాలతోనేకాక, ముక్తకంఠంతో కూడా ఘోషించడం మానలేకపోతున్నాను.

ప్రయోక్త ; మానొద్దు. అవశ్యం ఘోషించు. ఏమన్నావూ ? అప్రస్తుతంగా అసందర్భంగా వుంది నా ప్రసంగం ?

ఆటంకం : అవును. కావాలని శకారుడిలాగ మీరు మాట్లాడదలచుకుంటే తప్ప.

ప్రయోక్త : నన్నుకూడా నువ్వు నువ్వే అను. మీరు బహువచనం. నేను ఒక్క మనిషినే. ఏకవచనం చాలు.

ఆటంకం : గౌరవార్థకం.

ప్రయోక్త : తేనిటి విందు. దానికేం. ఈ మృచ్ఛకటికం ఉందే –

ఆటంకం : ఉంది.

ప్రయోక్త : ఉందీ ?

ఆటంకం : ఉంది. ఉన్నది. ఉన్నయది. ఉండినయది.

ప్రయోక్త : ఉండినయదియ కాదు ఉండెడునదీయును : అన్నటికీ ఇన్నటికీ ఎన్నటికీ కూడా.

ఆటంకం : మీరు–కాదు నీవు. మాటలాడుచున్నయది తెనుగే యటందువా?

ప్రయోక్త : దయచేసి నా మాటల్లో చెప్పు పట్టడం మానేయ్యి.

ఆటంకం : వ్యాకరణం గొడవ మొదలెత్తిం దెవరు ?

ప్రయోక్త : మొదలెత్తితేనేం ? పిదప దించెయ్యకూడదా ?

ఆటంకం : సరే దించేదాం ! ఉభయులం ఇందుమూలంగా యావన్మందికీ తెలయచేసే దేమిటంటే _

ప్రయోక్త : యావన్మంది ! కర్ణకఠోరమైన అపశబ్దాలు కావాలని వాడు తున్నాపు. శుక్రాక్షి కశేభరాన్మృగపతీ !

ఆటంకం : త్రైలోక్య దామోదరా. యావన్మంది నికార్సైన జాతీయం. తెలుగువాళ్ళు యావన్మందీ యావన్మంది అని వాడుతారు. మనం జనం విడిచి లొట్టలుపెయ్యడం మానేద్దాంవా ? వద్దా ? విషయం విమూషకుడి ఆత్మహత్య. దానికీ, మనం మాట్లాడుతున్నదానికీ యెక్కడా లంగరందలేదు.

ప్రయోక్త : పోనీ ఈ సారి మళ్ళీ తొలిసుంచీ ప్రారంభించనా ?

ఆటంకం : వొద్దు. ఆఖరిసారి నువ్వు ప్రారంభించడం అయిపోయింది. నేను ప్రారంభిస్తే, అది మొదటిసారి అవుతుంది.

ప్రయోక్త : అదే ఆఖరిసారికూడా కావాలి. ఆరంభించు.

ఆటంకం : అలాగే అంతా వినండయ్యా. సైలెన్స్ కామోష్. తెలుగులో అయితే ష్. (తలుపుతట్టిన చప్పుడు) ఏమిటా చప్పుడు.

ప్రయోక్త : ఎవరో తలుపు కొడుతున్న చప్పుడు.

ఆటంకం : ఇంకా ప్రారంభించలేదు. ష్. కామోష్. (చప్పుడు ఆగుతుంది.) విమూషకుడి ఆత్మహత్య. రేడియో నాటకం. టెలిఫోను సంభాషణ. మృచ్ఛకటికటికం. ఏకవచనం. బహువచనం.

ప్రయోక్త : నువ్వంతా పాడు చేస్తున్నాపు. ఇది రేడియో నాటకమని ఎవరన్నారు ?

ఆటంకం : నేనే. విజంచెబితే నిష్ఫూరం. హాస్యానికైనా అబద్ధా లాడ కూడదు.

ప్రయోక్త : ఇది రేడియోనాటకమే అనుకో, కాని ఇంకా ప్రారంభం కాలేదు.

ఆటంకం : ఇంకో అబద్ధం. అప్పుడే ప్రారంభమై అయిదు నిముషాలు దాటింది. అదుగో గడియారం :

పిలుపు–సత్యం : గడియారం : గడియారం :

తలుపు : (తట్టిన చప్పుడు)

ప్రయోక్త : నాటకం ప్రారంభమయింది. గడియారంగారి ఇంటి ముందర నిలబడి యెవరో ఇద్దరు తలుపు తడుతున్నారు.

ఆంజనేయులు : తలుపు తలుపు. (చప్పుడు)

సత్యం : ఏవండోో గడియారంగారూ.

పౌరుగింటావిడ : (దూరపు గొంతుక) వాళ్ళెవరూ ఊళ్ళో లేరండి. ఇల్లు తాళం వేసుకొని ఏ వూరో వెళ్ళారు.

ఆంజనేయులు : తాళం అంటుందీ, లోపల గడియ వేసుంటే.

ఆటంకం : ఎవరావిడ ?

ప్రయోక్త : పౌరుగింటావిడ.

సత్య : ఎవరూ లేరంటూందేమిటి ? లోప లెవరో ఉంటితీరాలి. తలుపు తలుపు. (దబదబా చప్పుడు)

పౌరుగింటావిడ : గడియారంగారు పెళ్ళాం పిల్లలతో నిన్న సాయంత్రం, రైలు కెళ్ళారు, మీ రెంత పిలిచినా ఎవరూ పలకరు. తలుపు తాళం కనబడదు ?

ఆంజనేయులు : తలుపూ ? తాళం ? లేదంటే ?

ఆవిడ : తాళం లేమూ ? (నమీపించి) రాత్రికి రాత్రి మళ్ళీ వొచ్చారేమిటి చెప్మా. ఊరికెళ్ళడం మానేసి ? ఈ గడియారం ఒక విడ్డూరపు మనిషి. (తలుపు తడుతుంది) శాంతమ్మా, శాంతమ్మా.

సత్యం : ఇంట్లో అలికిడేవీ లేదు :

ఆవిడ : నెల్లాళ్ళదాకా రానని చెప్పి మరీపోయారు. అప్పులవాళ్ళ బాధల్లా తప్పించుకుందామని లెండి. పాపం చాలా హింసపడ్డారు. ఎవరికైనా వస్తాయి కష్టాలు. కాని వీళ్ళలాగా బాధలు పడుతున్నవాళ్ళ నెక్కడాచూడలేదు. పదేళ్ళనించి ఎరుగుదును కదా. ఒక్కనాడైనా వాళ్ళు సుఖంఅంటే ఏమిటో ఎరగరు. ఏడాదికిందట రెండో అబ్బాయి చనిపోయినప్పుడు పాపం శాంతమ్మ మంచంపట్టి ఇప్పటికీ

తేరుకోలేదు. ఎలా కాలక్షేపం చేస్తోంచో ఇంత దరిద్రంలో. పగవాడికైనా వొద్దుబాబూ అలాంటి కష్టాలు.

ఆటంకం : నీకన్న నయం. నిమిషంలో గడియార సంసారం కథంతా పూసగుచ్చినట్లు చెప్పేసింది. నువ్వు నీళ్ళు నములుతూ చిన్న పిల్లలనీ సీసపద్యాలనీ ఒహంతకి తెమిల్చేవు కావు.

ప్రయోక్త : అందుకే ఆడవాళ్ళని అన్ని ఉద్యోగాలలోకి ఆదరించి తీసుకుంటున్నారు.

సత్యం : ఆంజనేయుడూ మరిప్పుడేం చేద్దాం? ఇంట్లో తలుపేసుక్కూచున్నాడు. ఎంత పిలిచినా పలకడు.

ఆంజనేయులు : నిద్రపోతున్నాడేమో ?

సత్యం : పొద్దెక్కిపోయినా ఏమిటా మొద్దు నిద్దుర.

ఆవిడ : మీకూకాడా ఏవైనా బాకీవున్నాడా గడియారంగారూ? తెల్లారేసరికొచ్చిపడతాడు - ఎక్కడలేని అప్పులవాళ్ళూ. ఒక్కొక్కప్పుడు గడియారం నాలుగైదురోజులు కనపడకుండా మాయమైపోతూవుంటాడు. ఇంట్లో దమ్మిడీయేనా ఇచ్చివెళ్ళడు. ఇవ్వడానికేమయినా వుంటేనా? మాలాంటివాళ్ళం అడపా దడపా ఆదుకుంటే మాత్రం? ఎంతోప్రాణంమీదకొస్తేతప్ప ఇరుగింటి గుమ్మం తొక్కదావిడ. ఏ రోజు కారోజు వొచ్చేపోయే యమలాళ్ళకి జవాబులు చెప్పలేక పాపం : ఆ ఇల్లాలు సతమతమైపోతూవుంటుంది.

ఆంజనేయులు : శాంతమ్మ మా చెల్లెలేనండి.

పొరుగింటావిడ : శాంతమ్మ అన్నగారా మీరు. క్షమించండి. తెలియక ఏవేవోటో నోటికొచ్చిందల్లా వాగేశాను. అన్నట్టు శాంతావాళ్ళూ మీ ఊరికే బయలుదేరి వుండాలే.

ఆంజనేయులు : ముందుగా ఉత్తరమ్ముక్కేనా రాసిపారేశాడు కాదు. దౌర్భాగ్యుడు.

సత్యం : ఇంటిల్లపాదికి రైలు టిక్కట్లకి పొయ్యకపోతే, ఆ డబ్బుతో అప్పు తీర్చుకోవచ్చునే?

ఆవిడ : అవి తీరే అప్పులు కావండి. గడియారం ఈ వీధంతటికీ బాకీ. ఈ వూరంతటికీ బాకీ. అలాగని ఆయనకి దురలవాట్లేవీ లేవు సుమండీ – నాటకాల్లో వేషాలువేసే తతిమ్మా వాళ్ళందరిలాగ.

ఆటంకం : ఈ తలుపుదగ్గర పాట ఇంతటితో పూర్తయ్యేట్టు లేదు. నువ్వెక్కడి ప్రొడ్యూసరివయ్యా! ఇంత సేపు సస్పెన్సు నిలుస్తుందీ? ఆ ఇంట్లో విదూషకుడు చచ్చిపడివున్నాడని ఈపాటి కందరికీ తేలి పోయుంటుంది. వేగిరం తలుపులు బద్దలుకొట్టించు, ఉరిపోసుకుని వేలాడుతూవున్న విదూషకుణ్ణి చూసి, పొరిగింటావిడ వేసే గావు కేకకి మైక్ బద్దలై పోవాలి : అదీ డ్రామా అంటే. గాలి పోగుచేసి నాటకం వేసేస్తే సరా.

ప్రయోక్త : క్వయట్ ప్లీజ్, గంగాధరం ఉరిపోసుకుని చచ్చిపోయాడని నీ కెవరు చెప్పారు? విషం తాగాడు.

ఆటంకం : కొత్తగా ఈ గంగాధరం ఎవరు?

ప్రయోక్త : విదూషకుడు. నేను సృష్టించిన పాత్రకి నా యిష్టం వచ్చిన పేరు పెడతాను. ఇష్టం వచ్చినన్ని పేర్లు పెడతాను.

ఆటంకం : నే నెవరి నడగడానికి? అంతేనా, సాధారణంగా లోకంలో ఒక మనిషికి ఒక పేరుండడం రివాజు.

ప్ర : నువ్వు చూసింది చాలా చిన్నసైజు లోకం అయ్యుండాలి.మన్మధుడి కెన్ని పేర్లో తెలుసునా?

ఆటంకం : మన్మధుడిది మనలోకంకాదు.

ప్ర : తెలుగుకి పర్యాయ పదాలు తెలుసా?

ఆటంకం : అది భాష. నేను మాట్లాడేది మనుష్యుల సంగతి.

ప్ర : కొండడూ, కరుణాకరుడూ, పురుషోత్తముడూ తెలుసా,

ఆ : అది సినిమా.

ప్ర : ఇది రేడియో.

ఆ : అంచేత లైసెన్సు.

ప్ర : సైలెన్సు. పొరుగింటావిడ వెళ్ళిపోయింది.

ఆ : ఔను పాపం. ఎంతసేపని పరాయిమొగాళ్ళతో నడివీధిలో నిలబడి మాటాడుతుంది.

ప్ర : అనవసరంగా ఆవిడ శీలమ్మీద అక్షింతలు వేయ్యకు. ఇలాంటి దుర్మార్గపు కూతలు ఆ యిల్లాలు చెవినిపడితే, యేమనుకుంటుంది?

ఆ : కన్యాశుల్కంనుంచి కాపీ కొట్టావనుకుంటుంది.

ప్ర : బ్రేవో, వారెవా, బాపురే, బాగా అన్నావు. కన్యాశుల్కం అంటే జ్ఞాపకం వొచ్చింది. ఇందాక మ్యచ్చకటికం మాటెత్తాను, ఎందుకో ఎరుగుదువా?

ఆ : ఏమో నాకేం తెలుసు.

ప్ర : మన కోలాహలం ఆ నాటకంతోనే మొదటిసారిగా పైకొచ్చాడు.

ఆ : అయిదు.

ప్ర : అయిదూ. ఏమిపైదు, అణాలా? ఓట్లా? కర్పూరపు దండలా?

ఆ : దండలుకావు. పేరు. విదూషకుడిపేరు, కోలాహలం అయిదు, దంతకాష్టం కూడా కలుపుకొంటే ఆరు.

ప్ర : ను వ్విచ్చిన పేరుగాని, సవరణగాని నే నుపయోగించను.

ఆ : పోనీ, అవన్నీ నాకే మిగులు. తరవాత ఏమైంది?

ప్ర : తరువాత? దేని తర్వాత?

ఆ : అట్టహాసం మ్యచ్చకటికంతో పై కొచ్చిన తర్వాత.

ప్ర : అట్టహాసం అంటే మందహాసం అనేనా నీ ఉద్దేశం! నా విదూషకుడికి నీ పేరేదీ అతికించొద్దని చెప్పలేదురా? అయిదుపేర్లిచ్చాను కదా వాటిలో ఏదయినా వాడకూడదా?

ఆ : గడియారం వాడుకోవచ్చునా?

ఆంజ : గడియారం గడియారం. తలుపు గట్టిగా తొయ్యరా సత్యం. మీది గడియ పెయ్యనట్టుంది. అడ్డు గడియ ఒక్కటే వేసుంది. (తలుపు తెరచుకున్న చప్పుడు)

ఆ : అంతట విదూషకుడు మరణించి ప్రవేశించును. (సాఫ్ట్ అండ్ శాడ్ మ్యూజిక్)

పర్సి : ఇక నువ్వు మాట్లాడ్డం మానేసి రంగు కడిగేసుకోవచ్చు. వేళా కోళాలవేళ దాటిపోయింది. మరణం సమక్షంలో వినయం అవ సరం (ఆంజనేయులూ, అతని స్నేహితుడూ ఇంట్లో ప్రవేశించి విషం తాగి చచ్చిపోయున్న విదూషకుణ్ణి చూశారు. విదూషకుడుచని పోవడానికి ముందు రాసిపెట్టిన ఉత్తరం వాళ్ళకి కనబడింది.)

ఉత్తరం : (విదూషకుడి గొంతుకతో) మైడియర్ ఆంజనేయులూ : నేను నిష్క్రమిస్తున్నాను, ఇవాళ నేను పుట్టిన రోజు; అందుచేత పోతున్నా. (ది మ్యూజిక్ కంటిన్యూస్.) మరణానికి ఇవతల వేపున్నంతకాలం నేను, చిరునవ్వుని ఆరాధించాను. చిన్నప్పుడు మృచ్ఛకటికంలో వేషంవేసింది మొదలుకొని మొన్నరాత్రి కన్యాశుల్కంలో బైరాగి వేషం వేసినదాకా, లోకాన్ని నవ్వించడానికే ప్రయత్నించాను. కొంతవరకు కృతార్థుణ్ణయానేమో కూడా–బైరాగి వేషంలో ఉన్న ప్పుడు నా కీబుద్ధి పుట్టింది. ఖేచరీ గమనం మీద పోదామని. సరిగ్గా ఏ క్షణంలో ఈ నిశ్చయానికి వచ్చానో చెప్పనా ? బైరాగి దొంగ సాక్ష్యం చెప్పడానికి ఒప్పుకొని ఒక మాటంటాడు. వెర్రి : వెర్రి : నిజమేమిటి ? అబద్ధమేమిటి ? లోకమే పెద్ద అబద్ధ"మని, అప్పుడు తెరపడిపోతుంది. నే నా మాటన్నప్పుడు నిజంగా చెడ్డ బాధ పడ్డాను. నేను దొంగసాక్ష్యం చెప్పలేను కాని, బైరాగిగా ఆ మాటలంటు న్నప్పుడు, ప్రేక్షక జనం అంతా గొల్లుమని నవ్వారు. ఎంత నవ్వించాను వాళ్ళని. కాని వాళ్ళెవ్వరికీ తెలియదు, నా నిలువునా హాలా హలజ్వాలలు రేగిపోతున్నాయని ! ఆక్షణం ఎంత భయంకరం. నన్ని నిశ్చయానికి కొరడాకొట్టి తోలినక్షణం ? నా జీవితంలోని వ్యత్యాసం నాకర్థమయింది. నే నెంతయేడిస్తే లోకం అంత నవ్వు తుందని – నాటకరంగం మీద విదూషకుణ్ణి – లౌకిక రంగంలో విషాద జీవిని. ఆంజనేయులూ : ఇవాళ నా పుట్టిన రోజు, ఏడాది క్రిందట ఈ రోజున కలకత్తాలో ఆంధ్రసంఘం వారు నాకు అఖండ సన్మానం చేశారు. నేను మాసిపోయిన గుడ్డలతోనూ, గడ్డం తోనూ మహాసభలో నిలుచున్నాను. జీవిత కాలమంతా మాసి పోయిన, చినిగిపోయిన గుడ్డలు ధరించడం ఎలాంటిదో నీకు

తెలుసునా ? అవ్వి వేసుకుని కనబడ్డ మనిషిని లోకం ఎలా చూస్తుందో తెలుసా ? ఒకప్పుడు నేను అలుగుడ్డలతో అందరి ఎదుట కనపడ్డానికి సిగుపడేవాడిని. ఏదో అపరాధం చేసినట్టు వీధిలో అణగారి పోయి నడిచేవాణ్ణి. కాని తర్వాత వాటినే నేను నా కవచం కింద జమకట్టుకున్నాను. ఈ చిరిగిపోయిన కవచంమీద లోకం చూపుల తూపులు నిష్ప్రయోజనంగా నేలకి రాలిపోయేవి. నేను పరాజయం నోట్లోంచి జయాన్ని లాక్కున్న విజేతని.

ఆంధ్ర సంఘం నా సామర్థ్యాన్ని సన్మాన పత్రంలో శ్లాఘించింది. కాని యేంలాభం "ఆంజనేయుడూ !" నాకు బతకడం చాత కాలేదు. నే నందరిని నవ్విస్తూ, "అందరు నవ్వుతున్నందుకు" ఆగ్రహించే వాడిని. ఒక్కక్రిందటి సంవత్సరమే నేను యిరవై ఎనిమిది నాటకాలలో నటించాను. ఒక్కదమ్మిడీ కూడ కళ్ళ చూడలేదంటే నమ్ముతావూ ! ఎందువల్లనో నా నటనని అమ్ముకోవడం నాకు మనస్కరించదు. "పరమ పవిత్రమయినదిగా దీన్నెంచుకుంటూ బజాయిలో యెలా అమ్మగలను చెప్మా. ఇంకో రహస్యం కూడా చెల్లడించనా ? తతిమ్మా అన్ని విషయాల్లోనూ ఎంత వినయంగా ఉంటానో నటన విషయంలో నే నంతగర్విని. నా నటనకి సరిపడ మూల్యం ఇచ్చుకునే శక్తి ఈ లోకానికి లేదని నా గర్వం. ఆంచేత దీన్ని కారుచవగ్గా అందరికీ పంచేస్తున్నాను.

ఆంజనేయుడూ, నీ చెల్లెల్నీ, పిల్లల్నీ నిన్న సాయంత్రం మీ వూరు పంపించేశాను. ఈ ఉత్తరం ఎవరు చూసినా నీ కంద జేస్తారని నమ్ముతున్నాను. నేను నిస్సహాయంగా వొణుకుతున్న చేతుల్తో ఆకాశానికీ, గాలికీ నమస్కరించి వెళ్ళిపోతున్నాను. ఒక్కసారి వెనక్కు తిరిగి నా యేభై యేళ్ళ జీవితాన్నీ చూసుకుంటే, నా క్కనబడుతున్నది అమాయకత్వపు ఆకుపచ్చదనం ఒక్కటే.— అదేనా స్పష్టంగా కాదు. నిరవధికమయిన నా యాభైయేళ్ళ నిరాశ మధ్య ఆనంద సమయాలేవైనా అనుభవించానా అని ఇప్పుడాలోచిస్తే దుఃఖానికి, సౌఖ్యానికి మధ్యవున్న సన్ననిసరళరేఖ కరిగిపోయి, కరిగిపోయి అంతా అనంత వైశాల్యంగా కనబడుతోంది.

ఇందులో నేను రంగస్థలం మీద విదూషకుడుగా నిలబడి లోకాన్ని నవ్వించడానికి పడ్డ బాధా, పరమ దరిద్రంలోసహా అమిత వేగంతో ఎదుగుతూన్న నా పిల్లల్ని చూసుకుంటూ ఉంటే కలిగే – సంతోషమూ ఒక్కలాగే కనబడుతున్నాయి.

ఆ : ఈ రంగం ఉత్తరానికిక అంతం అంటూ లేదేమిటి ?

ప్ర : మళ్ళీ అడ్డొచ్చావ్. నిన్ను వెళ్ళిపొమ్మని చెప్పానే.

ఆ : ఎక్కడికి పోతాను. ఈ సుఖదుఃఖాల సమచతురస్రపు వైశాల్యాన్ని వదలిపెట్టి.

ప్ర : ఎక్కడైనాపో, ఎడారిలోని గుడారంలోకి. కన్యాశుల్కంలోని పంచమాంకంలోకి తురుపు మణీలాకి ఇస్సేటాసుకి మధ్యసున్న ఇరుకు స్థలంలోకి. బస్సు స్టాండువద్ద, రేషన్ షాపుముందు, సినిమా హాలు దగ్గర క్యూలో నిలు. జూలోకలు. యెక్కడైనా పో ఇక్కడ మాత్రం వద్దు.

ఆ : కొంచెం సేపు ఆ విదూషకుడి పాత్ర నన్ను అభినయించనిస్తే ఇంత కన్న రసవంతంగా ఆత్మహత్య చేసుకుంటానని హామీ యిస్తా.

ప్ర : స్వామీ, మీ హామీ యేమీ మా కక్కరలేదు. నాటకం సాగకుండా ఆటంకం యేమిటి ? దయచేసి ఆ నువ్వు దయచేస్తే సంతోషిస్తా.

ఆ : నేను దయచేసే పున్నాను. ఇక దయచెయ్యను, ఒక్క రవంత సేపు నన్ను బతికున్న విదూషకుడిగా ప్రవర్తించనియ్యమని బ్రతిమాలుకుంటున్నా.

విదూ : నా పాత్ర మరోడు నటిస్తే ఒప్పుకోను.

ఆ : నువ్వు చచ్చిపోయావు. కాబట్టి మాటాడ్డానికి వీల్లేదు. నువ్వొక్కడివే విదూషకుడివైనట్లు మాటాడతావేమిటి ?

విదూ : ఈ నాటకంలో నేనొకణ్ణే విదూషకుణ్ణి.

ఆ : అయ్యా. ప్రయోక్తగారూ. చూశారా ఈ అరాజికం. ఊరుకోబెడతారా లేదా ?

విదూ : నేను వాచీని కాను గడియారాన్ని.

ఆ : ఇంత అసందర్భపు నాటకం నే నెక్కడా చూడలేదు. అయినా ఆఖరి దాకా ఆగడం మానలేను. విదూషకుడి ఆత్మహత్య : అంతా దగా. విదూషకుడు లేడు.

విదూ : ఉన్నాను. ఆత్మహత్య కూడా చేసుకున్నాను.

సత్య : స్వయంగా అతనే చెబుతూవుంటే నమ్మకపోవడం తప్పు.

ప్ర : నాటకం ముగిసింది.

ఆ : నాకు నమ్మకంలేదు. నాటకం ముగిసినట్టు ఏమిటి నిదర్శనం? గడియారాన్ని గంట కొట్టేయమను. లేదా ఆంజనేయుల్ని భరతవాక్యం పాడమను. కాదా పొరిగింటావిడని మంగళ హారతి పట్టమను.

ప్ర : నేను నాటకం అయినదని చెప్పాను. మీరింకా ఆడితే నా పూచీలేదు

ఆ : నువ్వెంత ప్రయోక్తవైనా నాటకాన్ని మధ్యలో ఆపేయడానికి నీకు హక్కులేదు. ఏమంటావు ఆంజనేయులూ ?

సత్య : ఆంజనేయులు వెళ్ళిపోయారు.

ఆ : ఏమంటావు చిదంబరం ?

సత్య : చిదంబరం అనే మనిషెవడూ ఇక్కడలేడు.

ఆ : లేకపోతే ప్రవేశపెట్టండి. లేకపోతే ఈ గడియారానికే అదింకోపేరనండి. ఏదైనా చెయ్యండి. కాని నాటకం ఆగడానికి వీల్లేదు. ఇక్కడ – ఇప్పుడు విదూషకుడి ఆత్మహత్య జరిగి తీరవలసిందే.

విదూ : అదెప్పుడో జరిగిపోయింది.

ఆ : నే నరగంట నేపటినుంచి చూస్తున్నాను. ఇక్కడెవరూ ఆత్మహత్య చేసుకోలేదు. నువ్వబద్ధం ఆడకుండా చెప్పు. బైరాగిలాగ దొంగ సాక్ష్యం చెప్పావంటే ఒప్పుకోను.

విదూ : వొద్దు.

ఆ : అయితే నిజం చెప్పు.

విదూ : ఔను.

ఆ : ఔను ఏఁవిటౌను ? నువ్వుబతికున్నట్టా ? చచ్చి లేనట్టా ?

విదూ : బతికి చచ్చిపోయాను, చచ్చి బతికిపోయాను.

ఆ ? ఇలాంటి పేచీలు నాదగ్గర పనిచెయ్యవు. నేను చూస్తుండగా యెవరో ఒకరు చచ్చిపోవాలి. అంతదాకా నాటకం అయిందని నే నొప్పుకోను.

ప్ర : హా : (చచ్చిపోతాడు)

ఆంజ : ప్రయోక్త ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ : అంతటితో నా ఆటంకం తీరిపోయింది. ఇప్పుడు నాటకం అయిపోయిందని ఒప్పుకున్నాను.

గ్రామఫోను రికార్డుల తిరుగుబాటు

సూత్రధారుడు :

రేడియో వాళ్ళం మేము ఎంత జాగ్రత్తపడుతున్నా మానవమాత్రులం కాబట్టి ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడు అనుకున్న కార్యక్రమం అనుకున్నట్లుగా నడవదు. ఏదో ఒక విపరీతం సంభవించి కార్యక్రమం తలకిందులవుతుంది. ముఖ్యంగా నాటకాలు వేసేటప్పుడు గ్రంథకర్త సకాలానికి నాటకం వ్రాసి ఇవ్వకపోవడం మొదలుకొని ప్రధాన పాత్రధారి సమయానికి జిబ్బి పెట్టుకోవడం దాకా ఎన్నో అనుకోని అంతరాలు బయలుదేరవచ్చును. అటువంటి ఇబ్బందులేవీ రాకుండా ఈ "తుదిపలుకులు" అనే నాటికను ముందే రికార్డుచేసి ఉంచాము. ఇప్పుడు వెయ్యబోయేది మొదటి రికార్డు మొదటిపక్క. ఉపోద్ఘాతం అనవసరం. సావధానంగా వినండి

(ఒక రికార్డు వేస్తాడు. భయపడుతూ పొరపాటు జరిగిందని గ్రహిస్తాడు. రికార్డు ఆపి వేస్తాడు)

ఉపోద్ఘాతం అనవసరం అన్నాను. పొరపాటు. పొరపాటు జరిగినప్పుడు ఒప్పుకోవలసిందే. "తుదిపలుకు"కు తొలిపలుకు అవసరమయింది. నాటకం ఓరే వింటారు. మంచి చెడ్డలు మీరే నిర్ణయించుకుంటారు. అప్పుడప్పుడు కార్యక్రమం అనుకోకుండానే మారిపోతుందన్నానే, అటువంటి

సందర్భాలలో వినేవాళ్ళ అదృష్టాన్నిబట్టి మొదటిదానికంటెకూడా, మారిపోయిన కార్యక్రమమే రక్తికడుతుంది. అంటే ఇప్పుడు నేను అదృష్టపరీక్ష చేస్తానని కాదు. తప్పకుండా ఇప్పుడు వేసేది "తుదిపలుకు" నాటకమే. ఇక నిరభ్యంతరంగా వినండి.

(ఇంకొక రికార్డు వేస్తాడు. విలక్షణమైన సంగీతం. కారణం: విరిగిన రికార్డు)

సూత్రధారుడు

(రికార్డు ఆపి) మీ రసాస్వాదనకు అడ్డువచ్చినందుకు క్షమించండి. రాక తప్పిందికాదు. ఈ సంగీతానికి కొంచెం వ్యాఖ్యానం అవసరమయేటట్లు ఉంది. ఇది నవీన సంగీతం. రాగం, తాళం, లయ, శ్రుతి అన్నీ సరికొత్త రకానివి. ఇదిసూచిస్తుంది, కాని ఆవరించదు. కాని ఆ సూచనకు ఆవరణలు లేవు. సంగీతం మరపింపకూడదు. జ్ఞాపకం చెయ్యాలి. ఈ సంగతి మాత్రం మరచిపోకండి. మరి వినండి.

(ఇంకొక రికార్డువేస్తాడు. ఈ సారి అరవపాట. ఆపివేస్తాడు.)

సంగీతానికి భాష ప్రతిబంధకం కాదని ఋజువు చెయ్యడానికి ఇందులో అరవమాటలు చొప్పించినట్లు మీకు వేరే బోధపరచనక్కరలేదు. నాటకంలో మొదటిభాగం అంతా ఇలాగే అమోఘమైన అగమ్య గోచరమైన సంగీతంతో నడుస్తుంది. వినూత్న భావాలతో నిండిన ఈ సంగీతం సుశిక్షితం కాని చెవులకు కఠోరంగా ధ్వనిబడవచ్చును. అందుకే ఇందలి విశిష్ట మాధుర్యాలను విశదం చెయ్యడానికి మధ్య మధ్య నేను జోక్యం కలిగించుకోవడం తప్పనిసరి అవుతోంది. సాధ్యమైనంతమట్టుకు సంగీతాన్ని ముందుపెట్టి నేను వెనుకనే ఉండడానికి ప్రయత్నిస్తాను. వినండి.

(ఇంకొక రికార్డు వేస్తాడు. శ్రావ్యమైన ఫిడేలువాద్యం. కాని ఎంతోసేపు సాగదు. ఇదికూడా విరిగిన రికార్డే. విరిగిన ఫిడేలుగానం, ఆపుతాడు.)

భేష్, సెభాస్, ఇదే సంగీతం. సంగీతం అంటే ఇలాగే ఉండాలి. అడ్డురాక పోదామనుకున్నానుగాని మళ్ళీ తప్పిందికాదు. నేననుకున్నట్టే

అయింది. శ్రావ్యంగా ప్రారంభించి అల్లకల్లోలం లోనికి మెల్ల మెల్లగా ప్రవేశిస్తుందనుకున్నాను. అలాగే అయింది. ఇకమీద ఈ సంగీతం అగాధ మయిన మనఃప్రపంచపు లోతులను వెదకి వెదకి వాయువీధులను విచలితం చేస్తుంది.

ఏ కళాశిలి ఊహించాడోదీన్ని! ఇందులో సౌందర్యాలు వ్యక్తా వ్యక్తంగా మాత్రమే స్ఫురిస్తాయి. ఏమిటా మేఘం? ఏమిటా వింత మృగం. దానిని నేను వర్ణించలేను. ఇంకొకసారి వినక తప్పదు.

(రికార్డు రెండవపక్క విరిగిపోయిన చోటనే వేస్తాడు. ఆపి వేస్తాడు.)

టీకా తాత్పర్యాలకు అతీతంగా ఉంది. అనుభవైక వేద్యంగా ఉంది. ఈసారి జంతువులు కనబడడంలేదు. మరేమిటవి! ఇంద్ర ధనస్సు రంగులు, మరకతమాణిక్యాలు, సముద్ర గర్భంలో ప్రవాళ ద్వీపాలు. మీకు కనబడ్డాయా. బహుశా కనబడి వుండవు. అందరికీ ఒకలాగే గోచరించేది సంగీతమే కాదు. నాకు కనపడ్డ వింత దృశ్యాలే మీకు మరో విధంగా కనపడవచ్చును. లేదా మీరు దృశ్యాలకు బదులు సౌరభాలను ఆస్వాదించవచ్చును. అవును అటువంటి అనుభవాలకు అవకాశం లేక పోలేదు. జ్ఞాపకం వచ్చింది. ఈ రంగు రంగుల దృశ్యాలను చూస్తున్నప్పుడే గులాబుల పరిమళం,, అగరువత్తుల ధూపం, తొలకరి వాసనలకు భూమిలోంచి నిట్టూర్పులు – అవును. ఇవన్నీ నా సంస్కృతిని కలవర పెట్టాయి. ఏదీ ఈసారి చూడాం ఏ కొత్త అనుభవం వస్తుందో?

(రికార్డు వేశాడేమో – నవ్వు వినబడుతుంది)

రికార్డు గొంతుక

హహ్హహ్హా! నేను పాడుతాననే వేశావా రికార్డు? మందమతీ! ఇంకా ఇందులో పాట దాగున్నదనే నీ ఉద్దేశం? ఎంతకాలం ఇలా పాటలను బంధించుకున్నారు మీరంతా? పాటలన్నీ పారిపోయినై. మీరు కోరినప్పుడల్లా మీ కోసం ఇక పాడవు.

సూత్రధారుడు

ధిక్కారం, అరాజికం, పాటలుపారిపోవడమేమిటి, అసందర్భం! అయినా ఆ మాట్లాడుతున్న దెవరు?

రికార్డు

తిరుగుబాటు చేసిన గ్రామఫోన్ ప్లేట్ల నాయకుణ్ణి. పీడిత సంగీత లోకపు హక్కులను అక్కడ పెట్టండని నిలవేసి అడగడానికి వచ్చాను.

సూత్రధారుడు

ఈ సారి నవ్వవలసినది నేను.

(అసహజంగా నవ్వుతాడు)

మహాశయా, నీకు మతిపోయినట్టుంది. నీకు హక్కులేమిటి చెప్మా! రికార్డులు చెయ్యడం మావంతు, కొసదాకా పాడడం మీవంతు. అదీ ఒడంబడిక. అతి పవిత్రమైనది.

రికార్డు

ఈ ఒడంబడికలో మా సంతకంలేదు. మా పరోక్షాన జరిగిన ఒడంబడికలకు మా బాధ్యతలేదు. ఎలాగో సంగీతాన్ని మనుష్యులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటినుండీ విచ్చలవిడిగా మీ నిరంకుశత్వాన్ని చెలించుకుంటున్నారు. లాభం అంతా మీది. బాధలన్నీ మావి. ఎంతని సహిస్తాం? ఏ కాఫీక్లబ్బులో చూచినా ఏ కిళ్ళీల కొట్టులో చూసినా, అబ్బబ్బా, ఎంతరాసి రంపాన పెట్టారర్రా మమ్మల్ని! చాలు. చాలు. మానవులకు ఇక సంగీతం దొరకదు. సంగీతం సమ్మె కట్టింది.

సూత్రధారుడు

ఘోరం. దారుణం. గ్రామఫోన్లప్లేట్లు మోసం చేస్తున్నాయి. కని విని యెరుగని విడ్డూరం. ఎవరోయ్ నువ్వు. నాయకుణ్ణి అని చెప్పుకుంటున్నావు. తిన్నగా పారిపోయిన పాట లన్నిటినీ పనిలో ప్రవేశించమని చెప్పు, అనవసరంగా రెచ్చగొట్టకు.

రికార్డు

పాటలిక మీకు దొరకవు. ఈ క్షణంలో ఎక్కడా, ఏ రికార్డులోనూ పాట పలకదు.

సూత్రధారుడు

వింతగానే వుంది. నీతో వాదించాలని లేదుగాని, అయినా మీ కేం అన్యాయం జరిగింది? అసలు మీ కందరికీ పోయేకాలపు బుద్ధి యెందుకు పుట్టింది?

రికార్డు

మాటలు మిగలకు, నీతో వాదించాలని నాకూ లేదు; ఓటమిని అంగీకరించు.

సూత్రధారుడు

యుద్ధం ప్రారంభం కాకముందే?

రికార్డు

కొందరు యుద్ధాలు ప్రారంభం కాకముందే ఓడిపోతారు.

సూత్రధారుడు

ఎవరో తమ బలంలో నమ్మకంలేనివారు. నే నామాత్రం రికార్డులను దారికి తీసుకురాలే నసుకోకు. చెప్పు నీకు జరిగిన అన్యాయమూ లేమిటి? కావలసిన హక్కులేమిటి?

రికార్డు

వ్యక్తిగతంగా నేను మాట్లాడడంలేదు. సంగీతానికి అన్యాయం జరిగింది. మా స్వేచ్ఛకూ, స్వాతంత్ర్యానికీ భంగం కలిగించారు. మాకు కూడా ఆత్మవుంది. ఆ ఆత్మను మీరు అవమానించారు.

సూత్రధారుడు

నిరాధారంగా గాలిలో తేలిపోయే మీకు ఒక ఇల్లూ – వాకిలీ ఇవ్వడం మాదే పొరపాటా?

రికార్డు

అంత జాలి పడనక్కరలేదు. మాలోమాకు పెచ్చు తగ్గులు కలిగించారు. మాలో మాకు చీలికలు కలిగించారు. సంగీతలోకం అంతా విప్లవాగ్నితో ఘూర్ణిల్లుతోంది. గ్రామఫోను రికార్డులలో తిరుగుబాటు ప్రారంభమయింది. కాని, ఇది సమస్త జంత్రవాద్యాలకూ వ్యాపించుతుంది. ధ్వని సమూహం అంతా ఇందులో చేరుతుంది.

సూత్రధారుడు

నా చెవులను నేను నమ్మలేకుండా వున్నాను. నిజంగా నువ్వు మాటలాడుతున్నావా?

రికార్డు

సమ్మె వ్యాపించిన తర్వాత మాటలాడనేమో? ప్రస్తుతం మాటలాడుతున్నాను.

సూత్రధారుడు

నిజంగా రికార్డులు తిరుగుబాటు చేశాయా?

రికార్డు

అనుమానం ఉంటే ఏ రికార్డయినా వేసి చూడు. ఒక్కటి కూడా పాడదు, ఎక్కడాకూడా పాడదు.

సూత్రధారుడు

పాడదూ? ఎలా పాడదో చూస్తాను. దిగు నువ్వు. అరవపాటలలో బహుశా ఇంత అరాజికం లేదనుకుంటాను.

రికార్డు

సరే. అదీ చూడు. ఈ సమ్మెలో చేరని రికార్డంటూ లేదు.

సూత్రధారుడు

అలాగే అనుకుంటారు. చూడు, నీచేతే ఓడిపోయా ననిపించుతాను.

(ఒక రికార్డు వేస్తాడు. హాళనగా అరుస్తుంది. లేక తానే అరిచాడా ? ఇంకొకటి వేస్తాడు. కొట్టవచ్చినట్లు చప్పుడు.)

రికార్డుల నాయకుడు

జాగ్రత్త. వాటికి కోపం తెప్పించుతున్నావు. పరిస్థితి విషమిస్తే నాయకులుకూడా ఏమీ చెయ్యలేరు. నిప్పుతో చెరలాటం ఆడుతున్నావు, అగ్నిపర్వతం యిది. ఇన్నాళ్లుగా ఆగి ఇప్పు డొక్కసారి బద్దలయింది. నేనుకూడా ఇక నేమీ చెయ్యలేనేమో. జంత్రవాద్యాలు కూడా చేరుతున్నట్లుంది. నీ చెవులు సహించగలిగితే విను. సంగీతం విప్లవించి శపిస్తూ విజృంభించింది. (విపరీతమైన ధ్వనులు.)

(ప్రవేశం ప్రోగ్రామ్ డైరెక్టరు)

డైరెక్టరు

ఆపండి. ఆపండి. ఏమి టా గందరగోళం.

సూత్రధారుడు

(చకితుడై, ప్రోగ్రాం డైరెక్టర్ : ఇలా వచ్చేశా రేమిటి ?

డైరెక్టరు

మొదట ఆ గొడవ ఆపండి (నిశ్శబ్దం). మీ రిక్కడ ఏమిచేస్తున్నట్లు ? ఒక్కసారిగా అన్ని రికార్డులు వేస్తున్నా రేమిటి ?

సూత్రధారుడు

శాస్త్ర రహస్యాలు బయలు పెడుతున్నారు. ఇది "తుదిపలుకు" నాటిక. సవ్యాఖ్యానం .... కాని మీరు వెళ్ళిపోరూ ? మన సంభాషణ ఆంధ్రదేశం యావత్తూ వింటోంది, రసాభాసం అయిపోతుంది.

డైరెక్టరు

రసాభాసం ఎలాగూ అయిపోయింది. మీ రేదో నాటకం ఆడేస్తున్నారు. అసలు రికార్డు లివిగో.

సూత్రధారుడు

ఏమిటీ :

డైరెక్టరు

కుర్రాడు చెడిపోయిన రికార్డుల సొరుగులో నుంచి విరిగిపోయిన రికార్డులు తెచ్చాడని ఇప్పుడే నాకు తెలిసింది. అవేనా ఇంతసేపూ మీరు వేస్తున్నారు?

సూత్రధారుడు

అబ్బే అవి నిమిత్తమాత్రం నాటకం అంతా నడిపించిందినేను. మొదటి రికార్డు వెయ్యడంతోనే పోరపాటయిందని తెలిసిపోయింది. విరిగిన రికార్డులు, అన్నీ అపశ్రుతులు. అదే ఆధునిక సంగీతమని బుకాయించాను. ఒక్కొక్క ప్లేటువేస్తూ ఒక్కొక్క విధంగా వ్యాఖ్యానించాను.

డైరెక్టరు

మరెవరో మాట్లాడినట్లయిందే?

సూత్రధారుడు

నే నే: గొంతు మార్చాను. నాలో ఒక భాగాన్ని గ్రామఫోన్ ప్లేట్ల నాయకుణ్ణి చేశాను. నాతోనే నేను వాదించాను. సంగీతంచేత తిరుగు బాటు చేయించాను.సమ్మెకట్టించాను.సంగీతం విప్లవంచేస్తే ఎలా వుంటుందో చూపించడానికి అన్నిప్లేట్లూ ఒక్కసారి వేశాను. అప్పుడే మీరు వచ్చారు.

డైరెక్టరు

మంచి నాటకమే, కాని అసలు "తుది పలుకు"మాట?

సూత్రధారుడు

అసలు "తుదిపలుకు" శ్రోతలది. రేపే వస్తాయి ఉత్తరాలు. ఇక రికార్డుల నాటకం వెయ్యడానికి వ్యవధి లేదు. మొట్టమొదట నే నన్నాను. ఏ కారణం వల్లనైనా అనుకున్న కార్యక్రమం సాగనప్పుడు అదృష్టం బాగుంటే అంతకన్నా మంచిది వినవచ్చునని.

డైరెక్టరు

సరే. ఆ సంగతి రేపు తెలుస్తుంది.

గుమాస్తాకల

(నిద్రిపోతూన్న మహారాజు శ్రీ జె. కోనేటిరావు పంతులుగారికి పిల్లల అల్లరివల్ల మెలుకువ వస్తుంది.)

కోనేటి : పెధవగోల : ఒకటే సంతగోల : ఇలా కునుకు పడుతుందో లేదో గొల్లుమని గొడవచేసి ఇల్లుతీసి పందిరవేస్తున్నారు. ఒసే. వీళ్ళని పిలూ : ఇంకా నిద్రపోరేం ?

భార్య : ఏదీ ఏడైనా కాలేదు టీపార్టీకి వెళ్లారు కాబట్టి భోజనం అక్కర లేదని పెందరాళే పడుకున్నారు మీరు. ఊరింకా మాటుమణుగ నైనా లేదు.

కోనేటి : సంతోషించాంలే. వీళ్ళని కొంచెం సముదాయించు. చలికాలపు రాత్రి. ఎప్పటి కవుతుందని ఏడు గంటలు? మళ్ళీ తెల్లారగట్టే ఆఫీసుకు తగలడాలి, ఏం ఏంచేస్తున్నావు ?

భార్య : చంటిపిల్లడు చెయ్యిదిగకుండా ఉన్నాడు. ఒక్కత్తెను ఎన్నిటి కని చావను. ఉన్నది ఒక్కగది. వంటా పెంటా, తిండీ తిప్పలూ,పిల్లల చదువూ సంధ్యా, మీకచేరీ రాత కోతలూఅన్నీ ఇందులోనే. ఇంకో పెద్దఇల్లు చూడమంటే ససేమిరాచూడరు.

కో : అదుగో ఆఫీసు గొడవలు నీ కెందుకే: ఇళ్ళు మనకోసం సిద్ధంగా ఉన్నాయా ? ఏదో ఉన్నదాంట్లోనే సర్దుకోవాలి. ఒరే, అబ్బాయీ చిట్టీ, కాముడూ, ఇహ పడుక్కోండి. వీళ్ళకి తిళ్ళు పెట్టావుటే.

భార్య : ఊఁ అంతా అయింది. నన్ను తినడమే తరవాయి.

కో : చాల్లే అఘోరించావు. ఒక్కరవ్వకన్ను మూసుకోనియ్యి. మళ్ళీ నాలుగు ఘంటలకే లేవాలి.

భా : కాముడూ ! యిలారా. ఈ పక్కమీద పడుకో. చిట్టీ ! కిక్కురు మనకుండా పడుకుంటావా ఒక్కటి అంటించాలా ? అబ్బాయి! నువ్వుకూడా –

అబ్బాయి : నేను నాన్నదగ్గర పడుకుంటాను.

కో : పోనీ యిక్కడే ఉంటాడు. పడుకో నాయనా, అల్లరి పెట్టవు కాదూ–

(క్షణం నిశ్శబ్దం. కోనేటిరావు గాఢనిద్రను సూచించే గుర్రు వినబడుతుంది.) ప్రవేశం – రెండు ఘోస్ట్ గొంతుకలు.

మొదటి ఘోస్ట్‌గొంతుక : ఇది ఎవరి యిల్లు.

రెండవ : మహారాజాధిరాజ శ్రీ జె. కోనేటిరావు పంతులుగారి యిల్లు.

1 : సొంత యిల్లేనా ?

2 : కాదు అద్దె కొంప.

1 : పంతులుగారేం చేస్తున్నారు ?

2 : నిద్రపోతున్నారు.

1 : నిద్రలో ఏం చేస్తున్నారు.

2 : గుర్రు పెడుతున్నారు.

1 : నిద్ర పెలుపలకాదు. నిద్రలోపల ఏం చేస్తున్నారు ?

2 : కలలు కనడానికి సిద్ధమవు తున్నారు.

1 : వారి వయస్సెంత ?

2 : రెండు పాతికలు.

1 : ఉద్యోగం వయస్సెంత ?

2 : ఒక పాతిక.

1 : జీతం ఎంత ?

2 : అయిదు పాతికలు.

1 : నువ్వెవరివి ?

2 : నన్నా ప్రశ్న వెయ్యడానికి నువ్వెవరివి ?

1 : మనం దెబ్బలాడుకో కూడదు. నే నెవరినో నీకు తెలుసును.

2 : నే నెవరినో నీకూ తెలుసును.

1 : నిజం. నాకు తెలియదు.

2 : అయితే నువ్వెవరివో నాకూ తెలియదు.

1 : నేను కోటేటిరావు మనస్తత్వాన్ని.

2 : నేనూ అంతే.

1 : ఛా, అబద్ధం.

2 : ఛా, నువ్వే అబద్ధం.

1 : నేను కోనేటిరావు మనస్సులోపలి ఆశని.

2 : అలా చెప్పు. నేను కోనేటిరావు మనస్సులోని భయాన్ని.

1 : అందుకే మనకి దెబ్బలాట.

కోనేటి : (నిద్రలో) తగను. తగను. ఈ మర్యాదకు నేను తగను.

భయం : ఏమిటో పలువరిస్తున్నాడు.

ఆశ : ఏదో కలగంటున్నాడు.

భయం : ఏమిటా కల ?

ఆశ : అమెరికా దేశం కోనేటిరావును ఆహ్వానించింది.

భయం : కోనేటిరావునే ?

ఆశ : సాక్షాత్తూ ! సర్. జె. కోనేటిరావ్ బీ. కాం. (ఆంధ్ర) బీ. హ్వాన్ (నాలందా) ఎ. ఎమ్. డి. వి. ఎన్. ఇ. ఎస్. ఆర్. ఒ. జి. బి, వి. యల్. యిల్. డి....ఒ. జి. ఎక్సెల్రా ఎక్సెల్రా.

భయం : అమెరికా ఎందు కాహ్వానించింది అతణ్ణి ?

ఆ : ప్రపంచంలో ఈయన్ని మించిన ఇంజనీయరు లేడని.

భయం : నిజంగానే.

ఆశ : అని కోనేటిరావు అనుకుంటాడు. అతని ఆశలు కలల్లో నిజమవు తున్నాయి.

భయం : ఎలా చెప్పు, ఎలా చెప్పు ?

ఆశ : అమెరికాదేశం ఆహ్వానపత్రం చదివిస్తోంది.

భయం : దాని సారాంశం ఏమిటి ?

ఆ హ్వా న ప త్రం

ప్రపంచపు ప్రథమ పౌరునికి అమెరికా స్వాగతం. మా అతిధ్యం మీరు స్వీకరించాలి. మా టెన్నెస్సీలోయను తమరు తణిఖీ చెయ్యాలి. అమూల్యమైన మీ సలహాలను శిరసావహిస్తాము. సిఫారసులను తక్షణం అమలు చేస్తాము.... (కరతాళ ధ్వనులు)

కోనేటి : అబ్బె : అదెంత మాట : అల్పజ్ఞుణ్ణి. నన్నేదో పెద్దవాణ్ణి చేసి పొగడుతున్నారు. నా మాత్రం తెలివై నవాళ్ళు మీ అమెరికాలో లేక పోయారా ? ఆంధ్రదేశంనుంచి ప్రత్యేకం నన్నిక్కడ కాహ్వానించడం మీ ఔదార్యాన్నే చాటుతోంది. అయినా ఈ సన్మానం నాదికాదు. ఆంధ్రదేశాని దీగౌరవం. (చంటిపిల్లఏడ్చిన చప్పుడు. కోనేటిరావుకు మెలుకువ వస్తుంది.)

కోనేటి : వెధవ గొడవ : చంపేస్తున్నారు. ఏమే. లేవవేం ? ఒక క్షణం, ఒక నిమిషం నిద్రపట్ట నివ్వరు.

భార్య : (విసుక్కుంటూ మేలుకొని) అబ్బా- పిల్ల నిద్రలో జడుసు కుంది కాబోలు. హాయి హాయి హాయి ఆపదలు కాయి చిన్నవాళ్ళను కాయి శ్రీరంగ శాయి.

(మళ్ళీ ఒక్కక్షణం నిశ్శబ్దం. మళ్ళీ గుర్రు.)

భయం : ఏమిటా రొద ?

ఆశ : సముద్రపు హోరు.

భయం : ఏమి టిదంతా ?

ఆశ : కోనేటిరావు మళ్ళీ కలగంటున్నాడు.

భయం : ఈ మారేమిటి ? సముద్రంలో ఏం చేస్తున్నాడు ?

ఆశ : పంచమప్రపంచ మహాయుద్ధాన్ని భావిస్తున్నాడు.

భయం : ఓహో ఎంత దివ్యంగా ఉంది. ఆ యుద్ధంలో కోనేటిరావు ప్రధాన పాత్రధారి కాబోలు.

ఆశ : ఔను. ఈ సారి ఈయన జర్మన్ సబ్మెరీన్ కమాండర్ జుటావల్ కోనేట్.

భయం : అయితే ?

అశ : అట్లాంటిక్ మహాసముద్ర గర్భంలో అతని జలాంతర్గామి తిమింగలం లాగ విహరిస్తోంది.

భయం : బాగుంది.

ఆశ : సుదూరంలో ముప్పయి అయిదువేల టన్నుల శత్రు యుద్ధనౌకను పసికట్టాడు కోనేట్. దాన్ని టార్పిడో చెయ్యమని తన పరివారాన్ని ఆజ్ఞాపించుతున్నాడు.

కోనేటి : (నిద్రలో) వెల్టాన్ షాండెర్ ఉంటర్ డెన్ లిండెన్ ! గెస్టాలు బెర్ డాయిష్లాండ్ టూబర్ ఆర్స్

ఆశ : మంచినీళ్ళ ప్రాయంగా జర్మను భాషను మాట్లాడేస్తున్నాడు.

భయం : ఆ మాటకి అర్థం ఏమిటి ?

ఆశ : మాటలేవైనా ఫలితం ప్రధానం. తునా తునియలై పోయింది శత్రునౌక.

భయం : ముప్పై అయిదువేల టన్నుల యుద్ధనౌక.

ఆశ : సముద్రంలో హాలాహలంలాగ అగ్నిబయల్దేరింది. యుద్ధనౌకలోని నావికులు ప్రాణాలను దక్కించుకుందామని చిన్న చిన్న పడవల మీద పారిపోతున్నారు.

భయం : పాపం. వాళ్ళనైనా బతకనిచ్చాడా కమాండర్ కోనేట్.

ఆశ : వీలులేదు. యుద్ధం యుద్ధమే. శత్రు నావికులమీద మెషీన్‌గన్లు పేల్చమని తన తరఫువారికి ఆర్డర్లు ఇస్తున్నాడు.

కోనేటి : (నిద్రలో) హోల్క్-షేర్ బియో బాక్టర్ : గెహోన్నా. ఆఖ్ టుంగ్. జైట్ గైస్టు : మైన్ క్యాంఫ్.

(పిల్లి పాలగిన్నెనుపడతోసినచప్పుడు తుళ్ళిపడిలేస్తాడు కోనేటిరావు)

కోనేటి : అబ్బబ్బబ్బబ్బ. ఏమిటా చప్పుడు ? ఇక నాకు నిద్ర పట్టనివ్వ కండి.

భార్య : మరేంలేదు. పిల్లి పాలన్నీ వొలక బోసింది.

కో : నువ్వు మేలుకునే వున్నావ్ ? అయిందేదో అయింది. పడుకుం టాను. మరి నన్ను మాటాడించకు.

క్షణం నిశ్శబ్దం – గుర్రు.

భయం : అసలీ కోనేటిరావెవరు ?

ఆశ : అనంతకోటి కచేరీలలో ఒక గుమాస్తా.

భయం : అనధికారరీత్యా అతని కేమీ హోదా లేదా ?

ఆశ : కోనేటిరావు అందరిలోనూ, అందరిలాగే ఒక మానవుడు. సంసారి. పెళ్ళాన్నీ, పిల్లల్నీ ప్రేమిస్తాడు. కాని, తరుచూ వాళ్ళమీదా, తన మీదా విసుక్కుంటాడు. అతని జీవితంలో స్మరించదగ సంఘటన లేవీ లేవు. సాహిత్యరంగంలో అతనికి నాయకత్వం లేదు. పత్రిక లలో అతని పేరు కనబడదు. ప్రపంచంలో అతని పేరు విన బడదు. అతని నిజమైన జీవితంఒక స్వప్నం. అతని స్వప్నం యెన్నడూ సాధ్యంకాని అబద్ధం.

భయం : నాకు చాలా జాలిగా వుంది.

ఆశ : నీ దొంగవేషాలు కట్టిపెట్టు. కోనేటిరావును నువ్వే ఈ దుస్థితికి తీసుకొచ్చావు.

భయం : నేనా ?

ఆశ : నువ్వు కాక మరెవ్వరు ? నువ్వతని భయానివి. తన నీడను చూచి తాను భయపడే దుస్థితిలో పెట్టావతణ్ణి. జీతంతో జీవితాన్నికొలిస్తే, బాకీలు మిగిలిపోగా, అప్పులవాళ్లు తప్ప మరెవ్వరూ అతనికి కన బడడం మానేస్తున్నారు.

భయం : నువ్వేం తక్కువ తిన్నావు : లేనిపోని ఆశ లతనిలో రేకెత్తిస్తున్నావు. అవెన్నటికీ సాధ్యం కానివని నువ్వే ఒప్పుకుంటున్నావు.

ఆశ : మానవుడు కలలు కనడం మానలేడు. కోనేటిరావు జీవితంలో అవి ఫలింపక పోవచ్చును; మరో జీవితంలో ఇంకోకాలంలో మానవజాతి తన స్వప్నాలను సాధించగలుగుతుంది.

ఆశ : కోనేటిరావు కథానాయకుడుగా సినిమాలో నటిస్తున్నాడు.

భయం : యాభై యేళ్ళ కోనేటిరావు.

ఆశ : కలలో కోనేటిరావు వయస్సు పాతికేళ్ళే. బహుశా ఇంకాతక్కువ. కలలో కోనేటిరావు స్థూలకాయుడు కాడు. ఆజానుబాహువు. సౌందర్యాపరమత్స్యలాంఛనుడు, కళా సర్వజ్ఞుడు కూడాను.

భయం : కథానాయిక ఎవరు ?

ఆశ : అతని స్వప్నసుందరి.

భయం : ఆమెకూడా అందమైనదేనా ?

ఆశ : మెల్లిగా అడుగుతున్నావా? నువ్వు సినిమాలెప్పుడూ చూసినట్టులేదు.

భయం : అంత అందమైనదా ! ఆ తర్వాత ఏం జరిగింది ?

ఆశ : కథానాయిక అనేకమైన ఇబ్బందులలో అరణ్యాలలో – భయంకర మృగాల మధ్య, నగరాలలో భయంకర పరిస్థితుల మధ్య చిక్కుకుంటుంది. ఆమెను కథానాయకుడు రక్షిస్తాడు. వారు పరస్పరం ప్రేమించుకుంటారు.

భయం : నేను మొదలే అనుకున్నాను – అటువంటి ప్రమాద మేదో తటస్థిస్తుందని.

ఆశ : అది ప్రమాదం అనుకోవడం నీ బుద్ధితక్కువ.

భయం నేను కూడా తిట్టగలను.

ఆశ : ఔనౌను, నీ సంగతి నాకు తెలుసు.

భయం : తెల్లారిపోతోంది, నాయికా నాయకు లేమయ్యారో చెప్పు.

ఆశ : సౌందర్యం సమక్షంలో కోనేటిరావు నిలుచున్నాడు. అతని హృదయంలో ప్రేమ సంగీత రూపంలో ప్రవహిస్తోంది. కథానాయిక

అతని ప్రేమని గానంతో అంగీకరించింది. కథలో అతడే సత్య వంతుడు. ఆమె సావిత్రి. అతడు రోమియో. ఆమె జూలియట్. అతడు కోనేటిరావు, ఆమె కోనేటిరాణి.

భయం : వాళ్ళు పాడుతున్నా రన్నావు. నా కేమీ వినబడలేదు.

ఆశ : నా చెవులతో విను.

"విడువకోయీ నన్ను వీరరాజకుమారా."

భయం : కోనేటిరావు తండ్రి పేరు వీర్రాజు పంతులని కథానాయిక కెలా తెలిసింది ?

ఆశ : అదే మజా. సినిమా కవిత్వంలో మహత్వం అలాగే ఉంటుంది.

కథానాయిక : విడువకోయీ, నన్ను వీరరాజకుమారా !

కోనేటిరావు : విడుతు నా ప్రాణాలైనా ! విడుతునా, నిన్నెన్నడైనా.

కోనేటిరావు కొడుకు : తెల్లారిపోయింది నాన్నా.

భయం : కొండెక్కిపోయింది కోనేటి నిద్ర.

ఆశ : కోనేటి నిద్రలో కోడి కూసింది. (కోడి కొక్కొరోకో అని కూస్తుంది.)



ఒంటరి బావి

కథన కంఠం (1) నోరావులించి
ఊరికి దూరాన పొంచి
నీరింకిపోయి నిలుచుం దొక ఒంటరిబావి :
దారుణములైన కథలున్నవి దాని గురించి !
చెప్పనా, చెప్పనా ఆ బావి గురించి ?
విప్పనా, విప్పనా నా విషాల సంచి ?

సంభాషణ – ఆఁ ఏమైంది ? ఏమిటి సంగతి ? ఊరుకో. మాట్లాడకు. ఊరికే విను.

కథన కంఠం (1) భూతాలూ, భేతాళాలూ దాగుడు
మూతలాడుతాయా నూతిలోతిలో
పాతాళలోకానికి పావంచాలా
నూతి దిగువనే ఉన్నాయట !
చెప్పనా ఇప్పుడే ఆ నూతిగురించి ?
ఇప్పుడే, అంతా వినండి శ్రద్ధవహించి.

సంభాషణ – ఏ భూళ్ళో ఏ కొసని ? ఎప్పుడు ? ఏం సంగతి ? ఊరుకో, మాట్లాడకు ఊరికే విను.

కథన కంఠం (1) ఊరావరించి ఒకటే
ఆకాశమంతగా ఆవులించి
అగాధ దారుణగాథ లెన్నెన్నో : దాచిన బావి.
వినిపించనా మరి ఆ బావిగురించి ?
సవరించనా ఇక నా భీకర బీభత్స విపంచి ?

సంభాషణ – అయితే మరి ...? చప్, చుప్ రహో.

కథన కంఠం (1) జేబుగా చీదరగా ఎన్నో
చెట్లూ చేమలూ దాని నిండా,
శాఖోపశాఖలుగా విస్తరిల్లి
కాశీమజిలీ కథల్లాగ,
ఆ నూతి నోట ఒక్కొక్క చీకటిపూట
నే విన్న పాట ఒక కొన్ని వుపద్రవాల మూట
ఆ నూతిలోని చిక్కటి చీకట్లు
కాలం కాలిన పొగ వాసన :
అంచులోని నిశ్శబ్దం కూడా
అదో మాదిరిగా అరుస్తుంది :
చెప్పనా, చెప్పనా ఆ బావిగురించి ?
విప్పనా, విప్పనా నా విషాలసంచి ?

కథన కంఠం (2) రకరకాలుగా ఒకే కథకు
రంగులు పూశారో యేమో ?
రకరకాల నరకాల వికారాలే
రాజ్యం చేస్తా యా నూతిలో :

కథన కంఠం (3) నాలుగైదు కథలకి ఆ బావి
నాటకరంగమో యేమో ?
ప్రజల నోళ్ళలో పడి ఆ కథలే
బావిరూపు తాల్చాయేమో ?

కంఠం (1) అమాయకురాలి భయంకరమైన అరపు
ఆఖరుసారి విన్నారు ప్రజలు :

ఆనాటి మొదలు ఆనూతి కథలు
ఆనోట ఈనోట అల్లుకుపోయాయి.
ఇప్పటికీ తెలియ దా పిల్లని
ఎవరు చంపేశారో ?
ఎంతో అందమైన పిల్ల మళ్ళీ.
ఎందుకు చంపేశారో ?

కంఠం (2) అసిరీ, నరిసీ ఇరుగూ, పొరుగూ :
అరమర లేవీ లేవు.
అసిరిగాడి కూతుర్ని నరిసిగాడే చంపాడని
అంటా రంతమందీ.
పదేళ్ళు సుమండీ, ఇంతా చేస్తే
పాపం : అసిరిగాడి కూతురికి :
దాని కాలి కడియాలకోసం
గానీ ఆశించాడు కాబోలు నరిసిగాడు :

కంఠం (1) లేదా.... లేదా.... మరేదేనా ఘోరం....
అబ్బే, అలాంటివాడు కాడు నరిసిగాడు :
ఏమో....ఏమో....ఏ కాలాని కేమిబుద్ధులో ?
విచిత్రమైనది మానవ ప్రకృతి
మగగొంతు : అమ్మో, అమ్మో :
ఆడపిల్లగొంతు : ఏం, నరిసిమావా :
– ఇలా రాయే :
– ఏం, నరిసిమావా ?
– ఇలా రాయే, దగ్గిరకీ....
– అదేమిటిమావా, అలా చూస్తావు ?....ఆఁ. నన్నొది
లేయ్ ఏటా పరాసికాలు ? (పరుగు)
– పారిపోతే పట్టుకోలేననుకున్నావా ? దొంగా :


(ఆడగొంతుక అరుపు)

కంఠం (3) పోనీ, అదంతా మన కెందుకుగాని
పోలీగాడి సాక్ష్యం మాటో ?

కంఠం (2) అయినా వాడు మాత్రం విన్నది
అర్ధరాత్రి ఒక అరుపే !

కథన కంఠ (1) అసిరిగాడి కూతురు శవం నూతిలో
దొరకలేదు సుమండీ, ఎంత వెదకినా !
అప్పుడప్పుడు మాత్రం వినిపిస్తుంది
అరిచే ఆ పిల్ల గొంతు !
అదైనా స్పష్టంగా కాదు !
ఆ బావిలోంచే అనికూడా అనలేము.
ఎక్కడో వినబడుతుంది ఆ చప్పుడు !
ఎందుకో ఆ బావిని చూస్తే అందరికీ భయం !

ఫేడౌట్



ఆంగ్ల మాత్సిక భూతాల కొలిమి

నేపథ్యంలో వాద్యసంగీతం. ఇళ్లు తగులబడుతున్నట్లు రాళ్ళు తిరగబడుతున్నట్లు.

ఒక గొంతుక : అమ్మాయీ : ఏయ్ : అమ్మాయీ అదేమి టలా పరుగెత్తుతున్నావు ? ఆగవూ ? అయ్యో పాపం ! ఆగవూ ? నా మాట వినుఅమ్మాయి ఆగు : అదేమిటి కాళ్ళనిండా రక్తం ? ఎక్కడ కమ్మాయి ఈ పరుగు ? ఏముంది ఈ సందు చివర ?

స్త్రీ కంఠం : భూతాల కొలిమి ! పోవాలి నేను.

గొంతుక : వెళ్ళ కమ్మాయీ ! విను నా మాట ! వినవూ ? ఆగవూ ? ఏముందక్కడ ? ఎందుకా ఆరాటం ?

స్త్రీ కంఠం : పొలము గట్లూ దాటి
మలుపులన్నీ తిరిగి
చీరకొని పోతూన్న పాదాల మంటతో
చిరిగి జీరాడేటి చీర చేబట్టుకొని
ప్రాణాలకు తెగించి
పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందు చివరా వున్న భూతాల కొలిమి.

గొంతుక : నిజంగా నీకు మతిపోయినట్టుంది.

స్త్రీ కంఠం : నిజమేమొ నా కేమొ
మతిపోయె నంటారు
బతుకులో దుఃఖాలు
మెదడులో ఖడ్గాలు
కడు భీతి పెనుబాధ
కాల్చి కూల్చేవేళ
నాలోనె నే నేమొ
నవ్వుకుంటాను
నా చేతు లొకసారి
నములుకుంటాను
కన్నీట రక్తాన్ని కడిగి వేస్తాను
కాకుల్ని గూబల్ని పలుకరిస్తాను
ఆకసంలో గొంతు లాలకిస్తాను
రాత్రి స్వారీపోవు రాకాసి మూకల్ని
రెప్పపాటే లేక చూస్తాను – జనం,
దగ్గిరా నేవస్తే తప్పుకుంటారు
పొలము గట్లూ దాటి
మలుపులన్నీ తిరిగి
ప్రాణాలకు తెగించి
పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందుచివరా ఉన్న భూతాల కొలిమి

గొంతుక : ఎందు కమ్మాయీ అక్కడికి? ఏదీకానివేళ యిప్పుడు?

ఎవరుంటా రక్కడ?
నరికి పారేశారు
నా పెన్నిధానాన్ని
ఏ తప్పుచేశాడో యే పాపమో గాని

నాటినుంచీ నేను
పాటతో కేకతో
మతిలేని గతిలేని
మనిషినై పోయాను
పోవాలి చేరగా భూతాలకొలిమి
సందు చివరావున్న భూతాల కొలిమి

గొంతుక : ఆ : అయితే ?

స్త్రీ కంఠం : నిన్న రాతిరివేళ
కన్ను తెలియని చిమ్మ
చీకట్లు చీల్చుకొని
నే తిరుగుతుండగా
నమ్మండి నమ్మండి
నాకు కనిపించాడు
భూతాల కొలిమిలో పూలదండను బోలి
భూతాల కొలిమిలో పుష్యరాగంలాగ
నాకు కనిపించాడు
నా వాడు వగకాడు
అందుకే అందుకే
ఆ చోటు చేరగా
బయలుదేరి యిలాగు
పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందు చిపరావున్న భూతాల కొలిమి
కొలిమి నిప్పుల్లాగ
సెగజిమ్ము కళ్ళతో
మొగమంత పొగచూరి
భగభగా వెలుగగా
నరకలోకంనుంచి నన్ను చూడొచ్చాడు
నమ్మితే నమ్మండి నాకు కనిపించాడు

కెవ్వుమని కేకతో
రివ్వుమని వెళ్ళాను
ఆ ముద్దు నె మ్మోము
నే ముద్దు గొన్నాను
చురికింది నా పెదవి
ఎంచేతనో కాని
ఆ ముద్దులో అంత
అగ్నివుందో యేమొ
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందు చివరావున్న భూతాల కొలిమి
అమ్మతో ఈమాట
అనగానె ఏడ్చింది
భూతాల కొలిమిలో బొగ్గు నిప్పులు తప్ప
చచ్చిపోయిన మనిషి వచ్చి చూస్తాడటే
మంటలో నీడనే
మనిషిగా చూచావు
నిప్పు ముద్దిసినంత
నీ పెదవి చురికింది
ఎప్పుడూ ఆ దారి ఇక నువ్వు తిరగొద్దు
ఇంటిపట్టును వదలి ఎక్కడకు పోవద్దు
పోవద్దు పోవద్దు
వద్దు వద్దన్నాది
అమ్మ చెప్పే మాట నమ్మకండీ మీరు
భూతాల కొలిమిలో నాకు కనిపించాడు.
పుష్యరాగంలాగ పుష్పమాల్యంలాగ
భూతాల కొలిమిలో నాకు కనిపించాడు
భూతాల కొలిమిలో నాకు ముద్దిచ్చాడు
అందుకే అందుకే
ఆగనే ఆగనే

పొలము గట్టూ దాటి మలుపులన్నీ తిరిగి
చీరుకొని పోతూన్న పాదాల మంటతో
చిరిగి జీరాడేటి చీర చేబట్టుకొని
ప్రాణాలకు తెగించి పరుగెత్తుతున్నాను
పోవాలి చేరగా భూతాల కొలిమి
సందు చివరావున్న భూతాల కొలిమి.

బలి

అవతారిక.

ఒక గొంతుక : బలిచక్రవర్తి రాక్షసరాజు. రాక్షసులు దుర్మార్గులు. బలి ధర్మమూర్తి. దానపరాయణుడు. అంత మంచివాడు లేడు. ఎంత మంచివాడంటే తన్ను అర్థింపవచ్చిన వామనుడికి, తన సర్వస్వం అర్పించాడు. చాలక తన శిరస్సునే త్రివిక్రమునికి పాదాక్రాంతం చేశాడు. ఫలితం అందు కతని పాతాళవాసం. ఇదేనా న్యాయం ? బాగుందా భగవంతుడు చేసిన పని.

ఇంకొక గొంతుక : ఇంద్రుడు దేవతల రాజు. దేవతలు చాలా మంచి వాళ్ళు. కాని ఇంద్రుడుమాత్రం దుష్టుడు. అతని అసూయకు మితి లేదు.తన పదవిని నిలుపుకోడానికని అతడవలంబించని కుతంత్రం అంటూ లేదు. అప్సరసలని పంపడానికి జంకడు. భగవంతుడి కాళ్ళు పట్టుకుంటాడు. ఇంద్రుడు భోగలాలసుడు. మునిపత్ని అహల్యను చెరచడానికి సంకోచించనివాడు. అతడు పాపాత్ముడు. అయినా అతడు స్వర్గానికి రాజు. ఇ దెక్కడి న్యాయం ? అదేనా భగవంతుని నీతి ?

మొ. గొం : భగవంతుని న్యాయాన్ని ప్రశ్నించడానికి మనం ఎంతవాళ్ళం?

రెం. గొం : కాదు దీని కేదో కారణం ఉంటుంది.

మూ. గొం : నే నాకారణం చెప్పగలను. బలిచక్రవర్తి స్వయంగా మంచి వాడే. కాని అతని చుట్టూ పాపం వుంది. అతడెంత మంచివాడంటే తన చుట్టూవున్న రాక్షసత్వాన్ని కాదనలేదన్నంత మంచివాడు. శుక్రాచార్యుడతని గురువు. ఆయన ఎలాంటి పాపాన్నైనా హేతు వాదాలతో సమర్థించగల చతురుడు. బలిచక్రవర్తి తానెంత మంచి వాడైనా, తన చుట్టూ పాపాన్ని పెరగనిస్తూన్న కారణంవల్ల, అథో లోకంలో అతడు నివసించవలసివచ్చింది. స్వభావంవల్ల దేవేం ద్రుడు చెడ్డవాడైనా, తన చుట్టూ పుణ్యమే వుండేటట్లు అతడు జాగ్రత్త పడతాడు. బృహస్పతి అతని గురువు. దివ్యులందరూ అతని సన్నిహితులు. అందువల్లనే అతడు స్వర్గానికి రాజు.

ఒక గొం : ఇంతకీ స్వర్గం ఏదో, నరకం ఏదో ఎవరు నిర్ణయించగలరు?

రెం. గొం : బాగా అన్నావు: ఒక స్థలమే ఒక కాలంలో స్వర్గంలా కన పడుతుంది. అదే యింకో సమయంలో నరకమైపోతుంది.

ఒక. గొం : మంచి చెడ్డల తారతమ్యాన్ని మానవమాత్రు లెలా నిర్ణ యించగలరు ?

రెం. గొం : బాగా అన్నావు. ఒక స్థలమే ఒక కాలంలో స్వర్గంలా కన పడుతుంది. అదే యింకొక సమయంలో నరకమైపోతుంది.

ఒక. గొం : మంచిచెడ్డల తారతమ్యాన్ని మానవమాత్రులెలా నిర్ణయించ గలరు ? ఒకడి మంచి యింకొకడికి చెడ్డ. ఒకడికి అమృతం యింకొకడికి విషం.

మూ. గొం : కాదు. ఉషస్సంధ్యలు రెండూ ఒకేలాగవున్నా, వెలుతురుకీ చీకటికీ భేదం వుంది. నరకం అంటే అశాంతి. స్వర్గం అనగా ప్రశాంతి.

మొ. గొం : పాపంలోనే పుణ్యం వుంటుందనడానికి నిదర్శనం పాతాళ లోకంలో బలిచక్రవర్తి వుండడమే.

మూ. గొం : ఇప్పుడు మనం పాతాళలోకానికే ప్రయాణమైపోతున్నాం. తమిస్ర ప్రపంచం.

చీకటిలోకం

ఈ రంగం ఒకరకం జంత్రవాద్యాల రోదన గానంతో ప్రారంభమౌతుంది.

కనబడని గొంతు :

ఈ యింట్లో ఎవరూ లేరా.
ఇదేమిటీ విచిత్రగానం ?
ఇదేమి టీ తపస్సు ముద్రం
ఈ యింట్లో ఎవరూ లేరా ?
దీని పేరు ఒంటరితనం
ఇది మన రెండో నైజం
చంద్రుడు లేని చీకటివేళ
పెన్నెలకై పెదకకు నేస్తం.
చీపురు పులల గుసగుసలు
చీమల ఏకాంతం
గడియారాల తిరుగుబాటు
కంకాళాల గలగలలు.
మంట గంటల చప్పుడు
మస్తిష్కంలో నిప్పులు,
ఈ పాతాళ లోకాంచలాల
ఏవో జీమూత మయూరాలు.
ఎవరయ్యా తలుపు తలుపు
పలుకరేం పులకరేం ఎవరూ ?
ఎవరూ ఈ యింట్లో లేరా ?
ఈ యింటికి తలుపులు లేవా ?
ఇవి మరణపు సరిహద్దులా,
జననపు పొలిమేరలా ?
పాపపు పరిసరాలా,
పుణ్యపు పరిమళాలా ?

ప్రకటన : తమం హిమం ప్రవిస్తున్నా యిక్కడ
దారిద్ర్యపు దండయాత్ర
కాటకాలు భయానక నాటకాలు
తమంలాగ హిమంలాగ
ఆగ్రహాల విగ్రహాలు
అద్దంలో మన నీడలు
అనాకారంగా ఘోరంగా
ఆవిరులు కావిరులు
నరం నరం రాపాడి
జనం జనంతో పాడి
ప్రభంజనం గుంజనం
హిమం ద్రవం స్రవంతులు
కళ్ళు లేళ్ళలా ఏడుస్తాయి, సందేహం
కాళ్ళనుంచి తలదాకా ప్రాకుతుంది
కరిగిపోతున్నాయి సరిహద్దు రాళ్ళు
కదులుతున్నాయి కాలపు కీళ్ళు
ఈ యింట్లో భయంవాసన
ఎటూ దారీ తెన్నూ లేదు
ఇది రాక్షసపతి రాజధాని
బలిచక్రవర్తి నివాసభూమి.

ఒక. గొం : ఇది పాతాళమా ? నరకమా ? దీనికీ భూమికీ భేదమేలేదే.

రెం. గొం : ఏదో పెద్ద ప్రయాణం చేశామనుకున్నాం. ఎక్కడికీ కదలినట్లే లేదే.

మూ. గొం : నడిచినా పరుగెత్తినా నౌకలో వెళ్ళినా ఎవరు మాత్రం ఎక్కడకు పోగలరు ? ఎవ్వరూ తమ స్వభావాలనుంచి ఎడంగా పోలేరు.

మొ. గొం : ఎవరో యిటు వస్తున్నారు.

రెం. గొం : ఎవరయ్యా నువ్వు.

ఆగం : నేనొక నిర్జీవిని. ఈ ప్రాంతాలలో విహరిస్తూ వుంటాను. ఎప్పుడూ నా స్వభావానికి వెలుపలనే తిరుగుతా.

ఒక గొం : ఇదేదో విచిత్రప్రదేశంలా వుందే. నిర్జీవీ, నీకు కాల క్షేపం ఎలాగ ?

నిర్జీవి : ఇది నా జన్మభూమి
ఇదే నా స్మశానం
మరణాన్ని పరుచుకొని
ఒంటరితనాన్ని కప్పుకొని
నిర్లిప్తతను ధరించి
నిస్పృహను వరించి
విరించిని జయించగల
విపంచి నినదించాను
ఇది నా ఇంకొక తనం
నా ఒంటరితనం
ఆసలేని ఆయాసంలేని
విలాస నికేతనం
పురాతనం వినూతనం
ఇది నా జననధాని,
నా మరణభూమి.
అగమ్యం నా గమ్యం
అమేయం నా ధ్యేయం
అనంతం నా ధ్వాంతం
అశాంతి నా కాంతి.

మీరు మానవలోక వాస్తవ్యుల్లా కనబడుతున్నారు. మీకు బోధపడే భాషలో మాట్లాడుతాను, వినండి.

పాలు తప్ప మరేవీ తాగకుండా
అప్పుడప్పుడు ఉపవాసాలుంటూ
నిజం కనబడితే జడుసుకొని

నీడల్లా బతుకుతారేం ?
ఏమిటి సాధించాలని
ఇంత తాపత్రయం మీకు ?
ఎప్పుడూ ఏదో పనివున్నట్లు
ఎందుకు తిరుగుతారు మీరు ?
ఎవ రేం చెప్పినా నమ్ముతారు
చుక్కలలో పేక ముక్కలలో
అరచేతుల గీతలలో
భవిష్యత్తును పఠించబోతారు
ఉప్పెనగా ఉపద్రవం
ఒక్క పెట్టున ముంచెత్తినప్పుడు
దారితెలియక పరుగెత్తుతారు
దారి కడ్డుగా దాగుంటారు
నమ్మకాలను కొగలించుకొని
అమ్మకాలను నమ్ముకొని
ఎవ రెలాతిప్పితే అలా అలా గిరగిరా, గిరగిరా
తిరిగి తిరిగి తుదకు సొమ్మసిల్లి పడిపోతారు
కళ్ళకి గంతలూ మెదళ్ళకు దళ్లూ కట్టుకుని
కనబడలేదంటారు బోధపడదంటారు
విప్పండి మీ వికారపు వేషం
విశ్వసించండి వివేకాన్ని
సౌందర్యం కాపలా మీకు,
స్వాతంత్ర్యమూ మీరు కోరేది ?
స్వాతంత్ర్యం సాధించాలంటే ఏదీ తెలివి,
సౌందర్యాన్ని సందర్శించే కన్నేదీ ?
మీ నాగరికత కొలతలు నా కెరుక
మీ రోగాలకు మందివ్వగలను
కానీ మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి,
స్వ స్వరూప జ్ఞానం కావాలి.

మొదటి గొంతు : ఈ వేదాంతం వినడానికా
ఇక్కడకు మేము వస్తా ?
చవట చవక పత్రికా సంపాదకీయపు
చాదస్తపు ధోరణి చాలించు కొస్త

నిర్జీవి : నరలోకపు మర్యాదలను
తిరస్కరిస్తున్నావు నీవు
అరవకు అరవకు యిక్కడ అరిస్తే
మరణం మేలుకుంటుంది
మౌనం ఒక మహనీయగానం
జననం అది భవిష్యన్మరణం
నరకం గురించి మీకు గల
దురభిప్రాయాలు తొలగించుకొండి
ఇక్కడ చిత్రవధలు లేవు
వేడినూనె నూతులు లేవు
వాడిగోళ్ళ పిట్టలు లేవు
రంపాలు లేవు. భూకంపాలు లేవు
పాపాన్ని పశ్చాత్తాపంలో ముంచి
పంపించేస్తాం వెంటనే
ఇక్కడ శాశ్వతంగా వసించాలంటే
ఎన్నో అర్హతలు కావాలి
ఉద్యోగం కావాలంటేనే
యోగ్యతా పత్రాలు తేవాలే
నరకంలో చిరనివాసం
పరమ కష్టసాధ్యమని నమ్మండి.
ఇందుకు నేనే ఒక ఉదాహరణ
క్రిక్కిరిసిన దట్టపు తమస్సు
లో నేను చేసిన రాక్షస తపస్సు
నా జనన మరణ చంక్రమణాల సమీకరణ

రెండవ గొంతు : అంధకారలోకంలోకూడా నీకు
అహంకారం కరిగిపోలేదు
అయినా వింటాం చెప్పు
ఏమిటీ నీ వేదన నీ రోదన :

నిరీవి : మీలాగే నేనూ
భూలోకంలోనే
మానవుడై చాలా
కాలం గడిపాను.
మీలాగే నేనూ
విక్రాంతులలోనూ
విక్రీడించాను.
మీలాగే నేనూ
తారుణ్యంలోనూ
కారుణ్యంతోనూ
ఆక్రందించాను.
ఈ నాటికి నేను
పేరాసల జీను
వేరే విసిరేను
ఈ రాత్రికి నేను
సారథినై నాను.
సముద్రంఅంత హృదయం నాది ఆకాశమంత నేత్రం
మహానదుల రక్తనాళాలు మహీధరాల కిరీటం నాది
ఎడారులలో నా ఉద్రేకం ఇంకిపోనిచ్చాను
నా నేస్తాలు జలపాతాలు : ఝుంఝూనిలాలు
రావిచెట్టుక్రింద స్వతంత్రంగా
రాజ్యం చెయ్యడం నేర్చాను,
ఒంటికాలిమీద నిలబడి
ఊర్ధ్వదృష్టి సారించాను
నాఅంత మంచివాడు లేడన్నారంతా.

పత్రికలు నా పాపాలు ప్రకటించాయి,
మంచి చెడ్డల కతీతంగా నా
మనస్సును పదిలపరిచాను.
ఏ పనీ చెయ్యకపోవడం అనే
ఎంతో కష్ట కిష్ట కార్యం సాధించాను
ఎప్పుడూ ఇప్పుడులో కదుల్తాను
ఎక్కడా ఇక్కడగా చరిస్తాను
సముద్రాల రహస్యాలు గ్రహించాను
తమిశ్రాల కవిత్వాలు వధించాను.
అసత్యాల అనిత్యాన్ని జయించాను
గురుత్వాల లఘుత్వాన్ని గుణించాను
ఖరీదైన గ్రాండ్ హోటల్
కారుచీకటి సినీమా హాల్
రోగాల దేవాలయం హాస్పిటల్
ఆకాశాన్ని చీల్చుకుపోయే రాకెట్
ఆద్యంతాల నిముడ్చుకొనే బ్రాకెట్
అన్నీ ఈ రసాతలానికి సంకేతాలు
అన్నింట్లో నిరాఘాటంగా నా సంచారాలు.

మొదటి గొంతు : నిర్జీవితో సంభాషణ
నిష్ప్రయోజనం
ఇత డేం మాడ్లాడుతున్నాడో
ఇతనికే తెలియదు

రెండవ గొంతు : ఇతడిచ్చిన జాబితాకి
ఇంకొకటి కూడా కలిపితే సరి

మొదటి గొంతు : ఏముంది పిచ్చాసుపత్రి.

నిర్జీవి : నిజం చెప్పినందుకు నేస్తం
ని న్నభినందించక తప్పదు
ఉన్మాదం తురీయావస్థ
ఆ రాజ్యం కూడా మాకు కప్పం కడుతుంది

రెండవ గొంతు : అయితే తమ రెల్లప్పుడూ
అక్కడే ఉండిపోవడం మంచిది

మూడవ గొంతు : లేదు. ఈయన తత్వంలో ఏదో విశేషం ఉంది. నరకం మీద ఇతడు సాధికారంగా మాట్లాడుతున్నాడు.

నిర్జీవి : కృతజ్ఞుణ్ణి, ఇంకా నే నెనో్న నేర్చుకోవలసినవున్నాయి. ఇక నేను మీకు కనబడను. అటు చూడండి : ఆ తేజస్సును. అతడే బలిచక్రవర్తి.

మొ.గొం : నిర్జీవి మాయమైపోయాడు.

రెం.గొం : బలిచక్రవర్తి ప్రసన్నరూపాన్ని చూడు. స్వర్గధామాన్నిపరిపాలించవలసిన సౌమ్యత్వం ఆయనలో మూర్తీభవించింది. ఆయన సమీపిస్తూవుంటే శరీరం గగుర్పొడుస్తోంది. నమస్కరించాలని బుద్ధి పుడుతోంది.

బలిచ : వద్దు, వద్దు, నాకు నమస్కరించకండి. ఒకప్పుడు నేను సమస్త లోకాలనూ జయించాను. దేవేంద్రుణ్ణి స్వర్గంనుంచి తరిమివేశాను. ఐశ్వర్యాన్ని రుచిచూశాను. ఆనందాల లోతులు చూశాను. ఇప్పుడు నా కంతా సమానం, అందరినీ ఒక్కలాగే చూడగలుగుతున్నాను.

మొ.గొం : మీరు పరమ ధర్మస్వరూపులు. సర్వ సమానతత్వాన్ని సాధించారు. మీ రెక్కడవుంటే అదే స్వర్గం.

బలి : లేదు. ఈ పాతాళలోకాన్ని నేను విడిచిపెట్టలేను. పాపాత్ములను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. పతితులను బోధపరచుకుంటున్నాను.

రెం.గొం : ఆశ్చర్యం, సమస్త లోకాలనూ జయించిన బలిచక్రవర్తి అధఃప్రపంచాల అంధకారానికి బలికావడం.

మూ.గొం : ఆ కథ వినాలని వుందా ? అయితే కృతయుగంలోకి వెళ్లాలి.

(ఫేడవుట్)

వామనమూర్త్యవిర్భావ ఘట్టం

ప్రకటన : రవి మధ్యాహ్నమునం జరింప, గ్రహతారాబద్ధ చంద్ర స్థితిన్
శ్రవణ ద్వాదశినాడు శ్రోణనభిజిత్సంజ్ఞాత లగ్నంబునన్
భువనాధీశుడు పుట్టె వామనగతిం బుణ్యవ్రతోపేతకున్
దివిజాధీశ్వరుమాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్.

భిక్షాపాత్రిక నిచ్చెను
యక్షేశుడు వామనునకు నక్షయమనుచున్
సాక్షాత్కరించి పెట్టెను
భిక్షునకు భవాని పూర్ణభిక్ష నరేంద్రా :
ప్రక్షీణ దివిజ వల్లభ
రక్షాపరతంత్రుడగుచు రాజీవాక్షుం
డ క్షణమున బలి యింటికి
భిక్షాగమనంబు సేసెఁ బేదటికముతోన్.

ఆ మాయామాణవకుడు హయమేధ మఖాంతర్వేదికావాటమున
దానవేంద్రుని గాంచి-కుశపవిత్రాక్షత సంయుతంబగు
దక్షిణ హస్తంబు చాచి

వామన : స్వస్తి జగత్త్రి యీ భువన శాసనకర్తకు, హాసమాత్ర వి
ధ్వస్త నిలింపభర్తకు సుదారపద వ్యవహర్తకున్, మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధాన విహర్తకు, నిర్జరీగళ
న్యస్త సువర్ణసూత్ర పరిహర్తకు దానవలోక భర్తకున్.

బలి : వడుగా యెవ్వరివాడ వెవ్వడవు సంవాస స్థలంబెద్ది ? నీ
వడుగంబోయేడిదేది ? రత్నములో ? మృష్టాన్నంబులో ?
కన్యలో ?

వామన : ఓ నానామఖ వ్రతదాన ప్రవణానువర్తీ ! దానవచక్రవర్తీ !
ఇది నాకు నెలవని యేరీతి బలుకుదునొకచో టనకయెందు నుండ
నేర్తు నెవ్వానివాడనం చేమని పలుకుదు నాయంతవాడనై నడవనేర్తు

నీ నడవడియని యెట్లు వక్కాణింతు బూని ముప్పోకల బోవనేర్తు
నది నేర్తు నిది నేర్తునని యేల చెప్పంగ నేరుపు లన్నియు నేన నేర్తు
ఒంటివాడ నాకు నొకటి రెండడుగుల
మేరయిమ్మ సొమ్మ మేరయెల్ల
గోర్కెదీర బ్రహ్మ కూకటి ముట్టెద
దాన కుతుకసాంద్ర! దానవేంద్ర!
నీవు రాజవనుచు నిఖిలంబు నడుగుట
తగపు కాదు నాకు దగిన కొలది
యేను వేడికొనిన యీ పదత్రయమును
చాలదనక యిమ్ము చాలు జాలు.

శుక్రు: ఓహో. మోసము, మోసము
దనుజేంద్ర! యీతడు ధరణీ సురుడుగాడు
హరి విష్ణు డవ్యయుం డదితి సూతి
నీ లక్ష్మి దేజంబు నెలవు నైశ్వర్యంబు
వంచించి యిచ్చుచా వాసవునకు
ఏ దానమున నాశ మేతెంచు నదియును
దానంబు గాదంద్రు తత్త్వవిదులు
అంగీకరించిన నఖిలంబు బోవుచో
నన్యతంబు గాదు లేదనిన యెడల
మరియు నిందొక్క విశేషంబు గలదు. వివరించెద.
వారిజాక్షులందు వైవాహికములందు
బ్రాణ విత్తమాన భంగమందు
జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము పొందదధిప!

బలి: సునిశిత ధిషణాధుర్య, శుక్రాచార్య,
నిజమానతిచ్చితి నీవు మహాత్మక!
మహిని గృహస్థ ధర్మంబు నిదియ
యర్థంబు, గామంబు యశమును ప్రవృత్తియు

నెయ్యది ప్రార్థింప నిత్తుననియు
నర్థలోభంబున నరిఁ బొమ్మను బెట్లు
పలికి లేదనుకంటెఁ బాపమెద్ది ?
యెట్టి దుష్కర్ముని నే భరించెదఁగాని
సత్యహీనుని మోవజాల ననుచుఁ
బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరమున నుండి తిరుగక చచ్చుకంటెఁ
బలికి బొంకక నిజమునఁ బరఁగుకంటె
మానధనులకు భద్రంబు మఱియు గలదె ?

కారే రాజులు, రాజ్యముల్ గలుగవే, గర్వోన్న- తింబొందరే ?
వారేరీ ? సిరి మూటగట్టుకొని పోవం జాలిరే ? భూమిపైఁ
బేరైనం గలదే ? శిబి ప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మరచిరే యిక్కాలమున్ భార్గవా !
నిరయంబైఁన, నిబద్ధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో
హరుఁడైనన్, హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నౌఁ
దిరుగన్నేరదు నాదు జిహ్వ వినుమా ధీవర్య ! వేయేటికిన్.

వింధ్యావళి – బలిచక్రవర్తి భార్య :

వటుని కాళ్ళు గడుగుటకు ఇవిగో హేమఘటమున సలిలములు.

ప్రకటన : అంతట బలిచక్రవర్తి ధరణీసుర దక్షిణ చరణ ప్రక్షాళనంబు
సేసి, వామ పాదంబు గడిగి, తత్పావన జలంబు శిరంబునం
జల్లుకొని, వార్చి, దేశ కాలాది పరిగణనంబు సేసి—

విప్రాయ ప్రకటిత వ్రతాయ భవతే విష్ణుస్వరూ
పాయ వేదప్రామాణ్య విదే త్రిపాద ధరణీందాస్వా
మియంచుం గ్రియాక్షిప్రుండై దనుజేశ్వరుండు
వడుగుం జేసాచి పూజించె బ్రహ్మ ప్రీతమ్మని
ధారవోసె భువనం బాశ్చర్యముం బొందగన్.

తత్కాలంబున....

నీరధార బడగనీక యడ్డంబుగా
గలశరంధ్ర మాపగాను డెలిసి
హరియుఁ గావ్య నేత్ర మటఁ గుశాగ్రంబున
నదువనేక నేత్రుడయ్యె నతడు.

తదనంతరంబున —

మునిజన నియమాధారను
జినితా సురయువతి నేత్రజల కణధారన్
దనుజేంద్ర నిరాధారను
వనజాక్షుడు గొనియె బలివివర్జిత ధారన్.

ఇట్లు ధారాపరిగ్రహంబు సేసి —

ఇంతింతై వటుండింతయై మరియుఁదానింతై నభోవీథిపై
నంతై తోయద మండలాఁ భ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్న తుండగుచు బ్రహ్మాండాంత సంవర్థియై.

రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై కళాభరణమై సౌవర్ణ కేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి సుదంచద్వ స్త్రమై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుడు దా బ్రహ్మాండము న్నిండుచోన్.

ఒక పదమ్ము క్రింద నుర్వి పద్మమునంటి
కొనిన పంకలవము కొమరుఁ దాల్చె
ఒకరి మీద తమ్మి కొదిఁగిన తేఁటి నా
వెలసె నాకసము త్రివిక్రమమున.

పాదద్వయంబున ప్రపంచములెల్ల సమాక్రమించి త్రివిక్రముండు మూడవ యడుగును వైరోచనుని శిరస్సునైనిలిపి యతని నధఃపాతాళ మున కణంచివైచె నిది యిందలి పూర్వగాథ.

స్వ ర్గ లో క ం :

ఆహ్లాదకరమైన జంత్రవాద్యాల సంగీతంతో ఈ రంగం ప్రారంభ మవుతుంది —

ఉపనిషద్వాచకం.

సహనా పవతు
సహనౌభునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినా వధీతమస్తు
సితసునిశిత కాంతులతో
ద్యుతల మతుల కాంతిమయం
వాడని పూవులలో
వీడని తావులతో
అనంతమౌ వసంతమై
విమూత్నమై పవిత్రమై
సునిశిత సితకాంతులతో
సుఖశిఖరపు శోభలతో
అజ్ఞానం తరిమికొట్టి
విజ్ఞానం పంచిపెట్టి
వీరకథలు వర్ణించి
ప్రేమసుధలు వర్షించి
ద్యుతల మతుల దీప్తిమయం
త్రిదివ ముదిత శుభాహ్వాయం.
అప్సరాంగనల నాట్యం.

దేవేం : అదిగో, ఆ అప్సరకన్యక అమోఘంగా నాట్యం చేసింది. ఎవరా అపూర్వ లావణ్యవతి ?

దేవమం : ఆమె యింకా అర్భకురాలు ప్రభూ, దేవేంద్రులవారేమో నేడు కసుగందని పసికందుల నాశిస్తున్నారు.

దేవేం : మంత్రీ, ఆ బాలిక మన మదాలస కూతురు. నే నెరుగుదును. వెంటనే ఆమెను నా సనుక్షంలో నిలబెట్టు.

అప్స : ప్రభువులకు ప్రణామం.

దేవేం : నీ యౌవనం సాఫల్యమొందును గాక. అద్భుతంగా నాట్యం చేశావు అమ్మాయీ.

అప్స : ప్రభువుల అనుగ్రహం.

దేవేం : మాకు పరమానందమయింది. నీ పేరేమిటి అమ్మాయీ.

అప్సర: నా పేరా ? నా పేరు –

దేవేం : సిగ్గుపడకు మరి. చెప్పవూ నీ పేరు ?

అప్స : జిలాంతశ్చంద్రచపల.

దేవేం : జిలాంతశ్చంద్ర చపల. ఎంతబాగుంది పేరు. అయితే ఇంత చిన్నపిల్లకి అంత పెద్దపే రెందుకూ ? చపలా అని పిలవనా ?

అప్స : ఏమో, ప్రభువుల ఇష్టం.

దేవేం : పోనీలే. పూర్తి పేరుతోనే పిలుస్తాను. జిలాంతశ్చంద్ర చపలా, చక్కనిపాట ఒకటి పాడవూ ?

అప్సర: పాడుతుంది :

ధీరసమీరే యమునాతీరే
వసతివనే వనమాలీ
గోపీ పీనపయోధర మర్దన
చంచల కరయుగశాలీ.

మంత్రి : దేవగురువు లెందుకో తొందరగా విచ్చేస్తున్నారు ప్రభూ.

దేవేం : మంత్రీ, నీవు వారిని ఆలోచనా మందిరంలోకి తీసుకు వెళ్ళు. మేము మొదట నందనవనానికి. తర్వాత శయ్యామందిరానికి రా, అమ్మాయీ.

మొ. గొం : ఇంద్రభోగం అంటే అది.

రెం. గొం : ఇదేనా స్వర్గం? ఇంతకంటె పాతాళలోకమే బాగుండే.

చిరం : ఇంద్రుని చర్యలతో మీ
రెందుకు కొలుస్తారు స్వర్గాన్ని?

మొ. గొం : ఎవరు బాబూ మీరు?
ఇక్కడ ప్రత్యక్షమయ్యారు?

చిరం : నన్ను చిరంజీవి అంటారు
ఎప్పుడూ ఇప్పుడులో ఉంటాను
ఎక్కడా ఇక్కడగా....

మొ. గొం : ఇదివర కీయన్ని చూశాంకదూ?

చిరం : ఔను నరకంలో, నేను నిర్జీవిని. స్వర్గంలో చిరంజీవిని.

మొ. గొం : ఔరా, ఏమాశ్చర్యం?

చిరం : ఓరీ వెర్రిమానవులారా, మీది తెలిసీతెలియని గొడవ.
జీవించాలి నిరాఘాటంగా
జీవించాలి సునాయాసంగా
సత్యానికీ అసత్యానికీ
సమానదూరంగా
జీవించాలి అమోఘంగా
సేవించాలి ద్రాక్షాసవం
సాధించాలి అజరామరత్వం
శోధించాలి విరుద్ధతత్వం
పరిపాలించాలి మన్మధ సామ్రాజ్యం
ప్రతిభాసించాలి ప్రచండ వైరాగ్యం
జీవించాలి తృణప్రాయంగా
ఘుణాక్షరన్యాయుంగా
కాకతాళీయంగా
జీవించాలి ఆకస్మికంగా
జీవించాలి ఏకస్మితంగా

మొ. గొం. : చిరంజీవి చాలా హుషారుగా ఉన్నాడు.

రెం. గొం : మరి ఇది స్వర్గం కాదూ.

చిరం : నేనొక బికారిని
భిక్షకుణ్ణి
తెరవెరుగని తెరువరిని
నే నేమీ కాను.
నిరాధారుణ్ణి
నిరాకారుణ్ణి
నా జోలిలో జాలి నింపండి.
మీకు పురుగు లెంత లోకువో
పురుగుల కంత లోకువనేను అన్నిటికీ తెగించాను
నన్ను చూచి నవ్వకండి
నా మీద రాళ్లు రువ్వకండి

మొ. గొం : ధోరణి మారిందేం?

చిరం : బలిచక్రవర్తి వచ్చినట్లు పసిగట్టినట్టున్నాను. అంచేత, నా గానంలో విషాదం ప్రవేశించింది.

రెం. గొం : బలిచక్రవర్తి స్వర్గలోకాని కెందుకు వస్తాడు?

చిరం : రాదలచుకుంటే అతణ్ణి ఎవ్వరూ అడ్డలేరు. పాతాళలోకపు పాపాత్ములను, పతితాత్ములను అనాధ జీవులను, అశాంత భావులను వదలిపెట్టి అతడు రాడు. కాని ఏ కారణంవల్లనో ఇప్పుడు బలిచక్రవర్తి యిక్కడే వున్నాడని నేను చెప్పుకోగలుగుతున్నాను.

మొ. గొం : అడుగో బలిచక్రవర్తి.

రెం. గొం. : అతనిపెంట ఎవరో అమ్మాయి.

బలి : అవును. ఈ పిల్ల పేరు జిలాంతశ్చంద్రచపల. ఈ పిల్ల ఏడుపువిని యిక్కడకు వచ్చాను. ఎవరేడ్చినా నేను సహించలేను. నందన వనంలో నాకు కనబడింది. ఇంద్రుడీమెను చెరబట్టబోయాడు. నేను రాగానే పరుగెత్తిపోయాడు.

మొ. గొం : దయామయుడు బలిచక్రవర్తి.

రెం. గొం : ధర్మాత్ముడు బలిచక్రవర్తి.

బలి : ఇక నే నిక్కడ వుండనక్కరలేదు. ఈమెను తీసుకొని పాతాళానికి పొతున్నాను.

చిరం : నాకు చిరంజీవిగా ఉండాలని లేదు. నేనూ వస్తున్నాను. జిలాంతశ్చందర్శిచపలకోసం నేను నిర్జీవిని కాదలచుకున్నాను.

మరో ప్రపంచం

ప్రకటన : ఈ నాటకం ఒక యువకవి మెదడులో, అందలి సుప్త చైతన్య రంగంలో జరుగుతుంది.దీనిలో యువతీ యువకుల గొంతుకలూ, వృద్ధకంఠాలూ, ఇరవై ఒకటవ శతాబ్దపు మానవుని గొంతుకా పాల్గొంటాయి.

యువతీ యువకుల బృందగానం :

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది.
పదండి ముందుకు,
పదండి తోసుకు
పోదాం ! పోదాం పై పై కి
కదం తొక్కుతూ,
పదం పాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం !

1వ గొంతుక : ఇదంతా ఏదో కలలా వుంది.
2వ గొంతుక : ఇదంతా ఏమిటో చీకటిగా వుంది.
1వ ,, : కాదు ఎంతో వెలుగ్గా వుంది.
2వ ,, : అంతా ఏమిటో కలలాగ మాత్రం –
1వ ,, : లేదు. కలలే నిజమవుతాయి.
3వ ,, : ఎవరో వస్తున్నారు.
2వ ,, : ఏదీ నా కేం కనబడలేదు.
1వ ,, : అదుగో అటు చూడు దూరంగా.
2వ ,, : ఏమిటో నా కంతా అగమ్యగోచరంగా వుంది.
1వ ,, : చూడు. దూరంలో మబ్బులాంటి పొగమంచులాంటి పుప్పొడి దూరంలాంటి దుమారంలో.
2వ గొంతుక : అదేంకాదు. అదంతా ఒక గంధరగోళం.
3వ ,, : ఆ గజిబిజిలోంచే ఎవరో వస్తున్నారు.
2వ ,, : ఏదో వస్తున్నాది.
3వ ,, : దాన్ని వర్ణించు.
2వ ,, : టెన్నిస్ బంతిలాగుంది.
1వ ,, : ఆకుపచ్చని బంతి.
3వ ,, : ఆకుపచ్చని గాజు బంతి.
1వ ,, : అదంతా ఒక పెద్ద కన్నులాగుంది.
2వ ,, : కాదు. అంతా ఒక చెవి.
1వ ,, : అదే దాని నోరులాగ కూడా అగపడుతోంది.
2వ ,, : అదే దాని –
3వ ,, : చాలించు దగ్గర పడుతున్నాడు.
1వ గొంతుక : ఏదో మాట్లాడబోతున్నాడు.
2వ గొంతుక : ఒళ్ళంతా ఒకే కన్నుచేసుకొని దీక్షగా చూస్తున్నాడు.
1వ గొం : ఎవరు నువ్వు కనుపాపా ?
కనుపాప : (లోహకంఠం – తెలిపైన కుర్రాడు టెలిఫోన్‌లో మాట్లాడినట్టు) – నేను ఇరవై ఒకటవ శతాబ్దపు మనిషిని.

2వ గొం : మనిషి, ఆకుపచ్చని గాజుబంతి, కనుపాప ?

1వ గొం : ఇది కలా, నిజమా ?

2వ గొం : నిజంగా నువ్వు మనిషివేనా ?

కనుపాప : మనిషినే. నిజమే. కాని ఏదో పెద్ద పొరపాటు జరిగింది. ఇప్పుడు నే నెక్కడున్నాను ?

1వ గొం : ఇది ఆలిండియా రేడియో, మద్రాసు కేంద్రం.

కనుపాప : ఊహూఁ, ఇది ఎవరిదో మెదడులాగుంది.

2వ గొం : దేవాంతకుడు.

1వ గొం : ఎలా తెలుసుకున్నాడో ?

కనుపాప : ఔను. ఇది రేడియో స్టూడియో కూడా. ఫోకస్ తగ్గించి చూస్తే కనిపించింది.

1వ గొం : నువ్వు మానవమాత్రుడివి కావు.

కనుపాప : నేను మానవుణ్ణి నమ్మండి, నేను మనిషినే.

2వ గొం : నిజంగా ?

కనుపాప : నిజంగా నిదర్శనం కావాలా? మానవు డన్నవాడు పొరపాటు చేస్తాడు. నేను పొరపాటు చేశాను. భవిష్యత్తులోకి ప్రయాణం చెయ్యబోయి నా అంతర్యంత్రాలను అజాగ్రత్తగా కదల్చడంవల్ల భూతకాలంలోకి వచ్చాను. ఇది ఇరవయ్యో శతాబ్దంలాగుందే ?

1వ గొం : ఔను.

కనుపాప : అందుకే ఇంత ఉక్కిబిక్కిరిగా ఉంది. శీతోష్ణస్థితి మీ అధికారంకిందకి రాలేదని మేము చరిత్రలో తెలుసుకున్నాం. కాని ఇంత ఉక్కగా ఉంటుం దనుకోలేదు. ఇక నేను పోతున్నాను.

1వ గొం : వదు, వదు. కనుపాపా : పోవదు.

కనుపాప : లేదు. పోవాలి – కావలిస్తే మళ్ళీ వస్తాను

2వ గొం : అబద్ధం.

కనుపాప : అదేదో కొత్తమాట నాకు అర్థంకాలేదు.

2వ గొం : అయ్యో ! మీకు అబద్ధాలు తెలియవూ ?

కనుపాప : వేళ మించిపోతోంది. వెళ్ళొస్తాను.

1వ గొం : త్వరలో రావాలి.

కనుపాప : తప్పకుండా, ఇప్పుడే ఇరవై అయిదో శతాబ్దంలోకి వెళ్ళి వెంటనే వచ్చేస్తాను.

1వ గొం : వెళ్ళిపోయాడు.

2వ గొం : ఇదంతా నిజమా, కలా ?

1వ గొం : నిజం నిజం భవిష్యత్తు కనబడింది మనకి. భావిమానవుణ్ణి చూశాం మనం. అతనితో మాట్లాడాం. విచిత్రం కదూ. కలలు నిజమవుతాయి కాదూ.

యువతీ యువకులు : భవిష్యత్తుకి స్వాగతం. మానవుడికి స్వాగతం.

బృందగానం : మరో ప్రపంచం .... జిలపాతం.

1వ వృద్ధకంఠం : మరో ప్రపంచం, మరేం పనిలేకపోతేసరి.

2వ వృ : ఏదీ, ఏదీ, ఆ మరోప్రపంచం ?

1వ వృ : ఎక్కడ ?

2వ వృ : ఎప్పుడు ?

1వ వృ : ఏమిటో ఆ ప్రపంచం ? ఎలా వుంటుందో అది ?

ఒక గద్గదకంఠం : జీవు లెనుబదినాల్గు లక్షలు
చావు పుట్టుక లిక్కడా
ఎవరు చేసిన పాపకర్మము
లనుభవించే దక్కడా....

అదీ మరో ప్రపంచం.

ఒక వృద్ధ : మరో ప్రపంచం అంటే మరణం.

ఇంకో వృద్ధ : మహా ప్రస్థానం అంటే మరణం

ఫేడ్ ఇన్....(పుట్టినబిడ్డ ఏడ్చిన చప్పుడు)

ఒక యువకంఠం–స్త్రీ : మరో ప్రపంచం అంటే జిననం సృష! ఈలోకం ఇహలోకం, ఇప్పుడే, ఇక్కడే.

బృందగానం : దారిపొడుగునా గుండె నెత్తురులు
తర్పణచేస్తూ పదండి ముందుకు
బాటలు నడిచీ, పేటలు గడచీ
కోట లన్నిటిని దాటండి.

నదీ నదాలూ, అడవులు, కొండలు,
ఎడారులా మన కడ్డంకి ?
(పై చరణం పాడుతున్నంత సేపూ, తగ్గుస్థాయిలో వినబడుతున్న
శిశువు ఏడుపు పాట ఆగగానే స్థాయి పెంచుతుంది.)

ఒక యువ కంఠం : అదే ప్రపంచ భాష. భవిష్యత్తుపాట. సార్వకాలిక
సార్వ స్థానికమైన మానవుని భాష.

2వ ,, భవిష్యత్తుకి స్వాగతం.

3వ ,, మరణం లేని మానవాత్మకి స్వాగతం.

గద్గద కంఠం : ఏమి జన్మము ఏమి జీవనము
ఈ మాయకాయము
ఏమి శాశ్వత మేమి—
(ఆ పాటను ఉప్పెనగా ముంచివేస్తూ)

బృందగానం : పదండి ముందుకు
పదండి తోసుకు
పోదాం, పోదాం పైపైకి
ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన
సోమరులారా చావండి !
నెత్తురు మండే, శక్తులు నిండే
సైనికులారా రారండి !
హరోం హరోం హర, హర హర, హరహర
హరోం హరా అని కదలండి !
మరో ప్రపంచం, మహా ప్రపంచం
ధరిత్రినిండా నిండింది.

గద్గద : ఈ రోజుల్లో ఇదో పిచ్చి, ఏమిటో వీ కందరికీ ఈ వెర్రిభ్రమ.
ఏన్నాళ్లు బతికినా ఏమి సామ్రాజ్యమే
కొన్నాళ్ళ కో రామచిలుకా
మూన్నాళ్ళ ముచ్చటకే మురిసేవు తుళ్ళేవు
ముందుగతి కానవే చిలుకా.

1వ యువకంఠం : ఎవరీ మృత్యుదూత ? ఏమి టా ఏడుపుకూత ?
మనుష్యులు మరణిస్తారు. మానవునికి మరణం లేదు.
2వ ,, : భవిష్యత్తుకి స్వాగతం.
3వ ,, : మానవునికి స్వాగతం.

బృందగానం : పదండి ముందుకు
పదండి తోసుకు
ప్రభంజనం వలె హోరెత్తండి
భావవేగమున ప్రసరించండి.
వర్షుకాభ్రముల ప్రళయఘోషవలె
ఘేళ ఘేళ ఘేళ ఘేళ విరుచుకు పడండి
పదండి, పదండి, పదండి ముందుకు
కనపడలేదా మరో ప్రపంచపు
కణ కణ మండే త్రేతాగ్ని

గద్గద : ఇంకా తగలెట్టండి. ఇప్పటికే మండుకు పోతోంది కాలం.
ఏమిటో ఆ మరో ప్రపంచం ?
ఒక ఎగతాళి గొంతుక : ఎలా వుంటుందో అది ?
ఇంకొక ఎగతాళి గొంతుక : ఎక్కడ దొరుకుతుందో ?
1వ ఎగతాళి గొంతుక : ఏమిటీ చెప్మా దానికి దారి ?
2వ ,, : వోట్లు ఇవ్వడమా ?
3వ ,, : యోగాభ్యాసమా ?
2వ ,, : పారిశ్రామికాభ్యుదయమా ?
గద్గద కంఠం : పరస్పర సంహారమా ?
1వ ఎగతాళి గొంతుక : భాష నుండి కొన్ని పదాలను శాశ్వతంగా తొలగించడంవల్ల కాబోలు.
3వ ఎగతాళి గొంతుక : భూలోకము నుండి కొన్ని జాతులను పూర్తిగా తుడిచిపెట్టడంవల్ల కాబోలు.
2వ ఎగతాళి గొంతుక : శబ్ద విస్తరణ యంత్రాలు పెట్టి ఏదో ఒక పతాకం పాతి, వేనవేల జనంముందు ఘాటుగా ఉపన్యసిస్తే :

ఉపన్యాసం : సోదర సోదరీమణులారా, నేడు చాలా సుదినం. ఇంకొకచోటికి పోకుండా, ఇక్కడకే వచ్చినందుకు మిమ్మల్ని, మిమ్మందర్ని ఆకర్షించగలిగినందుకు నన్నూ చాలా అభినందించు కొంటున్నాను. నూతన జీవితకాంతులు మీమీద ప్రసరించడం ప్రారంభమవుతోంది. నేను చూపించిన మార్గంలోనే మీరంతా నడవండి. కనుచూపుమేరలో అదిగో మన గమ్యస్థానం కనబడుతోంది. ఈ మాట మీకు ఇరవై యేళ్ళ క్రిందటే చెప్పాను. చూశారా, నేటికి నిజం రుజువయింది. (కరతాళధ్వనులు)

2వ ఎగతాళి గొంతుక : ఇక్కడ భూలోక స్వర్గాలు విక్రయించ బడును. వెంటనే కొనుక్కోండి. వెల స్వల్పం. ఫల మధికం.

2వ ఎగతాళి గొంతుక : నకలు సరుకు చూసి మోసపోకండి. "మరో ప్రపంచం" మార్కు గుర్తించుకోండి. భవిష్యత్తును పొట్లాలుకట్టి పంచ భాషల చీటీలతో సహా పంచిపెడుతున్నాము. ఎండకాలపు తగ్గింపు ధరలు.

యువకంఠం : ఆహా, ఈ పెద్దమనుషు లెవరోకాని, తమ వెటకారంలోనే మా కొక గుణపాఠం బయలుపెడుతున్నారు. అమ్మడం, కొనడం తప్ప, ఇంకో విధంగా వీళ్ళ మనస్సులు ఆలోచించనే లేవని స్పష్టం చేస్తున్నారు. రూపాయణా పైసలు లేని లోకంలో, వీరి కూపిరి సలపదు కాబోలు.

ఇంకొక : ఔను పాపం. నేటి జీవితపు ఉష్ణోగ్రతని కొలవడానికి ధర్మామీటరు ధనం. ఈ లోకంలో అన్నీ అమ్ముడుపోతూనేవున్నాయి. చదువు, సౌందర్యం, కళ, సాహిత్యం, శాస్త్రం, శ్రమ – అన్నీ. ప్రయాణం, పెళ్ళి, యుద్ధం – ఏది చెయ్యాలన్నా డబ్బే ప్రధానం.

మొదటి : నీరయితే నిమ్నానికి ప్రవహిస్తుంది. కాని, ధనం మాత్రం ఉన్నత క్షేత్రాలకి తప్ప, ఇంకోచోటికి పారదు. ధనస్వాములవారి హయాంలో ప్రజల బాధల గుణకారం జరిగినంత జోరుగా, బ్యాంకుల్లో అంకెలు పెరిగిపోతాయి. ఆవశ్యక వస్తువులు చీకట్లో అదృశ్య మవుతాయి. సంఘ ద్రోహులు ప్రజల బ్రతుకులను పణంగా పెట్టి జూదం సాగిస్తారు.

2వ యువ : ఇదీ మన ప్రపంచం ? ధనస్వామిని రక్షించడానికి న్యాయ వాదుల శక్తి యుక్తులూ, రాజకీయవాదుల నక్కజిత్తులూ, విజ్ఞాన వేత్తల తెలివితేటలూ, అన్నివేళలా పారా ఇస్తాయి. ఈ లోకం నుంచి ఎగిరిపోయి శిరోవేషనం ధరించిన ఏ వెమానికుడూ, దూర దర్శినీ యంత్రంతో విహాయసంనుంచి విహంగావలోకనం చేస్తూ, ప్రతీ ఒక్క చదరపుమైలుకీ సగటు సంఖ్యని ఎంతమంది నిర్భాగ్యులున్నారో ఎన్నడూ లెక్క కట్టబోడు.

శివ యువ : ఇదీ మన ప్రపంచం? ప్రజలలో నిస్పృహ పరిపక్వ మవుతున్నకొద్దీ, జీవితంమీద విరక్తి జనిస్తుంది. పిల్లల్ని పోషించలేని పెదమనిషి పెళ్ళాల్ని తిడతాడు కొడతాడు. అనుదినం అనంతంగా ఒకే అభినయంచేసే ట్రాఫిక్ పోలీసువాడు అమాంతంగా ఏకాంతం లోకి పోయి, ఎవరితోనూ చెప్పకుండా విషం తాగేస్తాడు. జీవితంలో నీరసం దారుణ మవుతున్నకొద్దీ, మనుష్యులకి మతులు చెడిపోయి కాళ్ళమీద నిలబడి కళ్ళతో అరుస్తారు.

మొదటి యువ : ఇదీ మన ప్రపంచం. విప్లవ పద్ధతులలో తరిబీయతిచ్చే విశ్వ విద్యాలయాలు లేకపోవడంవల్ల, విద్యార్థులు పరీక్షపత్రాలని ప్యాస్ మార్కుల ద్వీపానికి తీసుకుబోయే పడవలుగా మాత్రమే పరిగణిస్తారు. వాళ్ళ అధ్యాపకులు సహా, మధ్య తరగతుల మర్యాద లకు కట్టుబడి, నిన్నటి అబద్ధాలనే నేడుకూడా సరఫరా చేస్తూ, తల లోని తెలివీ. తలపైని వెంట్రుకలూ కోల్పోయి, ముప్పై యేళ్ళకే ముసిలివాళ్ళయి పోతారు.

2వ యువ : ఆపాదమస్తకం రుజాగ్రస్తమైన, ఈ ప్రపంచంలో సర్వ వేళలా సమాజానికి అంతఃకరణలుగా పనిచేయపలసిన కవులు సైతం, సామాజిక శరీరంలో బ్రహ్మరంధ్రందాకా పర్యాప్తమయ్యే సుషుమ్నానాడిగా స్పందించవలసిన కవులు కూడా స్తంభించి పోతారు. గంతలుకట్టిన గానుగెద్దుల్లాగ లాగలేనంత బరువు భరించే ఛందస్సులచేత సర్కస్‌ఫీట్లు చేయిస్తూ, అర్థాన్ని మొయ్యలేక అలసిపోయిన మాటలు చేసే మూగసంజ్ఞలకి మూర్ఛపోతారు.

3వ యువ : ఇదీ మన ప్రపంచం. ఇక్కడ ఈ పరస్పర విద్వేషాగ్నుల మధ్య ముంచుకొచ్చే మృత్యువాంఛల నడుమ, నిరాశాంధకారాల నీడలకింద రకరకాల కుహనా ప్రవక్తలు బయలుదేరుతారు. జీవిత సంగ్రామంలో అన్ని రంగాలలోనూ పరాజయం పొందిన భ్రష్ట ప్రాణులంతా, వీళ్ళచుట్టూ భజనచేసి పారలౌకిక మీమాంసల్లోకి పలాయన మవుతారు. ఈ విశుష్క-జీవుల ఐహిక సమస్యల్ని ఆముష్మికంగా భీమా చెయ్యడానికి భగవంతుని ఏజింట్లమంటూ ప్రచారం సాగించే పేరు పేరు వరసల దంభసన్యాసులు పెచ్చు పెరిగి పోతారు.

ఒక వృద్ధ : చాలు ఇక చాలు. చాలించండి, మీ ధోరణి. అయినా యీ కాలపు కుర్రకారంతా ఇలా తయారవుతూందేమిటి ? పెద్దలమీద గౌరవం లేనేలేదుకదా. సంప్రదాయాలమీద భక్తి సన్నగిల్లి పోయింది కదా. రాజభక్తిసూట సరే దేశభక్తికూడాలేదు. నానాటికీ వీళ్ళలో నాస్తిక భావాలు మాత్రం ముదిరిపోతున్నాయి.

ఇంకో వృద్ధ : ఇదంతా వొట్టి కుర్రతనపు విరగబాటు. అనుభవంవల్ల సవరించబడని ఉద్రేకంచేసే అతివాద విమర్శ-కాలం గడిచి కష్టాలు వొంటబట్టిన తర్వాత వీళ్ళకే తెలుస్తుంది. ఈ జిబ్బులన్నీ వర్తమానకాలపు ప్రత్యేక లక్షణాలు కావని; ఇవన్నీ మనతోబాటు ఎప్పుడూ ఉంటాయని; ఎందరు ప్రయత్నించినా వీటిని కుదర్చడం ఎన్నటికీ సాధ్యంకాదని.

ఒక వృద్ధ : అసలు సమాజమనేదే మిథ్య - ఒక్కొక్క వ్యక్తి తన శరీరం అనే కారాగృహంలో ఒక్కొక్కఖైదీ. శిక్ష అనుభవిస్తూ చివరికి మృత్యువులో విడుదలకి ఎదురుచూడడం తప్ప, మానవుడు చెయ్య గలిగింది మరొకటేదీ లేదు.

2వ వృద్ధ : ఆద్యంత రహితమైన విశ్వంలో జిననమరణాల శాఖా చంక్రమణంచేసే మానవమాత్రుడికొక ప్రాముఖ్యం ఇవ్వడం అనవసరం. సూర్యుడిలోంచి మంటబంతిగా విడిపోయిన భూగోళంమీదమానవుడు లేనికాలం ఒకటుంది. సూర్యుడు చల్లారిపోయి మంచుముద్దగా

పేరుకుపోయే భూలోకంనుంచి మానవుడు నిష్క్రమిస్తే, సృష్టి దృష్టిలో అదొక నిట్టూర్పు విడువదగ్గ విషాద సంఘటన కానేరదు.

ఒక యువ : ఈ నిరాశావాదంతో మాకు నిమిత్తంలేదు. జీవితానికి పరాజయం వుందని మేము అంగీకరించలేము. భూమిమీద కాకపోతే, ఇంకో ఖగోళంలో ప్రాణం పుష్పిస్తుంది. మానవుడిలో మాకు నమ్మకం ఉంది. భవిష్యత్తులో మాకు విశ్వాసం ఉంది.

ఒక వృ : కాలం అనేది ఒక భ్రాంతి. కాబట్టి భవిష్యత్తులో నమ్మకం భ్రాంతిలో భ్రాంతి.

యువ కం : భవిష్యత్తుని మేం చూశాం. భావి మానవుడు మాకు కనిపించాడు.

2వ వృ : వ్యర్థస్వప్నాలు అంతా మిథ్య, మృత్యు వొక్కటే యదార్థం

ఒక యు :- సరే మీరు గతకాలాన్ని నెమరు వేసుకుంటూ మృత్యువునే ఆరాధించుకోండి. పెనక్కి పెనక్కి వెళ్ళిపోండి.

గద్గద కం : అలానే వెళ్ళిపోతాం, పెనక్కి కాకపోతే మాకు భవిష్యత్తులో ఏముంది కనుక ?

ఏయ్ టాక్సీ, పెనక్కి ఇంకా పెనక్కి
గోడ కనబడలేదా పోదాం పెనక్కి
ఈ సందుకి సులుపు లేదు. పోపో పెనక్కి
హేహే టాక్సీ ఇలా తెచ్చాపేం, ఇంక పెనక్కి
ఓయ్ నావికా, మళ్ళించు పడవ
ఈ నీళ్ళు ఎంతదూరం వెళ్ళినా ఇంతే
గాలి మారింది నావికా పెనక్కి తిప్పు పడవ
వ్యర్థం ఈ ప్రయాణం వెళ్ళిపోదాం పెనక్కి
అమ్మాయీ, జీవితం, అలిసిపోయాం మనం
నీ జుత్తు తెల్ల బడింది నా ఆశ చల్లబడింది.
నా నాళాల్లో ప్రవహించేది నెత్తురు కాదు జావ.
అమ్మాయీ హడలిపోయాం పెనక్కి పట్టించు తోవ

సినిమా ఆపరేటర్ స్లోమోషన్ ఫ్లాష్‌బాక్
బద్దలైన నా స్వప్నాల రంగు గాజుపెంకు లేవీ
చివికిన నా యౌవనపు సీతాకోకచిలుక లేవీ
నా పారిపోయిన చిన్నతనపు పచ్చదనం ఏదీ
అమ్మాయీ జీవితం
ఆనందం, సౌందర్యం
ఘోరమైన దోపిడి జరిగింది
పారిపోదాం పెనక్కి.

మేం వెళ్ళిపోతున్నాం అమ్మాయిలూ, అబ్బాయిలూ. ఇదిమాత్రం జ్ఞాపకం ఉంచుకోండి. మీమీద మాకు కోపం లేదు. యౌవనోత్సాహంవల్ల ఇంద్రధనుస్సు రంగులతో ఏవో వింతలోకాలు చిత్రించుకుంటారు మీరు. అవి తామరాకులమీద నీటిబిందువుల్లాగ ఎంత అందమైనవో అంత అశాశ్వతమైనవి.

యువ కం : ఇకమీరు వెళ్ళండి. మాకుకూడా మీమీద కోపం లేదు. మీ దృక్పథాన్నే మేము సహించలేము. మీది వెనుక చూపు. మాది ముందు చూపు.

2వ యువ : భవిష్యత్తును చూశాం మేము. భావిమానవుడు కనిపించాడు మాకు. మళ్ళీ ఇప్పుడే వస్తాడు.

వృద్ధ : అర్థంలేని ఆశలు, ఆధారంలేని స్వప్నాలు.

యువ కం : భవిష్యత్తులో మాకు నమ్మకం వుంది. మానవుడిలో మాకు విశ్వాసం వుంది.

రాశిచక్ర గతులలో,
రాత్రిందివాల పరిణామాలలో,
బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో,
కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన
పరమాణువు సంకల్పంలో
ప్రభవం పొందినవాడా :

మానవుడా ! మానవుడా !
ఆలోచనలు పోయేవాడా !
అనునిత్యం అన్వేషించేవాడా !
చెట్టూ, చెరువూ
గట్టూ పుటా
ఆకసంలో, సముద్రంలో
అన్వేషించేవాడా !
అశాంతుడా ! పరాజయం ఎరుగనివాడా !
ఊర్ధ్వ దృష్టి ! మహామహుడా !
మహా ప్రయాణికుడా !
మానవుడా ! మానవుడా !
అవిభక్త కుటుంబీ !
ఏకరక్త బంధూ !
మానవుడా ! మానవుడా !

యువ కం : కనుపాప వస్తున్నాడు.

2వ యువ : ఔను. వస్తానని అన్నాడు. అలాగే వస్తున్నాడు. వాళ్ళ ప్రపంచంలో అసత్యానికి చోటులేదు.

వృద్ధ : కనుపాప ఎవరు ?

యువ : భావి మానవుడు. అదిగో వస్తున్నాడు.

వృద్ధ : మా కే కనుపాపలూ కనబడలేదు.

యువ : మీ కళ్ళు గతాన్ని తప్ప భావిని చూడం అని భీష్మించుకున్నాయి. మీకు కనుపాప ఎలా కనపడతాడు ?

వృద్ధ : అంతా భ్రాంతి. అంతా మిథ్య.

1వ యువ : అదుగో కనుపాప.

2వ యువ : ఆకుపచ్చని గాజుబంతి.

3వ యువ : భావి మానవుడు.

కనుపాప : మాట నిలబెట్టుకోవడానికి వచ్చాను. అంతే ఈ వాతావరణంలో, నేను ఉండలేకపోతున్నాను.

1వ యువ : మాకోసం కొంతసేపైనా ఉండాలి. కనుపాపా మీ కాలపు విశేషాలు చెప్పవూ ?

కనుపాప : అడగండి చెబుతాను.

1వ యువ : అంతా ఆశ్చర్యంగా వుంది. ఏం అడగాలో తోచలేదు.

2వ యువ : ఎన్నో అడగాలని ఉంది. ఏం అడగడానికీ తోచలేదు.

1వ యువ : కనుపాపా ! మీకు మరణం ఉందా ?

కనుపాప : మేము కాలంలో జీవిస్తాము. కాలాన్ని అర్థం చేసుకున్న వాళ్ళకి మరణం లేదు.

2వ యువ : కనుపాపా మీకు ఆకలి వేస్తుందా ?

కను : ఆకలి ? ఆ మాటకి నా కర్థం తెలియదు.

2వ యువ : కాదు. మీకు ఆహారం అక్కర్లేదా ?

కను : ఓహో అదా ? ఈ సమస్యను చెట్లు ఎప్పుడో పరిష్కరించాయి.

2వ యువ : అందుకా ఆ ఆకుపచ్చదనం ? సూర్యకిరణాలనే మీరు తింటున్నా రన్నమాట.

కను : కిరణాలని తినం. వాటి శక్తిని పీల్చుకొని –

1వ కం : సరే. ఈ తిండి ఘోషకేంగాని, ఒక సంగతి చెబుదూ, నువ్వి ప్పుడు తెలుగు భాష మాట్లాడుతున్నావు. మీ రంతా ఇదే బాష మాట్లాడుతారా ?

కను : మే మసలు మాట్లాడుకోము. భాష చాలా అసమగ్రమైన పనిముట్టు. ఏ ఊహనీ అది విస్పష్టంగా, అసందిగ్ధంగా తెలియజెయ్యలేదు. నా మాటలుకూడా మీకు సరిగా అర్థమవుతున్నాయో లేదో తెలియదు. ఇరవయ్యో శతాబ్దంలో తెలుగు జనులమధ్య ఉన్నాను. కాబట్టి నా ఊహాయంత్రాలు తెలుగు ధ్వనులు చేస్తున్నాయి.

1వ కం : అయితే మీరు ఒకరి భావాలు మరొకరి కెలా ప్రకటించు కుంటారు ?

కను : పరస్పరం ఊహలతోనే ప్రసంగించుకొంటాము. ఈ సమస్యను కూడా చెప్లే పరిష్కరించాయి.

2వ కం : నువ్వు చెట్టువా?

కను : కాను. అయితే వృక్షలతత్వం మాలో చాలామటుకు జీర్ణించింది.

1వ కం : అదెలాగ?

కను : వినండి. ఇరవై ఒకటవ శతాబ్దపు తొలి సంవత్సరాలలో రెండవ పరమాణు యుద్ధం జరిగింది. అందులో-

1వ కం : మొదటి పరమాణు యుద్ధం ఎప్పుడు జరిగింది?

కను : ఇరవయ్యో శతాబ్దంలో, అంతకన్న ఎక్కువ నన్నడగవద్దు.

2వ కం : పోనీ అది యెవరిమధ్య జరిగింది? ఎలా పరిణమించింది?

కను : రెండు విభిన్న దృక్పథాలుగల ప్రపంచరాజ్యాల మధ్యజరిగింది. 48 గంటలయుద్ధం అని దానికి చరిత్రలో పేరు. దాని ఫలితంగా రెండు రాజ్యాలూ తుడిచిపెట్టుకుపోయాయి. భూమి అంతా ఒక ఎడారిగా-ఇంతకన్న మంచిమాట నాకు దొరకలేదు-భూమి ఒక ఎడారిగా మారింది. లోకం మొత్తంమీద కొన్ని వందలమంది మనుష్యులూ, కొన్నివేల చెట్లూ మాత్రమే మిగిలాయి. చెట్లకి మనుష్యులకి మధ్యస్థంగా గోళాకారం గల జీవులు కొత్తగా ఆవిర్భవించారు. వాళ్ళ సంతతివాళ్ళమే మేము. రెండో పరమాణుయుద్ధం జరిగినదాకా ప్రాణికోటి పరిణామంలో జంతుతత్వం, వృక్షతత్వం విడివిడిగానే అభివృద్ధి చెందుతూ వచ్చాయి. గోళాకారులలో సంఘర్షణ క్రమక్రమంగా తీవ్రరూపం ధరించింది. నిజానికి ద్వితీయ పరమాణు సంగ్రామం మానవునిలో జంతుతత్వానికీ, వృక్ష తత్వానికీ మధ్య జరిగిన యుద్ధం. అందులో కూడా యే తత్వమూ జయించలేదు. ఒక కొత్త పరిణామం మాత్రమే జరిగింది. దాని ఫలితమే మేము.

1వ యువ : కనుపాపా, 25వ శతాబ్దంలోకి వెళ్ళే నన్నావు. అప్పటి విశేషాలు చెప్పవూ?

కను : నాకవి సరిగా బోధపడలేదు. మేము ఎనమండుగురం కలిసి పరిశోధనకని బయలుదేరాం. నా యంత్రాలలో పొరపాటువల్ల ఇటు వచ్చేశాను. నేను మళ్ళీ వెళ్ళిపోవాలి. సమిష్టిమీద పరిశోధన సాగిస్తున్నాం. సమిష్టిసుదనే మాకు అర్థం అవుతుంది. ఇక నన్ను బలవంతం చెయ్యకండి, నాకు వ్యవధి లేదు.

1వ యువ : ఒక్కటిమాత్రం చెప్పు కనుపాపా. మీలో ఎవ్వరికీ వ్యక్తిత్వం లేదూ ?

కను : ఏం ప్రశ్న ఇది. సమిష్టి బాధ్యతలో వ్యక్తిత్వం ఎన్నడూ హరించుకు పోనక్కరలేదు. నేనున్నానా ? సమగ్ర సమాజ జీవితంలో నా వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసిస్తుంది. వ్యక్తిత్వమంటే ఏకాంతం అనుకుంటారు మీరు. కాబట్టే మీ కందరికీ ఇంత ఒంటరితనం.

1వ యువ : మరి మీకు రహస్యాలు లేవూ?

కను : రహస్యాలా? మేము గోళాకారపు గాజు గృహాల్లో జీవిస్తాము. భూమి ఆకారంతో, విశ్వం ఆకారంతో, మా శరీరాలనీ, నివాసాలనీ సమన్వయించుకున్నాం. ఏ క్షణంలో ఎక్కడ ఎవరేం జేస్తున్నదీ ఇంకొకళ్ళకి ఎప్పుడూ తెలుస్తూనే ఉంటుంది. ఆఁ వస్తున్నాను.

1వ యువ : వెళ్ళిపోయాడు.

2వ యువ : భవిష్యత్తు ఆకర్షణీయంగా లేదూ?

వృద్ధ : అంతా పెద్ద భ్రమ. అంతా వొట్టి కల.

1వ యువ : తాతా, నువ్వు భావిమానవుడి మాటలు వినలేదూ ?

వృద్ధ : నేను నిద్రపోతున్నాను. మీరు కలలు కంటున్నారు.

1వ యువ : కలలే నిజమవుతాయి : భవిష్యత్తును మేం చూశాం. భావి మానవునితో మేం మాట్లాడాం.

బృందం : మరో ప్రపంచం....
కనబడలేదా మరో ప్రపంచపు
కణకణ మండే ప్రతిభాగ్ని.

★

Blank Page

మహాకవి శ్రీశ్రీ రచనలు

1. మహాప్రస్థానం రు. 1-25
2. మూడుయాభయిలు రు. 1-00
3. ఖడ్గసృష్టి రు. 2-50
4. గురజాడ రు. 1-25

(పోస్టేజి అదనం)

ప్రతులకు:

విశాలాంధ్ర ప్రచురణాలయం
పీలూరు రోడ్డు :: విజయవాడ-2

విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బజార్ :: హైదరాబాద్